www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 51 | గురువారం | 10 ఆగస్టు, 2017

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





శ్రీరాం సాగర్‌కు పునరుజ్జీవం
16 లక్షల ఎకరాలకు పచ్చని పంటల వరం

తెలంగాణ వర ప్రదాయిని అయిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టును గత పాలకులు పట్టిపోయేలా చేశారు. చివరి ఆయకట్టు దాకా నీరందిన చరిత్ర లేనే లేదు. పంట పండింది లేదు. కడుపు నిండింది లేదు. ప్రాజెక్టు ఉండీ లేని సమానమైంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు దార్శనికతతో భవిష్యత్ అవసరాలు తీర్చే విధంగా శ్రీరాంసాగర్ కు తిరిగి పునరుజ్జీవనం ఇచ్చే సృజనాత్మక పథకానికి ఆకృతినిచ్చారు.

ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవన పథకం

ప్రధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి ఒక్క చుక్క నీరు రాకున్నా సరే.. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళ ఉట్టిపడేలా రూ.2వేల కోట్లతో ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవం పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రాణహిత ద్వారా గోదావరికి వచ్చి చేరుతున్న నీటిని మేడిగడ్డ నుంచి తోడి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి మళ్లిస్తారు. మేడిగడ్డ నుంచి గోదావరి నీటిని ఎల్లంపల్లి, ఎస్.ఆర్.ఎస్.పి. వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మానేరుకు తరలిస్తారు.

వరదకాలువను జలాశయంగా మారుస్తారు. అన్ని కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతారు. ఎస్.ఆర్.ఎస్.పి. కాలువల్లో నిరంతరం నీరు పారేలా, అన్ని చెరువులను నింపేలా పథకం.

గౌరవ ముఖ్యమంత్రి

శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

గారి చేతుల మీదుగా లక్షలాది మంది రైతుల ఆనందోత్సాహాల నడుమ...

నేడే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం శంకుస్థాపన

స్థలం: ఎస్.ఆర్.ఎస్.పి., పోచంపాడు గ్రామం, నిజామాబాద్ జిల్లా

తేది: 10 ఆగస్టు 2017, సమయం: ఉదయం 11 గంటలు,

బహిరంగ సభ: మధ్యాహ్నం 12 గంటలు

గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతంలో ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టి తెలంగాణ నేలను తడిపేలా ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. గత పాలకులు తెలంగాణను వంచిస్తూ లోపభూయిష్టంగా చేసిన డిజైన్లను మార్చి తెలంగాణ అవసరాలకు తగినట్టు రీ డిజైన్ చేసిండు మన ముఖ్యమంత్రి కేసీఆర్.

తీరుతున్నది మన రైతుల నీటి కల - తెలంగాణ నేలంతా ఇక అపూర్వ జలకళ

ఏడు జిల్లాలకు వర ప్రదాయిని

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం: పాత కరీంనగర్, వరంగల్,మెదక్, నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు... శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు జలాశయాల కింద ఉన్న మరో 18 లక్షల ఎకరాలను స్థిరీకరించడం... దారి పొడుగున ఉన్న వందలాది గ్రామాలకు , హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించే బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. వచ్చే ఏడాది నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు గోదావరి నీరు అందుతుంది.

వలసలు ఆపే కల్పతరువు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు: మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకం.

శరవేగంగా పూర్తవుతున్న

ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు : పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, జీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి శరవేగంగా పూర్తి చేయడం వల్ల 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వెసులుబాటు కలిగింది.

నల్గొండ ఫ్లోరైడ్ బాధలు తీర్చి బతుకునిచ్చే

డిండి ఎత్తిపోతలు: పాత నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు.

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే

సీతారామ ప్రాజెక్టు : పాత ఖమ్మం జిల్లాలో 3.87 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టుకు, 6.44 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించిన పథకం.



గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారితో నీటి పారుదల శాఖామాత్యులు, శ్రీ తన్నీరు హరీష్‌రావు గారు

ఆదిలాబాద్ పొలాలకు ప్రాణం పోసే

ప్రాణహిత ఎత్తిపోతల పథకం : ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు ప్రాణహిత నది నుంచి సాగునీరు అందించే పథకం

తుపాకుల గూడెం బ్యారేజితో

దేవాదులకు నిరంతర నీరు: గోదావరి నదిపై తుపాకుల గూడెం వద్ద బ్యారేజి నిర్మించడం వల్ల దేవాదుల ఎత్తిపోతల పథకం పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

పాలేరు బతుకులు పండించే


భక్త రామదాసు ఎత్తిపోతల పథకం : రికార్డు స్థాయిలో 11 నెలల్లోనే పూర్తయి కరువు పీడిత పాలేరు నియోజకవర్గంలో 59వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పథకం.

మిషన్ కాకతీయతో మారిన పల్లె వాతావరణం

సమైక్య పాలనలో శిథిలమైన 46వేల చెరువులను పునరుద్ధరించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతున్నది. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలమట్టం పెరిగింది. పూడిక మట్టి పోసుకోవడంతో పొలాల్లో భూసారం పెరిగింది. చెరువుల్లో జలకళ ఉట్టి పడడంతో పల్లెల వాతావరణమే మారిపోయింది. చేపల పెంపకానికీ ఉపయోగపడింది. రెండు దశల్లో అమలు అయిన మిషన్ కాకతీయ ఫలితంగా గత ఖరీఫ్, రబీ పంట కాలంలో రికార్డు స్థాయిలో చెరువుల కింద 15 లక్షల ఎకరాలకు సాగు నీరు అందింది.

సాగునీటి రంగంలో మూడేళ్లలో సాధించిన మరిన్ని విజయాలు

• ఎస్.ఆర్.ఎస్.పి. స్టేజ్ 2 పనులు పూర్తి చేయడం ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు • నాగార్జున సాగర్ లో లెవల్ కెనాల్ పనులు పూర్తి చేయడం ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు • ఉదయ సముద్రం పనులు పూర్తి చేయడంతో లక్ష ఎకరాలకు సాగునీరు • దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు • శ్రీపాద సాగర్-ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం ద్వారా 1.78 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు • కడెం పథకం కింద 30వేల ఎకరాలు, మంథని ఎత్తిపోతల పథకం కింద 7వేల ఎకరాలు స్థిరీకరణ. • లోయర్ పెన్ గంగ ద్వారా 37వేల ఎకరాలకు, చనాఖా-కొరాట బ్యారేజి నిర్మాణం ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు • సింగూరు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం ద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు • మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టులైన నీల్వాయి, ర్యాలి వాగు, గొల్లవాగు, పెద్ద వాగు, కొమురంభీమ్, మత్తడి వాగు, గడ్డెన్న-సుద్దవాగు, కిన్నెరసాని కెనాల్, పాలెం వాగు, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయడం ద్వారా దాదాపు లక్షా 50వేల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితులు ఏర్పడినాయి.



నీటి పారుదల శాఖ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము

నేడు ఎస్‌సిఆర్‌ఎంయు జనరల్ కౌన్సిల్ సమావేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్‌ఎంయు) వార్షిక జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 10న సాయంత్రం 5 గంటలకు రైల్ నిలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌సిఆర్‌ఎంయు అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకర్‌రావు తెలిపారు. ఈ సమావేశాన్ని ఎస్ సిఆర్ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా అఖిల భారత రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా, రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి, అతిథిగా ఎస్‌సి ఆర్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఎన్.వి.రమణారెడ్డి పాల్గొంటారని వారు ఒక ప్రకటనలో వివరించారు.

పార్కుల్లో 25 లక్షల మొక్కలు నాటుతాం

మన తెలంగాణ / హైదరాబాద్ : హరిత హారం కింద ఇండస్ట్రియల్ పార్కుల్లో 25 లక్షల మొక్కలు నాటుతామని టిఎస్‌ఐఐసి ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు పారిశ్రామిక పార్కులు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటనున్నామన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బూచనెల్లి పారిశ్రామిక వాడలో బాలమల్లు మొక్కలు నాటారు. పారిశ్రామిక పార్కులను కాలుష్యర హితంగా మార్చేందుకు ఇది దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పారిశ్రామిక వేత్తల సంఘం అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, టిఎస్ ఐఐసి జోనల్ మేనేజర్లు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరం... విహంగ వీక్షణం

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ విహంగ వీక్షణానికి అవకాశం కల్పించింది. నగరంలోని పర్యాటక ప్రదేశాలను హెలికాప్టర్ ద్వారా పర్యాటకులు వీక్షించే వీలుం ది. హైదరాబాద్ నగర సౌందర్యాన్ని 1500 అడుగుల పై నుండి 10 నిమిషాల పాటు తిలకించవచ్చు. జీవిత కాలంలో మీరు ప్రేమించే వ్యక్తికి ఇచ్చే అపురూప బహుమానం ఇది అంటూ పర్యాటక శాఖ దీని గురించి ప్రత్యేకంగా ప్రచారం చేస్తుంది. ఈ హెలికాప్టర్ నెక్లెస్‌రోడ్ నుండి ప్రారంభమై టూరింగ్ ట్యాంక్ బండ్ నుండి ప్రారంభమై బుద్ధ విగ్రహం, లుంబిని పార్కు, ఎన్‌టిఆర్ గార్డెన్, బిర్లా మందిర్, చార్మినార్, మక్కా మజీద్, హైకోర్టు, ఐమాక్స్, సంజీవయ్య పార్కు, స్నో వరల్డ్ మీదుగా తిరిగి నెక్లెస్ రోడ్ చేరుకుంటుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 10వ తేదీ నుండి 15వ తేదీ వరకు జాయ్‌రైడ్‌కు చేయవచ్చు. తుంబే ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ జాయ్‌రైడ్ బుకింగ్‌ల కోసం 91 94477 77110లో సంప్రదించవచ్చు.

మూసీ సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళిక

పురపాలక మంత్రి కెటిఆర్

మన తెలంగాణ /హైదరాబాద్ : మూసి నది సుందరీకరణ, అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నదని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. ఇందుకోసం రూ. 1665 కోట్ల నిధులతో రెండు ప్యాకేజీల్లో వివిధ పనులు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ఉన్నతాధికారులు, మూసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో సచివాలయంలో కెటిఆర్ సమావేశమయ్యారు. రూ. 500 కోట్లు బడ్జెట్ నుండి,



మిగతా నిధులను బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుండి సేకరిస్తామని కెటిఆర్ తెలిపారు. ఈ నిధులకు ప్రభుత్వం పరిపాలన పరమైన అనుమతులు మంజూరు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. మూసి సుందరీకరణ పనుల ప్రణాళిక కోసం అధికారులు ఇప్పటికే గుజరాత్‌లో పర్యటించారని, అక్కడి సబర్మతి రివర్ ఫ్రంట్ ద్వారా సబర్మతి నదిని అభివృద్ధి చేసిన తీరులోనే మూసీని అభివృద్ధి చేస్తామన్నారు. అవసరమైన ప్రణాళిక, నిధులు సమకూర్చుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేరెళ్లపై నెలరోజులకు స్పందిస్తారా!

కెటిఆర్‌ను ప్రశ్నించిన చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : నేరెళ్లలో దళితులపై హింస జరిగితే ఆ నియోజకవర్గ ఎంఎల్‌ఎ, మంత్రి కెటిఆర్ నెల రోజుల తరువాత స్పందిస్తారా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు. అసలు దాడులే జరగలేదన్న కెటిఆర్ తప్పును కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు అక్కడికి వెళ్ళి బాధితులను పరామర్శించారని విమర్శించారు. నేరెళ్లలో ఇసుక మాఫియా ఉందంటే సహించేది లేదంటున్న కెటిఆర్, వందల లారీలతో ఇసుకను తరలిస్తూ స్థానిక గ్రామస్థుల ప్రాణాలను బలితీసుకుంటున్న వారిని ఏమనాలని అన్నారు. అక్కడ ఇసుక దందా యథేచ్ఛగా జరుగుతుందా? లేదా? అని మంత్రి చెప్పాలన్నారు. మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.ఆదిరెడ్డితో కలిసి బుధవారం జరిగిన మీడియా సమావేశంలో చాడ మాట్లాడారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రీడిజైన్లు, ప్యాకేజీల పేరుతో అడుగడుగునా అడ్డుకుంటున్నది సిఎం కెసిఆరే అని ఆయన విమర్శించారు. కెసిఆర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో మొండి వైఖరి ఎందుకు అవలంభిస్తున్నారని, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ.94 వేల కోట్ల వ్యయమయ్యే ప్రాజెక్టుల అంచనాలను ఇప్పుడు దాదాపు రూ.1.95 లక్షల కోట్లకు పెంచారన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఇంకా సందిగ్ధత తొలగలేదని, మహబూబ్‌నగర్ జిల్లాలో వెయ్యి కోట్లు ఖర్చు పెడితే 8 లక్షల ఎకరాలు బాగుపడతాయని, దీనిపై సర్కర్‌కు సూచన ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారో, ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన నష్టపరిహారాన్ని ఎందుకు ప్రకటిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మియాపూర్ భూ కుంభకోణం కేసులో టిఆర్‌ఎస్ నాయకులు డి.శ్రీనివాస్, కేశవరావు ఉన్నది వాస్తవం కాదా చెప్పాలన్నారు. భూ కుంభకోణంలో జరిగిన అవకతవకలు కప్పిపుచ్చడానికే డ్రగ్స్ డ్రామాను తెరపైకి తెచ్చారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాటల్లో నిజం లేదా, పాలకులు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని ఆధారాలతో ప్రశ్నించడం సిల్లీగా మాట్లాడినట్టు అవుతుందా అని ఆయన ప్రశ్నించారు. నయీం కేసులో ఎంత పెద్దవారైనా వదిలేది లేదని ప్రకటించిన ప్రభుత్వం అందరినీ వదిలిపెట్టిందని, ఏ ఒక్క రాజకీయ నాయకున్ని శిక్షించలేదన్నారు. ప్రతిపక్షాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని ఏకైక ముఖ్యమంత్రి దేశంలో కెసిఆర్ ఒక్కరేనన్నారు.



న్యాయం కోసం కోర్టుకెళ్లాం

ధర్నా చౌక్ పునరుద్దరణకు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు చాడ వెంకటరెడ్డి చెప్పారు. ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా తాను స్వయంగా వేసిన పిల్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించి రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని ఆయన చెప్పారు.

ధర్నా చౌక్ పునరుద్దరణ కోసం అనేక రకాలుగా ఉద్యమాలు చేసినా స్పందించని ప్రభుత్వం న్యాయం కోసం న్యాయస్థానానికి వెళ్లే పరిస్థితిని కల్పించందన్నారు. ధర్నా చౌక్ పునరుద్దరణ కోసం ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించేందుకు అనుమతి లభించిందని, రాష్ట్రంలో మాత్రం ప్రజా సమస్యలపై ధర్నాలు చేసేందుకు టిఆర్‌ఎస్ సర్కార్ అనుమతించకపోవడం విచారకరమన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించడాన్ని కూడా తప్పుపడితే న్యాయస్థానాలను కించపరచడమే అవుతుందన్నారు.

నెహ్రూ పేరును విస్మరించడం

బిజెపి సంకుచిత ధోరణికి నిదర్శనం



మన తెలంగాణ / హైదరాబాద్ : క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సం సందర్భంగా పార్లమెంటులో ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరును ప్రస్తావించకపోవడం దారుణమని పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. అసలు క్విట్ ఇండియాను ఉద్యమాన్ని నిర్వహించాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టిందే నెహ్రూ అని, స్వాతంత్రోద్యమంలో 14 ఏళ్ళు జైలు జీవితం గడిపిన వ్యక్తి అని, అంతటి మహనీయుని పేరును విస్మరించడం బిజెపి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీభవన్‌లో మంగళవారం ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి, కిసాన్ కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్ కోదండరెడ్డి, సేవా దళ్ ఛైర్మన్ కనుకుల జనార్ధన్‌రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. అసలు స్వాతంత్రోద్యమంలో బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌కు పాత్రే లేదని, పైగా నాడు క్విట్ ఇండియా ఉద్యమానికి సహకరించకపోగా బ్రిటీష్ పాలకులకు సహకరించారని తెలిపారు. లక్షకుపై దేశ ప్రజలు అరెస్టైయినా, అనేక మందిని పోలీసుల చిత్రహింసలకు గురైనా ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పట్టించుకోకుండా, రాజకీయాలను హిందూత్వానికి అనుగుణంగా మార్చేందుకు ప్రయత్నించారన్నారు. బిజెపి, సంఘ్ పరివార్ గొప్పగా చెప్పుకునే సావర్కర్ సైతం తాను బ్రిటీష్ పాలకులను వ్యతిరేకించనని పదే పదే లిఖిత పూర్వకంగా రాసిచ్చిన తరువాత జైలు నుండి విడుదలయ్యారని, ఆ తరువాత బ్రిటీష్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ గాంధీని సైతం తూలనాడారని చెప్పారు. హెడ్గేవార్, గోల్వాల్కర్, శాంప్రసాద్ వంటి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులంతా బ్రిటీష్ బలగాలకు సహకరించాలని కోరారని, స్వాతంత్రోద్యమానికి వ్యతిరేకంగా పని చేశారని విమర్శించారు. అలాంటి వారి వారసులు నేడు అధికారంలోకి వచ్చాక దేశభక్తికి తప్పుడు భాష్యం చెబుతూ, తామే దేశభక్తులైనట్లు చెప్పుకుంటూ, మైనారిటీలు, దళితులు, గిరిజనులను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందని, తాము దీనికి వ్యతిరేకంగా బాధితుల పక్షాన పోరాడుతామని ఉత్తమ్ తెలిపారు.

అహ్మద్ పటేల్ విజయంతో సంబరాలు

బిజెపి ఎన్ని కుయుక్తులు పన్నినా సోనియాగాంధీ రాజకీయ సలహాదారులు అహ్మద్ పటేల్ గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికవడం పట్ల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్ అలీ, కోదండరెడ్డి, కె.జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురికి స్వైన్‌ఫ్లూ

మన తెలంగాణ/హైదరాబాద్ : తాజాగా మరో ఐదుగురిలో స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. స్వైన్‌ఫ్లూ అనుమానిత లక్షణాలతో వివిధ ఆసుపత్రులకు వచ్చిన 34 మంది నమూనాలను సేకరించి పరీక్షించారు. ఈ నెలలో ఇప్పటి వరకు 186 మంది అనుమానిత నమూనాలను పరీక్షించగా 21 మందిలో స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు నిర్ధారించారు. స్వైన్‌ఫ్లూ ప్రభావం ఇంకా కొనసాగుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్ని బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో స్వైన్‌ఫ్లూ ఔషధాలు, టెస్టింగ్ కిట్స్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. స్వైన్‌ఫ్లూ నియంత్రణకు ప్రైవేటు ఆసుపత్రులు సహకరించాలని ఆయన కోరారు.

వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

మన తెలంగాణ/హైదరాబాద్ : కొద్ది నెలలుగా వెయిటింగ్‌లో ఉన్న 14 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ ఇస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వి.రమాదేవి, ఆర్.రత్న కల్యాణి, సిహెచ్.వెంకటేశ్వర్లు, వి.రాములు, ఆర్.దశరథ్, ఎం. శంకర్, జి.ప్రభాకర్, ఆర్ ఎస్.చిత్రు, శిదం ధాతు, కె.శివరామ్, పి.ధర్మచంద్రారెడ్డి, వి.లచ్చిరెడ్డి, ఇఎస్,అనురాధ, ఎన్.మధుసూదన్ రావులను పలు ప్రభుత్వ శాఖలలో డెప్యూటేషన్‌పై నియమించారు.

క్షమాభిక్ష కోసం సిఎంకు ఖైదీల లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్ : క్షణికావేశంలో చేసిన తప్పులకు దీర్ఘకాలంగా శిక్ష అనుభవిస్తున్నామని, తమకు క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేయాలంటూ పలువురు ఖైదీలు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. చర్లపల్లిలో జీవితఖైదీలుగా ఉన్న పలువురు జైలర్ ద్వారా సిఎంకు ఈ లేఖను పంపించారు. గత కొన్నేళ్ళుగా క్షమాభిక్షలు లేకపోవడంతో అయిన వారికి దూరంగా నాలుగు గోడల మధ్య బిక్కు బిక్కుమంటూ నరక యాతనను అనుభవిస్తున్నామని వారు లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రాష్ట్రం ఏర్పడిన శుభ సందర్భంగా జీవిత ఖైదీలందరినీ విడుదల చేస్తామని ఇచ్చిన వాగ్ధానాన్ని నెరవేర్చాలని వారు విన్నవించారు. గడచిన మూడున్నర సంవత్సరాలుగా క్షమాభిక్షలు లేకపోవడం, కటాఫ్ డేట్లు, వివిధ నిబంధనలు అడ్డు తగలడం వల్ల ఖైదీల క్షమాభిక్ష వ్యవహారం ఎప్పటికప్పుడు వాయిదా పడుతోందని వారి పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా తాము జైలు జీవితం గడపడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి అనేక ఇక్కట్లకు గురవుతున్నారని, తమ వారిని చూసుకునే పెద్ద దిక్కు లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు. శిక్షాకాలంలో జైలులో తామెన్నో నేర్చుకున్నామని, బాహ్యప్రపంచంలోకి వెళ్ళిన తర్వాత మరోసారి నేరం చేయకుండా ఉండేందుకు కావాల్సిన విజ్ఞానాన్ని సంపాదించుకున్నామని, శిక్షా కాలంలో పలు అంశాలలో ఉపాధి శిక్షణ కూడా పొందామని, జైలులో నేర్చుకున్న వృత్తితో కుటుంబాలకు పోషించుకుంటామని వారు వివరించారు.

నర్సింగ్ కళాశాల తరలింపునకు అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్ : కుషాయిగూడలోని మదర్ థెరిసా స్కూల్ ఆఫ్ నర్సింగ్‌ను ఆసిఫ్‌నగర్‌కు తరలించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తరలింపునకు అనుమతివ్వాలని నర్సింగ్ స్కూల్ డైరెక్టర్ చేసుకున్న వినతి మేరకు హైపవర్ కమిటీ తనిఖీ నిర్వహించి తరలింపును సిఫారసు చేసింది. ఈ సిఫారసును పరిశీలించిన ప్రభుత్వం అందుకు అనుమతించింది


వాహన రిజిస్ట్రేషన్, బదిలీలకు 'ఆధార్' తప్పనిసరి



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్, బదిలీలలో ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయాలని రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని డి బ్లాక్‌లో రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఆయన వాహన యాజమాన్య హక్కుల బదిలీలో ఉన్న సమస్యలపై సమీక్షించారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 95 లక్షల వాహనాలలో పెద్ద మొత్తంలో 2వ సారి, 3వ సారి అమ్మకాలు జరుగుతున్నా, కొనుగోలుదారు సహకరించకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. వాహన కొనుగోలుదారు తన పేరు మీదకు బదిలీచేయకుంటే ప్రమాద సమయంలో భీమా వర్తించదని, ప్రమాద కారకులు ఒకరైతే, జరిమానా బాధ్యులు మరొకరవుతారని తెలిపారు. అలాగే ఆటోలు, లారీలు తదితరాలకు ఫైనాన్స్ ఇస్తున్న వారు వాహనాలు లాక్కుని, ఇతరులకు అమ్ముతున్నా అధికారికంగా బదిలీ చేయడం లేదని మంత్రి ఆగ్రహించారు. ఈ కారణంగా పాయింట్ల పద్ధతిలోనూ ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వాహనాల కొనుగోలు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్, బదిలీ అంశాలలో ఆధార్ ఆధారంగా నమోదును తప్పనిసరి చేయాలని మంత్రి మహేందర్ రెడ్డి ఆదేశించారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కొనుగోలుదారు, అమ్మకందారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రవాణాశాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు. పాయింట్ల విధానంలోని లోపాలు అధిగమించాలని సూచించారు. ఫైనాన్షియర్ల ఆగడాల నుంచి ఆటోవాలలకు రక్షణ కల్పించాలని సూచించారు. ఇందుకోసం గోషామహల్‌లో స్పెషల్‌డ్రైవ్‌లతో బదిలీలు చేయించాలని, హోంమంత్రి నాయినితో కలిసి సదస్సు నిర్వహించి, అవగాహన పెంచాలన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ప్రమాద రేటు, మరణాలు తెలంగాణలోనే తక్కువగా ఉన్నాయని, వీటిని మొత్తానికి తగ్గించి ప్రమాదరహిత తెలంగాణను సాధిద్ధామని మంత్రి పిలుపునిచ్చారు. ప్రమాద రహిత తెలంగాణ సాధనకు నిబంధనలను కఠినంగా అమలు చేద్దామని కమిషనర్ మహేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ప్రమాదాలు 33 శాతం తగ్గాయని, 73 శాతం మరణాలు తక్కువగా నమోదయ్యాయన్నారు. ఈ సమావేశంలో రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, కమిషనర్ మహేందర్‌రెడ్డి, ట్రాఫిక్ డిసిపి రంగనాథ్, రవీందర్, అశోక్, జెటిసి పాండురంగ నాయక్, రఘునాథ్, డిటిసి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టితో లాభాలపై కెసిఆర్ ఎందుకు మాట్లాడటం లేదు : బిజెపి నేత ఇంద్రసేన్

మన తెలంగాణ/హైదరాబాద్ : జిఎస్‌టి వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని పదే పదే మాట్లాడుతున్న సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఒనగూరుతున్న లాభాల గురించి ఎందుకు ప్రస్తావించడం లేదని బిజెపి సీనియర్ నేత ఎన్. ఇంద్రసేనారెడ్డి ప్రశ్నించారు. జిఎస్‌టి బిల్లు ఆమోదానికి ముందు, తర్వాత జిఎస్‌టి కౌన్సిల్ అనేక సమావేశాలను నిర్వహించిందని, పలువురి అభిప్రాయాలను కోరిందని, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖను తన వద్ద ఉంచుకున్న కెసిఆర్‌కు నష్టం గురించి కేంద్రానికి ఎందుకు తెలియజేయలేదన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బొగ్గుపై పన్ను తగ్గించడం వల్ల రాష్ట్ర విద్యుత్ బోర్డుకు రూ. 3 వేల కోట్ల లాభం ఒనగూరిందన్నారు.



కోర్టులను బెదరిస్తున్నారా? : ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాసిన టిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజా సమస్యలు, ఇబ్బందులపై పలువురు కోర్టులకు వెళ్తున్నారని, ఈ విషయాన్ని గుర్తించని సిఎం కోర్టులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నట్లుగా మాట్లాడటం సరైంది కాదని ఇంద్రసేనారెడ్డి అన్నారు. రైతు ఆత్మహత్యల నివారణ కోసం కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని కోర్టుకు హామీ ఇచ్చి ఏడాదిన్నర కావస్తున్నా చర్యలు తీసుకోలేదని, దీనిపై తాను కోర్టుకు వెళ్తే ప్రభుత్వం నీళ్ళు నములుతుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 2500 మంది రైతులు బలవన్మరణం పాలయ్యారని, వారిని అదుకునేందుకు కూడా ముందుకు రావడం లేదని దుయ్యబట్టారు.సిరిసిల్ల జిల్లా నేరెళ్ళలో పోలీసుల దమనకాండపై ప్రభుత్వం స్పందిస్తున్న తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని ఇంద్రసేనారెడ్డి అన్నారు. పోలీసులు తమపై ఎందుకు దాడి చేశారని సాక్షాత్తు రాష్ట్ర మంత్రి కెటిఆర్‌ను బాధితులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. జిల్లా ఎస్పిని తప్పించకుండా డిఐజి విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయనుకోవడం భ్రమ మాత్రమేనని ఆయన అన్నారు.

www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 51 | గురువారం | 10 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



ఘన సంకల్పాలు భయ సందేహాలు

అవినీతి, పేదరికం, నిరక్షరాస్యతలను ఐదేళ్లలో తొలగిద్దాం : ప్రధాని మోడీ

అంధకార శక్తులు ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్నాయా? : సోనియాగాంధీ

క్విట్ ఇండియా ఉద్యమంపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ

10లో



నేరెళ్ల బాధితుల వద్దకు వైద్యులను పంపాలి

10

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం, ఎంజిఎం ఆసుపత్రి నుంచి ఇద్దరు సీనియర్లు వెళ్లాలని సూచన

పునరుజ్జీవనానికి నేడే పునాది

ఎస్‌ఆర్‌ఎస్‌పికి నిత్య జలకళ రప్పించే ప్రాజెక్టుకు నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం

పోచంపాడులో భారీ బహిరంగ సభ

మన తెలంగాణ/ హైదరాబాద్: శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి గురువారం ముఖ్యమంత్రి కెసిఆర్ శంకుస్థాపన చేయనున్నారు. వరద కాలువ ద్వారా రివర్స్‌లో ఎత్తిపోస్తూ వట్టిపోయిన శ్రీరాంసాగర్‌కు జలకళ తెచ్చే వినూత్న పథకానికి ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎల్లంపల్లి నుంచి 2 దశల్లో మిడ్ మానేరుకు నీరు తీసుకువచ్చే పనులు వేగంగా జరుగుతున్నాయి. రోజుకు రెండు టిఎంసిల నీటిని ఎల్లంపల్లి నుంచి తరలించే అవకాశం ఉండగా, అందులో ఒక టిఎంసిని వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు మళ్లిస్తారు. మరో టిఎంసిని వరద కాలువ పైనే చిన్న చిన్న హెడ్ రెగ్యులేటర్లు కట్టి,

తరువాయి 6లో



ఎస్‌ఆర్‌ఎస్‌పి పునరుజ్జీవ ప్రాజెక్టు శంకుస్థాపనకు పోచంపాడు చేరుకున్న కెసిఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

కృష్ణ విడుదలకు కర్ణాటక సానుకూలం

- మంత్రి హరీశ్‌రావు లేఖకు సుముఖంగా స్పందించిన ఆ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి పాటిల్
- జంటనగరాలు, నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల మంచినీటి అవసరాలకు కృష్ణా నీటిని విడుదల చేసే అవకాశం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర మంచి నీటి అవసరాలకు కృష్ణా జలాలను విడుదల చేసే అంశంపై కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. హైదరాబాద్ జంట నగరాల ప్రజలకు, నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి కోసం నీటిని విడుదల చేయడానికి సుముఖతను వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని కృష్ణా నది ప్రాజెక్టుల్లో జలాభావం కారణంగా తక్షణమే ఎగువ ప్రాంతం నుంచి 15 టిఎంసిల నీటిని విడుదల చేయాలని కోరుతూ మంగళవారం నాడు కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి పాటిల్‌కు మన రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి లేఖ రాశారు. ఈ లేఖను నాగార్జున సాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ఎస్ సునీల్ బుధవారం బెంగళూర్‌లో మంత్రి పాటిల్‌ను కలిసి అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కర్ణాటకకు చెందిన "కృష్ణా భాగ్య జల నిగమ్" మేనేజింగ్ డైరెక్టర్‌తో చర్చించాలని సిఇ సునీల్‌కు సూచించారు. ఈ మేరకు సునీల్ కృష్ణా భాగ్య జలనిగమ్ ఎండిని కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చలు ఫలప్రదమైనట్లు సమాచారం.

గుజరాత్‌లో 8 మంది కాంగ్రెస్ ఎంఎల్‌ఎలపై వేటు

ఉత్కంఠభరిత రాజ్యసభ ఎన్నికలో అహ్మద్ పటేల్ విజయం



అహ్మదాబాద్ : గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్‌ను అతిక్రమించి వ్యవహరించినందుకు ఆ రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఎంఎల్‌ఎలను కాంగ్రెస్ బుధవారం బహిష్కరించింది. రానున్న రోజుల్లో మరో ఆరుగురు ఎంఎల్‌ఎలకు కూడా పార్టీ ఉద్వాసన పలకనుంది. 'ఎనిమిది మంది గుజరాత్ కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను పార్టీ నుండి ఇప్పటికే బహిష్కరించాం. రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్‌ను

తరువాయి 6లో

బిజెపికి అంత సీన్ లేదు : కెటిఆర్



మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేంత సీన్ బిజెపికి లేదని, వచ్చే ఎన్నికల్లో ఉన్న ఐదు ఎంఎల్‌ఏ సీట్లు కూడా దక్కవన్నారు. అమిత్ ఇట్ల రాగానే రాజకీయాలు మొత్తం మారిపోతాయా? హైదరాబాద్ నగరంలో బిజెపినే మా ప్రతిపక్షం అని బుధవారం నాడు

తరువాయి 6లో



ముసురు నీటిలో హైదరాబాద్‌లోని మోజంజాహీ మార్కెట్

పైరుకు ఊపిరి

వర్షాలు, ముసురుతో రైతుల్లో చిగురించిన ఆశలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఎండిపోతున్న పంటలకు కాస్త జీవం వచ్చినట్లయింది. ఇంకా నాలుగు రోజుల్లో వానలు రాకపోతే పంట పోయినట్లేనని ఆందోళన చెందిన అన్నదాత, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించిన వ్యవసాయ శాఖలకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. ఒక్క మహబూబ్‌నగర్ మినహా, అన్ని జిల్లాలో ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఒకటి, రెండు భారీ స్థాయి వర్షాలు పడితే పంటలకు కొన్ని రోజుల వరకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు కురుస్తోంది ముసురేనని, అది కూడా ఎక్కువ సేపు పడటం లేదని, ఇది పంటలను తాత్కాలికంగానే బతికిస్తుందంటున్నారు. పూత

తరువాయి 6లో



ముంబయిని ముంచెత్తిన కోటా మరాఠా

ముంబయి: మరాఠా రిజర్వేషన్ల ఉద్యమం ముంబయికి కూడా పాకింది. బుధవారం ముంబయిలో లక్షలాది మందితో ప్రదర్శన సాగింది. స్థానిక బైకుల్లాలోని జిజామాత ఉద్యాన్ నుంచి ఆజాద్ మైదాన్ వరకూ జరిగిన ఈ భారీ ప్రదర్శనతో నగరం జన సంద్రంగా మారింది. విద్యాసంస్థలు, ప్రభుత్వోద్యోగాలలో మరాఠాలకు ప్రత్యేక కోటా కోసం రాజకీయాలకు అతీతంగా ర్యాలీ జరిగింది. ప్రదర్శనకారులు జెజె ఫ్లైఓవర్ వరకూ వెళ్లడంతో దక్షిణ ముంబయిలో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాజకీయాలకు అతీతంగా మరాఠాలకు

తరువాయి 6లో

రాజోలి ఎత్తు పెంపుపై చర్చలకు రండి

ఎపి, కర్ణాటకలకు మంత్రి హరీశ్‌రావు లేఖ



మన తెలంగాణ/ హైదరాబాద్: రాజోలిబండ ఆనకట్ట (ఆర్‌డిఎస్) ఎత్తు పెంచే పనులపై చర్చలకు ప్రభుత్వం ముందుకు కదిలింది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ పనులను పూర్తి చేయడానికి సహకరించాలని సాగునీటి శాఖ మంత్రి టి.హరీశ్‌రావు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రులకు బుధవారం నాడు లేఖ రాశారు. కర్ణాటక మంత్రి ఎంబి పాటిల్, ఎపి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును చర్చల కోసం హైదరాబాద్‌కు ఆహ్వానించారు. ఆగస్టు చివరి వారంలో సమావేశానికి వీలుగా తేదీలు సూచించాలని మంత్రి హరీశ్ లేఖలో కోరారు. కర్ణాటక మంత్రి పాటిల్‌కు హైదరాబాద్

తరువాయి 6లో

కుంచెపోటు



అమ్మాయిలు స్వేచ్ఛగా బయట తిరగాలంటే ఇట్లాంటి వాళ్లని లోపలేయక తప్పదు మరి!

పాయింట్లకు కత్తెర

7 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలకు నో పాయింట్లు

త్వరలో మార్పులకు ఆర్‌టిఎ శ్రీకారం

మన తెలంగాణ/ హైదరాబాద్/సిటీబ్యూరో: ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాయింట్ల కష్టాల నుంచి కొంత ఊరట లభించింది. ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడే వారు 12 పాయింట్లు దాటితో లైసెన్స్ రద్దు చేస్తామని అధికారులు ఇంతకు ముందు తెలిపారు. అంతే కాకుండా కొంత మైంది లైసెన్స్‌లు రద్దు చేసేందుకు సిద్ధపడ్డారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, వివిధ ఆటో యూనియన్ నాయకులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అధికారులు పునరాలోచనలో పడ్డారు. కొన్ని ఉల్లంఘనలకు పాయింట్లు విధించరాదని ఆర్‌టిఎ అధికారులు నిర్ణయించారు. ఏడు రకాలు ఉల్లంఘనలకు పాయింట్లు విధించరాదని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాంగ్ పార్కింగ్, ఆటో పైలెట్, ఓవర్ లోడ్ తప్పులకు పాయింట్ల విధింపులపై మార్పు చేయనున్నారు. జీబ్రా లైన్ క్రాసింగ్, బీమా, పొల్యూషన్, ఓవర్ స్పీడ్ విషయంలో మార్పులు చేయాలని అధికారులు నిర్ణయించారు. తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలకే పాయింట్లు విధించాలని, వాహనం నడిపిన వ్యక్తికి మాత్రమే పాయింట్లు విధించేలా మార్పులు చేయనున్నారు. సవరించిన విధానాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకు రానున్నారు. ఇప్పటికే పాయింట్లు విధించిన వారికి వెసులు బాటు కల్పించాలని ఆర్‌టిఎ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.



ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య




మన తెలంగాణ/ హయత్‌నగర్ : అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. యాదాద్రి జిల్లా వలిగొండకు చెందిన పబ్బ వెంకటేశ్ కూతురు శ్రావ్య (16) పెద్ద అంబర్‌పేట్ నగర పంచాయతీలోని తట్టి అన్నారం నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాఖీ పండుగ సందర్భంగా శ్రావ్య సొంత ఊరికి వెళ్లి తన తండ్రి వెంకటేశ్‌తో కళాశాలకు తిరిగి బుధవారం వచ్చింది. ఫీజు కట్టడానికి తండ్రి వెళ్ల గా తన గదికి వెళ్లిన శ్రావ్య ఫ్యాన్‌కు ఉరేసుకున్నది. దీనిని గమనించిన విద్యార్థులు యా జమాన్యానికి సమాచారం ఇవ్వడం తో నాగోల్‌లోని సుప్రజ అసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రావ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే తన కూతురు మరణించిందని తండ్రి వెంకటేశ్ తెలిపారు.

మానసిక ఒత్తిడి వల్లే శ్రావ్య మృతి : బాలల హక్కుల కమిషన్

ఉదయం నుండి సాయంత్రం వరకు విరామం లేకుండా చదవాలని, రాత్రి వేళల్లో సైతం చదవాలని, తిరిగి ఉదయం

తరువాయి 6లో



“ఆనందకరమైన జీవితానికి అవసరాలు కొద్దిగానే ఉంటాయి.
-మార్కస్ అరేలియస్”

ఆహార భద్రతకు ఏదీ భద్రత?

సంపాదకీయం

దారిద్ర్యరేఖకు దిగువనున్న కోట్లాది పేద కుటుంబాలు, స్త్రీలు, పిల్లల ఆకలి మంటలు చల్లార్చే ఉద్దేశంతో 2013లో పార్లమెంటు ఆమోదించిన 'జాతీయ ఆహార భద్రత చట్టం' అమలు పట్ల నిర్లక్ష్యం వహిస్తు న్న పలు రాష్ట్ర ప్రభుత్వాలను, చట్టం అమలు బాధ్యత రాష్ట్రాల దంటూ చేతులు దులుపుకున్న కేంద్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. 'పార్లమెంటరీ చట్టాలను రాష్ట్రాలు అమలు చేసేటట్లు చూడటంలో భారతప్రభుత్వం నిస్సహాయతను వ్యక్తం చేయజాలదు' అన్న రాజ్యాంగ అధికరణం 256 ను న్యాయమూర్తులు ప్రస్తావించారు. 'అమలు జరపనప్పుడు అనేక పథకాల ప్రయోజనమేమిటి? పార్లమెంటు చట్టాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అమలు జరపకపోతే ఆ చట్టం ప్రయోజనమేమిటి? అని జస్టిస్ లోకుర్ ప్రశ్నించారు.

హర్యానా ప్రభుత్వంపై స్వరాజ్ అభియాన్ వేసిన కేసును విచారించిన న్యాయమూర్తులు మదన్ బి.లోకుర్, ఎన్.వి.రమణ పేదల సంక్షేమాన్ని ఉద్దేశించిన చట్టాన్ని రాష్ట్రం సక్రమంగా అమలు జరపకపోగా, రాష్ట్ర ఆహార కమిషన్‌కు పనంటూ ఏమీలేదని కరాఖండీగా చెప్పటంపట్ల నిరాశ వ్యక్తం చేసింది. ఆహార భద్రత చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మరో 9 రాష్ట్రాలు కూడా ధర్మాసనం దృష్టికి వచ్చాయి. అవి మధ్యప్రదేశ్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్, బీహార్, చత్తీస్‌ఘర్. ప్రజాపంపిణీ వ్యవస్థ, శిశుసంక్షేమ పథకాల ద్వారా అమలు చేయాల్సిన ఆహార భద్రత చట్టం నిర్లక్ష్యానికి గురి కావటానికి రాజకీయ సంకల్పం లేకపోవటమే కారణం. సార్వజనీన ఆహార భద్రతను తొలుత తలపెట్టి నప్పటికీ, అందరికీ సబ్సిడీ ఆహార ధాన్యాలు అవసరం లేదు కాబట్టి, గ్రామీణ ప్రాంతాల్లో 75శాతానికి, పట్టణ ప్రాంతాలో 50శాతానికి భారీ సబ్సిడీతో ఆహార ధాన్యాలు అందించటం ఆహార భద్రత చట్టం లక్ష్యం. సబ్సిడీని కేంద్రం భరిస్తుంది. సబ్సిడీ రేటుకు ఆహార ధాన్యాలు అందించటంతోపాటు ప్రజల ఫిర్యాదులను పరిశీలించేందుకు కమిటీలను, చట్టం అమలు పర్యవేక్షణకై రాష్ట్ర ఆహార కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు నియమించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)ను నీరుగార్చే విధానాలను కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న పరిస్థితిలో కొన్ని రాష్ట్రప్రభుత్వాలు సైతం ఆ పథకం పట్ల చిన్నచూపు వహించాయి. అది యుపిఎ రెండవ ప్రభుత్వం నాలుగైదేళ్ల కసరత్తు చేసి దాని అధికారం చివరిరోజుల్లో తెచ్చిన బిల్లు కావటంవల్ల అది ప్రయోజనం పొందలేదు. చట్టం అమలు ద్వారా యుపిఎ ప్రభుత్వ మంచిపనిని గుర్తు చేయటం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇష్టం ఉండకపోవచ్చు. ఏమైతేనేం, నష్టపోతున్నది పేదలు. పిడిఎస్‌లోని అవకతవకలను తొలగించి సక్రమంగా పనిచేయించాల్సిన రాష్ట్రప్రభుత్వాలు మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయకుండా చట్టం అమలును నీరుగార్చుతున్నాయి. ఆహార భద్రత చట్టం దేశమంతటా అమలు జరుగుతున్నట్లు కేంద్ర ఆహార మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ గత నవంబర్‌లో ప్రకటించటం ఎంత సత్యదూరమో సుప్రీంకోర్టు తాజా తీర్పు తెలియజేస్తున్నది. అది జారీ చేసిన ఆదేశాలను నిర్ణీత కాలవ్యవధిలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తే ఆహార భద్రత చట్టం అమలు తప్పకుండా మెరుగుపడుతుంది.

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆగస్టు 31 లోపు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను సమావేశపరిచి చట్టం అమలు ఆవశ్యకతను గుర్తింపచేయటం, వినియోగదారుల ఫిర్యాదుల పరిశీలనకై చట్టం నిర్దేశించినట్లు స్వతంత్ర సభ్యులతో గ్రీవెన్స్ కమిటీలను సంవత్సరంలోపు ఏర్పాటు చేయటం, రాష్ట్రప్రభుత్వాలు సంవత్సరంలోపు రాష్ట్ర ఆహార కమిషన్‌లను, విజిలెన్స్ కమిటీలను, సామాజిక ఆడిట్ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటం వగైరా సుప్రీంకోర్టు ఆదేశాల్లో ఉన్నాయి. నామమాత్రపు రేటుకు పేదలకు బియ్యం లేదా గోధుమలు ఇస్తున్నామని ప్రభుత్వాలు ప్రచారం చేసుకుంటే సరిపోదు. అవి ఉద్దేశించిన ప్రజలకు అందుతున్నాయా లేదా, వినియోగదారులసాధకబాధకాలేమిటి? పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలి. చట్టం నిర్దేశించిన ఏర్పాట్లు చేస్తే పరిస్థితి మెరుగవుతుంది.

సూత్రబద్ధత లేని సంకీర్ణాలు

చూపు


రాజకీయాలలో విచిత్రమైన భాగస్వాములు కలుస్తుంటారు. మరింత విచిత్రమైన మనుషులు కనిపిస్తారు. జనతాదళ్ (యు), రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.), కాంగ్రెస్ మధ్య కుదిరిన మహా కూటమి ఎంత అద్భుతమైంది అనిపించిందో అంతే వినాశకరమైందిగా కూడా రుజువైంది. అది సోషలిస్టు, సెక్యులర్ భావాలకు, పేదలకు అనుకూలమైన గ్రామీణాభివృద్ధికి సంకేతంలా కనిపించింది. ఉధృతంగా వీస్తున్న 'మోదీ గాలి'ని అడ్డుకోవడానికి అనివార్యమైన చర్యగా, 2015లో చీలిపోయి ఉన్న ప్రతిపక్షాన్ని కూడగట్టేదిగా కూడా కనిపించింది. అదే సమయంలో విభిన్నమైన, ఆ మాటకొస్తే విభిన్నమైన, పార్టీ ప్రతిష్ఠలకు, రాజకీయ వాదనలకు విరుద్ధమైందిగా కనిపించింది. అదీగాక బీహార్ లో నితీశ్ కుమార్ రాజకీయాలలో ఎదిగింది లాలూ ప్రసాద్ యాదవ్ పరిపాలనకు, అవినీతికి వ్యతిరేకంగానే. అందుకే వీరిద్దరితో కూడిన మహా కూటమి ఓటర్లలోనూ, రాజకీయ వ్యాఖ్యాతలలోనూ గందరగోళానికి దారితీసింది.

అయినా నితీశ్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ అద్భుతంగా కలిసిపోయినట్టు, ఈ కలయిక మహత్తరమైంది అయినట్టు, బీహార్ ను వెనుకబాటుతనం నుంచి బయటపడడానికి ఉపకరించగలిగినట్టు, మతోన్మాద శక్తులను నిలవరించగలిగేట్టు నమ్మకం కలిగించింది. ఈ మహా కూటమి 'సామజిక న్యాయంతో కూడిన అభివృద్ధి' సాధించేదిగా విశ్వాసం కల్పించింది.

లాలూ ప్రసాద్ రాజకీయ చతురత, నితీశ్ కుమార్ దృక్పథం, గత పని తీరు జనం దృష్టిని ఆకర్షించాయి. బీహార్ కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న భరోసా కలిగింది. కాని ఈ మహా కూటమిని వ్యతిరేకించే వారు లాలూ ప్రసాద్ గూండా రాజ్యం గురించి అదే పనిగా మాట్లాడారు. కాని 2015 బీహార్ శాసనసభ ఎన్నికలకు ముందు బిజెపి కొనసాగించిన జనాన్ని విభజించే విధానాల వల్ల మహాకూటమి మీద జనం నమ్మకం పెంచుకున్నారు. గత 20 నెలల కాలంలో మహాకూటమి సాధించిన ఫలితాలు క్రమంగా వమ్ము అయినాయి. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబం మీద అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో మహాకూటమి విచ్ఛిన్నమైంది. నితీశ్ కుమార్ మళ్లీ ఎన్.డి.ఎ.తో పొత్తు కూడినందువల్ల దేశంలో అధికార కేంద్రీకరణకు ఊతం ఇచ్చినట్టు అవుతుందన్న భయాందోళనలు పెరిగిపోయాయి.

లాలూ యాదవ్ కుటుంబ అవినీతి మకిలికి దూరంగా ఉండాలని నిర్ణయించిన నితీశ్ పెద్ద రాజకీయ భారం తలకెత్తుకున్నారు. ఆయన అంతకు ముందు 2005–2014 మధ్య బిజెపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు బిజెపి చిన్న భాగస్వామ్య పక్షంగా ఉండేది. కాని ప్రస్తుతం మోదీ, అమిత్ షా నాయకత్వంలోని బిజెపి ప్రధాన భాగస్వామ్య పక్షమైనా, చిన్న భాగస్వామ్యపక్షమైనా (జమ్మూకశ్మీర్, మహారాష్ట్రలో లాగా) జోక్యం చేసుకోకుండా ఉండడం లేదు. ఆ పార్టీ, దానికి అనుబంధంగా ఉన్న వివిధ సాంస్కృతిక సంస్థలు రాజకీయ విజయాల కారణంగ మరింత దుందుడుకు వైఖరి అనుసరిస్తున్నాయి. బీహార్ పరిణామాలు భారత రాజకీయాలలో సంకీర్ణ ప్రభుత్వాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. లోకజ్ఞానాన్నిబట్టి చూస్తే సంకీర్ణ ప్రభుత్వాలు అవకాశవాదంతోనూ, బలాబలాల లెక్కలతోనూ కూడుకున్నవిగా కనిపిస్తున్నాయి. బిజెపి బలం పుంజుకోవడం వల్ల గత రెండేళ్ల కాలంలో సంకీర్ణ ప్రభుత్వాల స్వరూపం మారిపోతోంది. ఏ పార్టీకి మెజారిటీ రాని స్థితిలో ప్రాంతీయ పార్టీలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి, ప్రయోజనాలు సాధించడానికి ప్రయత్నించడం తగ్గిపోయింది.

Economic&Political WEEKLY ఆగస్టు 5 సంపాదకీయం



అస్థిర ప్రభుత్వాల వల్ల విధానాలకు విఘాతం కలుగుతుండడం వల్ల ప్రజలు కూడా బలమైన రాజకీయ పక్షాలకు, బలమైన నాయకులకు అండగా నిలుస్తున్నారు. దీనివల్ల ప్రాంతీయ పార్టీల ప్రాభవం తగ్గి జాతీయ పార్టీలు బలం పుంజుకుంటున్నాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వం మీద వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఎ.కు అవకాశం కల్పించాయి. ఎన్.డి.ఎ.కు మెజారిటీ ఉన్నా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ బిజెపి మిత్రపక్షాలతో కలిసే కొనసాగుతోంది.

బిజెపికి మెజారిటీ పక్షం అయినా కాకపోయినా సంకీర్ణ ప్రభుత్వాలలో చేరుతోంది. అవసరమైనప్పుడు రాజకీయ కుట్రలతో మెజారిటీ పక్షాన్ని లొంగ దీసుకుంటోంది(ఉదాహరణకు గోవా, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, ఇప్పుడు బీహార్). ఏ పద్ధతి అనుసరించి అయినా వీలైనన్ని ఎక్కువ రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పాటు చేయడమే బిజెపి ప్రధాన లక్ష్యంగా ఉంది. ఆ రకంగా మొత్తం 29 రాష్ట్రాలు ఉంటే 17 రాష్ట్రాలలో బిజెపి ఏదో ఒక రకంగా అధికారంలో ఉంది. సంకీర్ణ రాజకీయాలను వినియోగించుకుని బిజెపి అసమ్మతిని, ప్రతిఘటనను లేకుండా చేసి ఫెడరల్ విధానాన్ని వీలైనంత మేర నీరు గార్చి సాంస్కృతిక, రాజకీయ ఆధిపత్యం చెలాయించాలని చూస్తోంది. సాంస్కృతిక, రాజకీయ ఆధిపత్యం సంపాదించడానికి ఏ రాజకీయ పార్టీ ఇంతవరకు బిజెపి లాగా రాజకీయ స్వప్రయోజనం కోసం ప్రయత్నించలేదు.

ఈ పరిస్థితిలో ప్రతిపక్షాలు నేర్చుకోవాల్సిన గుణపాఠాలు ఇంతకు ముందు కన్నా చాలా స్పష్టంగా ఉన్నాయి. రాజకీయ అవకాశవాదం, వ్యూహ రచన ఎలా ఉన్నప్పటికీ మరే ఇతర పార్టీల నుంచి లేని సైద్ధాంతిక సవాళ్లు బిజెపి నుంచి అధికంగా ఉన్నాయి. దీన్ని ఎదుర్కోవాలంటే రాజకీయ స్పష్టత, సంకల్పం, పట్టుదల ఉండాలి. అప్పుడే బిజెపి రాజకీయాలను నిలవరించడం సాధ్యం. ఇవేమీ లేకుండానే నితీశ్ కుమార్ ఇటీవల ప్లేటు ఫిరాయించే దాకా సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల కన్నా తక్కువ సమయమే ఉన్నా ప్రతిపక్ష పార్టీలకు ఇలాంటి దృక్పథం ఏదీ ఉన్నట్టు కనిపించడం లేదు.

(ఇ.పి.డబ్ల్యు.సౌజన్యంతో)

చండీగఢ్ కీచక పర్వం

> సామాన్యుడి కూతురై ఉంటే తమ్మినిబమ్మి చేసే మన రాజకీయ, పోలీసు వ్యవస్థ ఆమెను ధైర్యంగా నిలబడనిచ్చేది కాదు. ఈ కేసులో బడా వ్యక్తులయిన నిందితులపై ఆరోపణలను పోలీసులు నీరుగార్చించడం గురించి దేశ వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె సామాన్యురాలు అయితే కేసును ఈ పాటికి మాయచేసి మూసేసేవారని కూడా గట్టిగా వినిపిస్తోంది. మా ప్రభుత్వం భిన్నమైనది అని పదేపదే చాటుకునే బిజెపి నేతలు తలదించుకోవలసిన ఘటన ఇది. 'ఏ పార్టీ అయినా ఆ తానులోని ముక్కే' అని అనుకోక సామాన్యులకు వేరే గత్యంతరం కనపడడం లేదు.

రాజకీయంగా బలవంతుడైన పురుషుడు ఓ మహిళను వెంటబడి వేధిస్తే ఆ మహిళ తనకు న్యాయం జరగాలని గట్టిగా కోరుకొనకపోవడమే మంచిది. ఎందుకంటే అలా ఆమె కోరుకొంటే చట్టం అమలు యంత్రాంగం, అధికార రాజకీయ వ్యవస్థ అతడికి అండగా నిలిచి, ఆ మహిళను దోషిగా చూపెట్టే ప్రమాదం ఉంది. అంతేకాదు.. ఆ కేసు కోర్టుకు చేరడానికి చాలా ముందు సామాజిక మీడియా అతడు నిర్దోషి అంటూ రుజువులు చూపి కేసు తీరును మార్చేయవచ్చు. చండీగఢ్‌లో ఈ నెల 4వ తేదీ రాత్రి 29 ఏళ్ల వార్నికా కుందు అనే మహిళ తనను ఇద్దరు పురుషులు కారులో వెంబడించి, వేధిస్తున్నటు ఆందోళనగా పోలీసులకు ఫోన్ చేసి చెప్పింది. వారు తనను కిడ్నాప్ చేయడానికి కూడా ప్రయత్నించారని ఆరోపించింది.

చండీగఢ్‌నుంచి దగ్గరలోని పంచకులకు తాను కారు నడుపుకొంటూ వెళుతుండగా వారు వేధించారన్నది ఆమె ఫిర్యాదు సారాంశం. ఆ ఇద్దరు పురుషులలో ఒకరు 23 ఏళ్ల వికాస్ బారాలా. భారతీయ జనతా పార్టీ (బిజెపి) హర్యానా చీఫ్ సుభాష్ బారాలా కుమారుడు. ఆ సమయంలో తాగి ఉన్నట్లు తెలుస్తున్న ఆ ఇద్దరు మగాళ్లనూ మరునాడు అరెస్టు చేశారు. కాని కొన్ని గంటలలోనే బెయిల్‌పై వారు విడుదల అయ్యా రు. జరిగిన అకృత్యం ఆధారాలను సిసి కెమేరాలు చూపుతాయి. కానీ ఆ సమయంలో అవి పని చేయలేదట. నిందితులు ఓ మహిళను 7 కి.మీ వెంటాడితే ఆ దారి పొడవునా అయిదు ప్రదేశాలలో సిసి కెమేరాలు ఉన్నా ఏవీ పని చేయలేదని పోలీసులు చెప్పడం ఆశ్చర్యం. ఈ కేసులో నిందితులపై చాలా తీవ్రమైన ఆరోపణలను పోలీసులు ఉపసంహరించారు కూడా. బెయిలుకు ఆస్కారంగల చిన్న నేరారోపణలను మాత్రమే నమోదు చేశారు. ఇది జరిగిన రెండు రోజుల తరువాత రాజకీయ ఒత్తిళ్లకు తలవంచి పోలీసులు కేసును నీరుగార్పిస్తున్నట్లు గుప్పుమంది.

నిందితులకు రాజకీయ రక్షణ కవచం

తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున నిందితులకు రక్షణగా రాజకీయ శక్తులు ఆట్టే ఆలస్యం చేయకుండా చకచకా రంగంలోకి దిగిపోయాయి. బిజెపికే చెందిన హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖత్తార్ ఈ కేసులో సరైన చర్య తీసుకుంటామని ఇచ్చిన హామీ ఏమయిందో గాని వికాస్ తప్పుకుగాను ఆయన తండ్రి, పార్టీ సహచరుడైన సుభాష్‌ను బిజెపి ఏమీ అనలేదు. హర్యానా పార్టీ అధిపతి వెంట పార్టీ నాయకులు గట్టిగా నిలబడి ఆయన (సుభాష్) రాజీనామా ప్రసక్తి లేదని నొక్కి చెప్పారు. ఆ నాయకుల్లో ఒకరు బాధితురాలినే తప్పుపట్టారు. రాత్రి పూట ఆమె బయటకు వెళ్లాల్సింది కాదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బిజెపి సీనియర్ నేతలు ఈ ఉదంతంపై పెదవి కదపడంలేదు.

ఆ నేరం జరిగిందా అన్న దానిని త్వరత్వరగా సందేహాస్పదం చేసేశారు. బాధితురాలు కుందు పైనే ఆరోపణలను గురిపెట్టారు. నైతిక పోలీసింగ్ వీరులు ఎంతో సమర్థంగా ఈ వ్యవహారంలో బిజెపిని కాపాడారు. ఈ నేపథ్యంలోనే నిందితులతో కలిసి కుందు సంతోషంగా గడుపుతున్నట్లు ఒక ఫోటో సామాజిక మీడియాలో దర్శనమిచ్చింది. సుప్రీంకోర్టు అడ్వకేట్ ఒకరు ఆమెను 'బాధితురాలు కాదు' అన్న తరహాలో ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. నిందితులు ఆమెకు తెలిసినవారే అయినప్పుడు ఆమెను వారు కిడ్నాప్ చేసే ప్రశ్న ఉదయించదని కూడా ఆ పోస్టులో రాశారు.

రాత్రిపూట స్వేచ్ఛగా పురుషులతో కలసి విహరించే మహిళగా ఆమెను సామాజిక మీడియాలో చిత్రించేశారు. అయితే ఆ తర్వాత కుందు ఆ ఫోటో గురించి వివరణ ఇచ్చారు. అది చాలా పాతదని చెప్పారు. అందులో ఉన్నది నిందితులైన పురుషులు కాదని కూడా చెప్పారు. మహారాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి సానియా ట్విట్టర్‌లో ఆ ఫోటోను పోస్టు చేసినట్లు తెలుస్తోంది. తాను పోస్టులో ఇచ్చిన వివరణ హ్యాక్ అయినట్లు కనిపిస్తోందని ఆమె అన్నారు. సోమవారం సాయంత్రం టివి చానెళ్లతో కుందు మాట్లాడారు. ఆ తర్వాత చండీగఢ్ పోలీసులు రహస్య సిసి టివి ఫుటేజ్‌ని సంపాదించామని ప్రకటన చేశారు. కుందు హర్యానా ప్రభుత్వంలో ఒక సీనియర్ ఐఎఎస్ అధికారి కుమార్తె. న్యాయ వ్యవస్థ అండను కోరుతూ ఆమె ధైర్యంగా నిలబడ్డారు. రాజకీయ ఒత్తిళ్లకుగాని, తనను సిగ్గుపడాలని చేసే ప్రచారాలకుగాని ఆమె లొంగలేదు.

సామాన్యుని కూతురైతే..

సామాన్య వ్యక్తి కూతురు కాకపోవడం తన అదృష్టమని ఆమె చేసిన వ్యాఖ్య సరియైనది. సామాన్యుడి కూతురై ఉంటే తమ్మినిబమ్మి చేసే మన రాజకీయ, పోలీసు వ్యవస్థ ఆమెను ధైర్యంగా నిలబడనిచ్చేది కాదు. ఈ కేసులో బడా వ్యక్తులయిన నిందితులపై ఆరోపణలను పోలీసులు నీరుగార్పించడం గురించి దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె సామాన్యురాలు అయితే కేసును ఈ పాటికి మాయచేసి మూసేసేవారని కూడా గట్టిగా వినిపిస్తోంది. మా ప్రభుత్వం భిన్నమైనది అని పదేపదే చాటుకునే బిజెపి నేతలు తలదించుకోవలసిన ఘటన ఇది. 'ఏ పార్టీ అయినా ఆ తానులోని ముక్కే' అని అనుకోక సామాన్యులకు వేరే గత్యంతరం కనపడడం లేదు.

పోలీసులు ఈ కేసులో భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి)354డి సెక్షన్ కింద మాత్రమే అభియోగాలు దాఖలు చేశారు. దానితో కేవలం ఇది వేధింపు కేసు కాకుండా 'వెంటాడిన' కేసుగా మారింది. బెయిలుకు అర్హమైనదైపోయింది. దీనిని బట్టి కుందు ఫిర్యాదు చేసినది అధికార పార్టీ వారిపై అని తెలిసిన వెంటనే కేసును నీరుగార్పించే పని మొదలయిపోయినట్లు అర్థమవుతోంది.

— ఇప్సిత చక్రవర్తి

ఉత్తర కొరియా, అమెరికా దొందు దొందే!



అమ్జద్
8686171752

అగ్ర సామ్రాజ్యవాద దేశం అమెరికా కేవలం పైన పటారం లోన లొటారం అన్న చందంలా ఉందని ఉత్తర కొరియా విషయంలో తేటతెల్లమవుతుంది. ఉత్తర కొరియా ప్రతి బాలిస్టిక్ క్షిపణి పరీక్షతో అమెరికాను బెదిరిస్తూనే ఉంది. అమెరికా ఓ సారి చైనాను సహయానికి రమ్మంటుంది మరోసారి జపాన్‌ను. చైనా, జపాన్ 'సై' అంటే నార్త్ కొరియాపై ఈ రెండు దేశాలను యుద్ధరంగంలో దింపడానికి సర్వ విధాల ప్రయత్నిస్తుంది.

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిం జోంగ్ ఉన్ మాత్రం తన మంకు పట్టు వదలక పసిపిల్లాడుగానో పిచ్చి పిల్లాడుగానో అమెరికా వెనుకాలబడి విజయవంతమైన తమ బాలిస్టిక్ ఖండాంతర క్షిపిణుల ద్వారా యుద్ధానికి కాలు దువ్వుతున్నాడు. పైగా తన యుద్ధోన్మాద చదరంగం ఆటలో అమెరికా దక్షిణ కొరియాతో కలిసి చెక్ పెట్టిన కిం జాంగ్ ఉన్ తనకు ఒరిగేదేమి లేదన్నట్లు మసలుకొంటున్నాడు.

ఓ మలుపు: అంతర్జాతీయ సమాజం హితోక్తులను ఉత్తర కొరియా పెడచెవిని పెట్టడంలో ఇజ్రాయిల్ కన్న తక్కువేమీ కాదు. అమెరికా ఇజ్రాయిల్‌ను బెదిరించడానికి మరో ఏడు జన్మలెత్తాల్సుంది. అందుకే ఇజ్రాయిల్ పట్ల అమెరికా పలాయన ధోరణి అవలంబిస్తూ తన పిరికితనానికి నాంది చాటుకుంది. ఫలితంగా అరవై యేండ్లనుంచి పాలస్తీనియన్‌లు అన్ని విధాల మూల్యం చెల్లిస్తున్నారు. కాని అమెరికాకు చీమ కుట్టినట్లు కూడా లేదు. అమెరికా ఇజ్రాయిల్ సంబంధం రవికకు చీర చెరుగుకు గల సంబంధం లాంటిది.

అమెరికా గల్ఫ్ వార్‌లో ఇరాక్ దగ్గర ప్రాణాంతకమైన అయుధ సంపద ఉన్నదని దాని వల్ల ఇరుగు పొరుగు దేశాల కొంపలంటుకుపోతాయని బెదిరించింది. ఇరాక్ ను సర్వనాశనం చేసి ఊపిరి పీల్చుకుంది. ఆ నెపంతోనే సద్దాం హుస్సేన్‌ను ఉరికంబానికి ఎక్కించ గలిగినా అమెరికా మరణాయుధాలు మాత్రం ఉన్నాయని నిరూపించలేకపోయింది అమెరికా. ఇప్పుడు ఉగ్రవాదాన్ని చూపించి తానే దాన్ని పోషించ సాగింది. అది అమెరికా అమ్మ కొంగును పట్టుకొని మూడు పూవులు ఆరు కాయలైంది.

రెండడుగులు ముందుకెళ్ళి 'నైన్ లెవెన్' (9/11)గా రూపాంతరం చెందినది. లోగుట్టు పెరుమాళ్ళకెరుక అన్న చందంలా ముస్లిం, అరబ్బు దేశాలు ఉగ్రవాదులను ఆర్థికంగా ఆదుకొంటున్నాయని అపవాదాలు వేసింది. ఆయా దేశాలను బ్లాక్ మైల్ చేసి తన స్వంత లాభాల మూటను కట్టుకొని విర్రవీగ సాగింది. కాని ఉత్తర కొరియా విషయంలో మాత్రం పప్పులో కాలు వేసింది.

మరోమలుపు: ఇరాక్‌కు పూర్తిగా విరుద్ధంగా ఉత్తర కొరియా తన దగ్గర అమెరికాను నాశనం చేసే యుద్ధసామాగ్రి ఉందని నిరూపించింది. సామ్రాజ్యవాద అమెరికా తోక మలచుకోవడమే తప్ప వేరేమార్గం లేదు. ఉత్తర కుమార ప్రజ్ఞలు తప్ప. ఉ.కొరియా క్రితం నెల జులైలోనే రెండుసార్లు ఖండాంతర బాలిస్టిక్ అణుక్షిపణుల ప్రయోగం చేసి విజయవంతమైంది. దీనిపట్ల అమెరికా వాగార్భాటమే ప్రదర్శిస్తోంది.

ఉత్తర కొరియా ప్రజల పట్ల ట్రంప్ సానుభూతి హాస్యాస్పదం. ఎన్నో పేద దేశాలు ఆసియాలో, ఆఫ్రికాలో వేల లక్షల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు ఆకలి దప్పులతో అంతర్యుద్ధంలో. ఆ సమస్యలను పట్టుకోకుండా ఉత్తర కొరియా తన సైనిక బలాన్ని గట్టి పరచుకొంటున్న నేపథ్యంలో అమెరికా తన సైనిక స్థావరాలను అక్కడ బలపరచుకోవడమే అతి ముఖ్యమైన ప్రధానాంశంగా మారింది. రెక్స్ టిల్లెర్సన్, అమెరికా విదేశాంగ కార్యదర్శి, ఉత్తర కొరియా జరుపుతున్న క్షిపణి పరీక్షలవల్ల శాంతిభంగం కలుగుతున్నందున చైనా, రష్యా దేశాలు ప్రాథమిక ప్రత్యేకమైన బాధ్యతలు తమ భుజస్కంధాలపై వేసుకోవాలని సూచించారు. అత్త మీది కోపం దుత్త మీద అన్న చందం లా ఉంది వారి వ్యవహారం.

ఏదిఏమైనా ఈ రెండు దేశాలు అమెరికా కల్లబొల్లి మాటలను నమ్మడానికివి అరబ్బు దేశాల్లాంటివి కావు. పైగా వీరి దౌత్య ఆటలు అమెరికా ఈలలకు లొంగి ఉండవు. అమెరికా బ్యాడ్ ఎంపైర్ అని ఈ రెండు దేశాలకు బాగా తెలుసు!

చివరిగా: జూలై 4 న అమెరికా తమ దేశ అవతరణ ఆనందోత్సాహాలలో ఉండగా ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణిని ప్రయోగించి విజయం చెందడం వల్ల చెంపదెబ్బ తిన్నట్లైంది. తన ఆగ్రహాన్ని చల్లార్చుకోవడానికి అమెరికా ఉత్తర కొరియా చుట్టూ యూఎస్‌బీ 1 బాంబర్లతో చక్కర్లు కొట్టింది. ఈ డ్రిల్‌లో దక్షిణ కొరియాతో పాటు జపాన్ వంత పాడింది. చైనా తన మాట వినలేదని ట్రంప్ గారు బెంగ పడిపోయారు.

ఉత్తర కొరియా ప్రముఖ నేత కిం జోంగ్ ఉన్ తన యుద్ధ రుగ్మతతో అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా అమెరికానే లక్ష్యంగా పెట్టుకొని మంకుపట్టుతో ఉన్నాడన్నది తిరస్కరించ దగ్గ విషయం మాత్రం కాదు. తన దేశ ఆర్థిక స్థితిగతులపై ముఖ్యంగా వ్యవసాయరంగం వైపు కూడా కిం జాంగ్ ఉన్ తన దృష్టిని సారించాలి. ఉత్తర కొరియా ప్రజల జీవితం మాత్రం పూచిన తంగేడు కాదన్నది నగ్న సత్యం.

వన సంపద ఒట్టి మాటేనా?:

ఒక వృక్షం పెరగాలంటే కొన్ని సం॥రాలు పడుతుంది. చెట్టు నాటి దాన్ని మనం సంరక్షిస్తే బాగుంటుంది లక్షల మొక్కలు నాటేకన్నా వందల మొక్కల సరంక్షణ భాధ్యతను గుర్తించాలి. లేకపోతే అక్రమార్కులు ఒక్క గొడ్డలి పోటుతో వన సంపదను నేలకూలుస్తారు.. ముందు చెట్లు నరికే వారిని చూసీ చూడనట్టు ఉండే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నామమాత్రంగా మారిన వాల్టా చట్టానికి పదును పెట్టాలి.

హరితహారం క్రింద ప్రభుత్వం వందల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా హరితహారం పథకాలు సఫలీకృతం కావడం లేదు. అప్పటికి అప్పుడే మొక్కలు నాటి మీడియాకు పోజులు ఇచ్చి మేము నాటినం అని చేతులు దులిపేసుకుంటున్నారు రాజకీయ నాయకులు. ఎవరికీ సరైన శ్రద్ధ లేక వాటి సంరక్షణ చేయక మొక్క కాస్త ఎండిపోవడమో...పశువులకు ఆహారంగా మారడం జరుగుతుంది ..పర్యావరణానికి మేలు చేసే వనసంపద ప్రజలకు అందకుండా పోతుంది తెలంగాణను హరితవనం చేస్తా అన్న ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నీరు గారుస్తున్నారు..పాలకులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు కోట్లలో ఖర్చయినా వనసంపద మాత్రం పెంచలేకపోయింది. ఒకవైపు కలప అక్రమరవాణ అధికమవుతున్నా అధికారులు స్పందించడంలేదు.. దీనివలన రాబోయే కాలంలో మానవాళికి ప్రమాదం మరింత జరిగే ప్రమాదాలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రాష్ట్రంలో ఎక్కడా అక్రమ కలప రవాణ కాకుండా చర్యలు తీసుకొంటూ...వనభద్రత చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి..

— వి. రాజశేఖర్, నాగర్ కర్నూలు జిల్లా

మన తెలంగాణ
5
హైదరాబాద్
గురువారం
10, ఆగస్టు, 2017
www.manatelangana.news



అఖిల

మగవారితో సమానంగా మహిళలు చదువుకొంటున్నారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, యాడ్ ఏజెన్సీలు, నిర్మాణ ప్రదేశాలు, దుకాణాలు, రెస్టారెంట్లు, పైలెట్లు, ట్యాక్సీ డ్రైవర్లుగా ఇలా ప్రతి రంగంలోనూ మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు. సంతోషించదగ్గ పరిణామం. ఇది నాణానికి ఒకవైపు..చదువుకొనే మహిళల శాతం ఎక్కువైనా, కార్యాలయాల్లో పనిచేసే మహిళల శాతం తక్కువని సర్వేలు చెబుతున్నాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ 2017 సర్వే ప్రకారం...0.9 మిలియన్ మంది మంది పురుషులు ఉద్యోగం చేసే వారు ఉంటే, మహిళలు 2.4 మిలియన్ మంది మాత్రమేనని అధ్యయనాల్లో తేలింది. కారణాలేవైనా ఇది మాత్రం ఒకింత విచారించదగ్గ విషయం..



చదువుకు 'సై'...ఉద్యోగానికి 'నై'!!

నగరాలలో 2004 – 05 నుంచి 2011– 12 సంవత్సరాల మధ్య కాలంలో చేస్తున్న ఉద్యోగాలను వదిలేసిన మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తాజా అధ్యయనాల వల్ల తెలుస్తోంది. 19.6 మిలియన్ల మంది మహిళలు ఉన్న దేశంగా ఇండియా మూడో స్థానంలో ఉండగా మొదటి రెండు స్థానాల్లో షాంఘై, బీజింగ్‌లున్నాయి. కేవలం 27 శాతం మంది మహిళలు మాత్రమే కార్మికరంగంలో పనిచేస్తున్నారు. ఇండియా స్పెండ్ రిపోర్ట్ ఏప్రిల్ 9, 2016 లెక్కల ప్రకారం జి 20 దేశాల్లో కేవలం సౌదీ అరేబియా మాత్రమే పనిచేసే మహిళల శాతం బాగా పడిపోయింది. 2013 నాటికి దక్షిణాసియాలో పాకిస్థాన్ తర్వాత భారతదేశంలో పనిచేసే మహిళల సంఖ్య తక్కువగా ఉంది. 34.8 శాతం నుంచి 27శాతం వరకు పడిపోయినట్లు ప్రపంచబ్యాంకు రిపోర్టు ప్రకారం తెలుస్తోంది.

గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు, కళాశాల విద్యనభ్యసించినవాళ్ల కంటే పనిచేసే మహిళా కార్మికుల సంఖ్యే ఎక్కువగా ఉంది. ప్రపంచ బ్యాంకు రిపోర్టు ప్రకారం ...ఆర్థికంగా నిలబెట్టుకోవాల్సిన రోజులు వచ్చినప్పుడు కూడా ఈ విధంగా మహిళలు వెనుకబడి ఉండటం దురదృష్టకరం. ఇలాంటి సమయంలో మహిళలు ఉన్న ఉద్యోగాలను వదులుకుంటుండగా, 24.3 మిలియన్ మంది పురుషులు ఉద్యోగాలను సాధించుకుంటున్నారు.

ఎక్కువ శాతం పురుషులే: వేగంగా వృద్ధి చెందుతున్న టెలికాం, బ్యాంకింగ్ వంటి రంగాల్లో పురుషుల ఆధిపత్యం ఉంది. టెలికాంలో 83.84 శాతం మంది పురుషులు పనిచేస్తున్నారు. 78.79 శాతం మంది బ్యాంకింగ్ రంగంలో, ఆర్థిక సేవలు, బీమా, చమురు, గ్యాస్, విద్యుత్, ఉక్కు, ఖనిజాల వంటి కోర్ రంగాల్లో 74.75శాతం మంది పురుషులు పనిచేస్తున్నట్లు ఇండియా స్కిల్ రిపోర్ట్ 2017 జరిపిన సర్వేలో తేలింది. బ్యూటీ, హెల్త్‌కేర్ లాంటి రంగాల్లో అధికంగా మహిళలు పనిచేసున్నారని తెలిపింది.

విద్యలో మిన్న: మహిళలు చదువుకోవడంలో భారీ పురోగతిని సాధిస్తున్నారు. అదే సమయంలో కార్యాలయాల్లో పనిచేసే మహిళాశాతం తగ్గిపోవడం గమనార్హం. ప్రాథమిక విద్య బాలికల నమోదు రేటు దాదాపు వంద శాతం ఉంది. ఉన్నత విద్యలో 2002 నుంచి 03 లో 7.5 శాతం ఉండగా 2012 నుంచి 2013లో అది 20 శాతానికి పెరిగింది.

చదువు ఉద్యోగం కోసం కాదు: గ్రామీణ ప్రాంతాల్లో 67శాతం మంది గ్రాడ్యుయేట్ చేసిన బాలికలు ఉద్యోగం చేయడం లేదు. నగరాలలో 68. 3 శాతం మంది విద్యావంతులైన మహిళలు ఉద్యోగాలు చేయడం లేదని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, విమెన్స్ వాయిస్, ఎంప్లాయిమెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా 2015 నివేదిక తెలిపింది. బాలుర కంటే బాలికలే ఎక్కువ శాతం చదువుకుంటున్నారని తెలిపింది. మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ 2015 అధ్యయనం ప్రకారం మహిళలు పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేసినట్లైతే, 2015 నాటికి భారతదేశం జిడిపిని 60 శాతం వరకు పెంచవచ్చు. ప్రస్తుతం మహిళలు ఇండియా జిడిపికి 17శాతం మాత్రమే తోడ్పడుతున్నారు. ఇది ప్రపంచ సగటు 37 శాతం కంటే తక్కువగా ఉంది. మహిళల ఆదాయం కూడా వారి వ్యక్తిగత శ్రేయస్సుకు సంబంధించింది. సంపాదించే మహిళలు ఆ కుటుంబంలో ఎక్కువ హోదాను కలిగి ఉంటారు. వారి సంపాదనతో తమ బిడ్డలకు మంచి విద్య, ఆరోగ్యంపై పెట్టుబడి పెడుతున్నారు. కానీ ఇంటి బాధ్యతలు వదులుకోకుండా, చదువుకొన్నా కూడా ఉద్యోగాలకు మాత్రం దూరంగా ఉంటున్నారని సర్వేలు చెబుతున్నాయి.

2015 ప్రపంచ బ్యాంకు చేసిన సర్వే ప్రకారం, ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య (అన్ని వయసుల వారు)

నేపాల్	79.9 %
చైనా	63.9 %
బంగ్లాదేశ్	57.4 %
యునైటెడ్ స్టేట్స్	56. 3%
యూరోపియన్ యూనియన్	50. 8%
శ్రీలంక	35. 1%
ఇండియా	27%
పాకిస్థాన్	24. 6%
అరబ్‌దేశాలు	23.3 %



డైటింగ్ ఫైటింగ్

యేడాదిలో 35 కిలోలు తగ్గిన స్వప్న



ఒంటి మీదికెక్కిన బరువు దించుకోడానికి జనం నానా అగచాట్లు పడుతుంటే 86 కిలోల బరువున్న స్వప్నా వ్యాస్ పటేల్ ఏడాదిలో ఏకంగా 35 కిలోలు తగ్గి 53 కేజీలకు వచ్చింది. దీని వెనుక ఒకటే రీజన్. డైట్ కంట్రోల్. క్రమం తప్పని వ్యాయామం. అలాగని మనసు చంపుకుని కడుపు మాడ్చుకోవడం తన పద్ధతి కాదంటోంది. ఇష్టమైన ఐటెమ్స్ సుబ్బరంగా తింటుంది. కానీ ఏదీ అతిగా కాదు. ఏం తిన్నా రైట్ టైంలో తినాలనేది ఆమె చెప్పే సూత్రం. ఎన్నడూ క్రాష్ డైటింగ్ చేయలేదని చెప్తోంది. ఓవర్ ఎక్సర్ సైజ్ అన్న మాటే లేదు. మొదట్లో ఫ్యాట్ బర్నింగ్ కోసం కార్డియో వర్కవుట్ చేసేది. కానీ తర్వాత వెయిట్ ట్రైనింగ్ కి మారింది.

ఇంత బరువు తగ్గడమనేది అంత ఈజీగా జరగలేదంటోంది స్వప్న. హెల్దీ వెయిట్ లాస్ కోసం షార్ట్ కట్స్ లేవనేది ఆమె అభిప్రాయం. ఫ్యాట్ డైట్ వెంటనే శక్తినివ్వొచ్చుగాక, కానీ అదే మన పాలిట మృత్యువు అవుతుందంటారామె. ట్రిక్స్ ద్వారా ఏదో చేయొచ్చు అనుకుంటే అది మొదటికే మోసం అవుతుందని స్వప్న చెప్తోంది.

19 ఏళ్లప్పుడు నేను 86 కేజీల బరువు ఉండేదాన్ని. ఇప్పుడు 53 కేజీలకు వచ్చాను. అంటే 33 కిలోలు తగ్గాను. నేను మొదట్లో అంత బరువున్నా నాకేం నామోషీ కాలేదు. అయితే, కొందరు ఆంటీ అని.. అమ్మమ్మ అని రకరకాలుగా కామెంట్ చేశారు.. అది విని హర్టయ్యాను. ఆ చిన్న సంఘటనే నన్ను ఇలా మార్చింది. వాళ్ల మాటలు కొట్టిపారేయాలన్న కసితోనే నేను ఇలా మారిపోయాను స్వప్న పాటిల్. నా డైట్ నన్నెప్పుడూ ఆకలితో ఉంచలేదంటారు స్వప్న. ఆల్మోస్ట్ ప్రతీ రెండు గంటలకోసారి తినేదట. కానీ తక్కువ మోతాదులో తినేదాన్నని చెప్తున్నారు. బేసిగ్గా మన శరీరం ఏదైతే కోల్పోతుందో దాన్నే ఎక్కువగా కోరుకుంటుంది. ఉదాహరణకు తీపి పదార్థాలకు దూరంగా ఉన్నామనుకోండి.. శరీరం దాన్నే ఎక్కువగా కోరుతుంది. అందుకే రెగ్యులర్ గా ప్రొటీన్, ఫ్యాట్ చెక్ చేసుకుంటానని స్వప్న తెలిపింది.

భౌతికపరమైన మార్పు బయటకి కనిపిస్తుంది. కానీ అసలైన మార్పు మన మనసులో ఉంటుంది. వెయిట్ లాస్ ప్రాసెస్‌లో నేనెప్పుడూ ఒంటరిగా ఉండాలని ట్రై చేయలేదు. లైఫ్ స్టయిల్ మార్చుకోలేదు. ఈ క్రమంలో పేషెన్సీ పెరిగింది. డిసిప్లైన్ అలవడింది. డెడికేషన్ నేర్చుకున్నాను. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే ఆత్మవిశ్వాసం రెట్టింపైందని గర్వంగా చెప్తోంది.

బరువు తగ్గడానికి ఏవేవో సీక్రెట్స్ ఉంటాయని అందరూ అనుకుంటారు. కానీ అవేం లేవంటోందామె. రెగ్యులర్ గా డైట్ ఫాలో అయితే చాలు.. ఇంకేం అవసరం లేదని ఘంటాపథంగా చెప్తోంది. స్వప్న ఇప్పుడొక ఫిటినెస్ ప్రొఫెషనల్. తన అనుభవం ద్వారా వందల మందికి బరువు తగ్గించుకునే మార్గం చెప్తోంది. ఫేస్ బుక్ లో సుమారు ఐదు వేల మంది స్వప్నను ఫాలో అవుతన్నారంటే.. ఎంతమందికి ఆదర్శంగా నిలిచిందో అర్థం చేసుకోవచ్చు.

1600 క్యాలరీలు కరిగించే స్వప్న డైట్ చార్ట్

స్వప్న రికార్డు స్థాయిలో ఇంత బరువు ఎలా తగ్గిందా అని ఆశ్చర్యపోవడం అందిరివంతైంది కానీ ఆమె మాత్రం పెద్దగా కష్టపడలేదంటోంది. తాను తీసుకునే ఆహారాన్ని నియంత్రించడం ద్వారా చాలా వరకు బరువు తగ్గానని, దానికి కొద్దిగా వ్యాయామం చేసి మరింతగా ఫలితాలు రాబట్టానని స్వప్న చెబుతోంది. ఆమె అనుసరించిన డైట్ ప్లాన్ ప్రకారం రోజు మొత్తంలో 7 చిన్న మొత్తాలలో ఆహారాన్ని తీసుకున్నానని చెప్పింది.

మీల్–1: టీ/కాఫీ/గ్రీన్‌టీ (చక్కర అసలు లేకుండాగానీ, బాగా తక్కువగాగానీ) తీసుకోవాలి. వీటి వల్ల శరీరానికి 50 క్యాలరీలు అందుతాయి.

మీల్–2: 2 ఇడ్లీలు/1 దోస (నూనెలేకుండా) సాంబారుతోకానీ, చట్నీతోకానీ తీసుకోవచ్చు. లేదా కూరగాయలు వేసి వండిన 1 ప్లేట్ పోహ/ఉప్మా/ లేదా 2 గోధుమ బ్రెడ్‌స్లైస్‌లు టోస్ట్‌చేసినవి తేనెతో తీసుకోవచ్చు. (బట్టర్ వాడవద్దు) ఇందువల్ల శరీరానికి 200 క్యాలరీలు అందుతాయి.

మీల్ –3: మిక్స్‌డ్ ఫ్రూట్ డిష్ (అరటిపండు, ప్లమ్, పుచ్చకాయముక్కలు, సంత్ర, ఆపిల్ ముక్కలు) లేదా పళ్ళ ముక్కలు వేసిన పెరుగు (చక్కెరకానీ, ఫ్లావర్స్‌గానీ లేకుండా) లేదా 1 గ్లాస్ పళ్ళ మిల్క్ షేక్ (చక్కర/ఫ్రూట్ ఫ్లావర్స్ లేకుండా) 1 గ్లాస్ మిక్స్‌డ్ ఫ్రూట్ లస్సీ (చాలా తక్కువ షుగర్‌తో) తీసుకోవాలి. అందువల్ల శరీరానికి 200 కాలరీలు అందుతాయి.

మీల్–4: రెండు రొట్టెలు (బట్టర్ లేకుండా) కూరతో, పప్పు, మజ్జిగ తీసుకోవచ్చు లేదా 2 చపాతీలు లోఫాట్ పన్నీర్ సబ్జీతో, మజ్జిగ తీసుకోవచ్చు లేదా 1 కూర, చీజ్ హోల్ వీట్ సాండ్‌విచ్ (బట్టర్ లేకుండా) తీసుకోవచ్చు లేదా లోఫాట్ స్టఫ్ పన్నీర్ పరాట లేదా కూరతో పన్నీర్ పరాట, లస్సీ (చక్కర తక్కువగా) తీసుకోవచ్చు లేదా బీన్స్ సలాడ్, విజిటబుల్ టాపింగ్ ఉన్న 1 గోధుమ పిజ్జ తీసుకోవచ్చు లేదా 2 టొస్టెడ్ గోధుమ బ్రెడ్ స్లైస్‌లు 1 ఆమ్లెట్‌తో కలిపి తీసుకోవచ్చు. ఇందువల్ల 500 కాలరీలు శరీరానికి లభిస్తాయి.

మీల్–5 : ఒక బౌల్ స్ప్రౌట్స్, చిక్కుడు గింజలు తీసుకుని నిమ్మరసం పిండి, రుచికి కొద్దిగా ఉప్పును జోడించి మిరియాలపొడి చల్లుకుని తినవచ్చు లేదా 1 బౌల్ కంది పప్పు, లేదా గుడ్డు తెల్లసొన తీసుకోవచ్చు. వీటి వల్ల 200 కాలరీల శక్తి శరీరానికి అందుతుంది.

మీల్–6: ఉడకబెట్టిన ఆలుగడ్డ కూరలు, కొన్ని టమాటా ముక్కలు, ఉల్లి గ్రేవి కలిపి తీసుకోవచ్చు లేదా 1 గ్లాస్ వెజిటబుల్ సూప్ రెండు టోస్ట్ చేసిన గోధుమ బ్రెడ్ స్లైస్‌లు తీసుకోవచ్చు లేదా 1 బౌల్ అన్నం వెజటబుల్ సూప్‌తో తీసుకోవచ్చు లేదా గుప్పెడు డ్రైఫ్రూట్స్ తినవచ్చు. ఇందువల్ల 350 కాలరీలు శరీరానికి అందుతాయి.

మీల్–7 : ఒక గ్లాసుడు లోఫాట్ పాలను వేడిగా తీసుకోవాలి (చక్కరకానీ, ఫ్లావర్స్ కానీ లేకుండా చూసుకోవాలి)

భారీ కాయం భయంకరం

స్థూలకాయం స్థూలంగా ప్రతి పదిమందిలో ఆరుగురిని మింగేస్తోంది. ఒంటి బరువు తగ్గించుకోడానికి పరుగులు పెట్టండి. బ్రిస్క్ వాక్ చేయండి వంటి సలహాలిస్తుంటే అంత శ్రమపడలేక రోగాలకు దాసులైపోతున్నారు ఎంతో మంది. ఈ రోజున సమాజంలో సహజంగా వచ్చే రోగాలకన్నా ఆహారపు అలవాట్ల వల్ల చనిపోతున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. వీటినే లైఫ్‌స్టైల్ డిసీజెస్ అంటారు. నోరు ఆపుకోలేక కెలరీలకు కెలరీలు కడుపులోకి తోసేయడం వల్ల భారీకాయాలు వచ్చిపడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 1.5 బిలియన్ల మంది అంటే ప్రతీ పది మందిలో 6గురు అధికబరువు సంబంధిత వ్యాధులతో కన్నుమూస్తున్నారు.

పిఐబిలో 'నవభారత సంకల్పం' ప్రతిజ్ఞ

మన తెలంగాణ/హైదరాబాద్ : క్విట్ ఇండియా ఉద్యమానికి బుధవారంతో 75 సంవత్సరాలు పూర్తవడంతో హైదరాబాద్ లోని పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి) సిబ్బంది చేత పిఐబి డైరక్టర్ జనరల్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి సంకల్పంతో సాధిస్తాం పేరిట 'నవ భారత సంకల్పం' ప్రతిజ్ఞను చేయించారు. ఉస్మానియా వర్సిటీ గ్రంథాలయంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఒఎస్‌డి ప్రొఫెసర్ లింబా రెడ్డి, విశ్వవిద్యాలయ ప్రధాన లైబ్రేరియన్ పవన్ కుమార్‌లు కూడా సంకల్పంతో సాధిస్తాం ప్రతిజ్ఞ చేశారు.

గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలి : ఎల్. రమణ



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లు 9.08 శాతానికి పెంచాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతాలలోని సహజ వనరులను వాడుకుంటున్నారే తప్ప వారి జీవన ప్రమాణాలలో మార్పు తీసుకురావడం లేదన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు బానావత్ బాబురావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కొమురంభీం ఫోటోకు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం రమణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో సిఎం కె. చంద్రశేఖర్‌రావు గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 3 సంవత్సరాలైన ఆ హామీని అమలు చేయలేదన్నారు. టిడిపి ఉపాధ్యక్షులు రమావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ బంజారా భవన్ అని చెప్పిన కెసిఆర్ మూడేళ్లైన దానిని నిర్మించలేదన్నారు. మూడెకరాల భూపంపిణీ, హెలికాప్టర్లలో వెళ్లి వైద్య సేవలందిస్తామన్న టిఆర్‌ఎస్, హామీలు అమలు చేయడం లేదని రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత: రైల్వే బోర్డు జి.ఎం



మన తెలంగాణ /హైదరాబాద్ : ప్రయాణికుల భద్రత, సదుపాయాల కల్పన, రైళ్ల సమయ పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రైల్వే బోర్డ్ ఛైర్మన్ ఎ.కె.మిట్టల్ అన్నారు. రైల్వే భాగస్వాములైన ప్రయాణికుల భద్రత కోసం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు జోన్ జనరల్ మేనేజర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. ఢిల్లీ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైల్వే జోనల్ మేనేజర్ల ఉన్నత స్థాయి పనితీరు సమీక్షా సమావేశాన్ని ఉద్దేశించి మిట్టల్ ప్రసంగించారు. ఆగస్టు 16 నుంచి 'స్వచ్ఛ పక్వాడ' చేపట్టనున్న నేపథ్యంలో రైళ్ల ఆపరేషన్స్‌లో పరిశుభ్రతకు కూడా అత్యంత ప్రాముఖ్యతనివ్వాలని ఆయన సూచించారు. రైలు బోగీలలో ఆహార పదార్థాలకు సంబంధించి ప్రయాణికులు చేసే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మరోవైపు నిర్ణీత కాల వ్యవధిలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టుల పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సరుకు రవాణ ఆదాయాన్ని పెంచుకునేందుకు ముఖ్యమైన సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రైల్వే లైన్ల డబ్లింగ్, ట్రిప్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులను పూర్తి చేయడంలో, ఆదాయాన్ని ఆర్జించడంలో ఎస్‌సిఆర్ నిర్ణీత లక్ష్యాలను సాధించే దిశగా పనిచేస్తున్నదన్నారు. ఎస్‌సిఆర్ అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కె.వి.శివప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పునరుజ్జీవనానికి నేడే పునాది

(మూడవపేజీ తరువాయి)

రివర్స్‌లో శ్రీరాంసాగర్‌కు మళ్లిస్తారు. 60 రోజుల్లో 60 టిఎంసిల నీటిని ఎత్తిపోసేలా ప్రణాళికలు రూపొందించారు. పోచంపాడు ప్రాజెక్టు వద్ద జరిగే సభను ప్రభుత్వం, ప్రధానంగా టిఆర్‌ఎస్ పార్టీ వర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు సభను విజయవంతం చేసే బాధ్యతను ముఖ్యమంత్రి అప్పగించిన సంగతి తెలిసిందే. గోదావరి నదిలో ప్రాణహిత సంగమ స్థానానికి కొద్దిదూరంలో మేడిగడ్డ వద్ద ప్రభుత్వం బ్యారేజిని నియమిస్తోంది. రీడిజైనింగ్‌లో భాగంగా మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలిస్తారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు, శ్రీరాంసాగర్‌కు నీటిని తరలిస్తారు.

శ్రీరాంసాగర్‌పై ఆధారపడి, కాకతీయ, లక్ష్మి, సరస్వతి కెనాళ్లు, గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హనుమంతరెడ్డి ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. శ్రీరాంసాగర్‌లో నీరుంటేనే వీటిపై ఆధారపడిన ఆయకట్టు సాగవుతుంది. కాకతీయ కెనాల్ 116 కిలోమీటర్ల మేర పారుతూ 1.78 లక్షల ఎకరాలకు నీరు అందిస్తుంది. చౌటుపల్లి హనుమంతరెడ్డి ఎత్తిపోతల ద్వారా 36 వేల ఎకరాలు సాగవుతుంది. సరస్వతి కెనాల్ కింద 36 వేల ఎకరాలు, ఐడిసి ఎత్తిపోతల పథకాల కింద మరో 36000 ఎకరాలు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా 93 వేల ఎకరాలకు సాగునీరు రావాల్సి ఉంది. దీనికి అదనంగా రీడిజైన్‌లో భాగంగా కాళేశ్వరం ప్యాకేజీ 20, 21లలో 4.40 లక్షల ఎకరాలు, ప్యాకేజీ 27, 28లలో లక్ష ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే కొత్త ఆయకట్టుకు నీరివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పునరుజ్జీవ పథకాన్ని రూపొందించారు. ఎల్లంపల్లి నుంచి రివర్స్‌లో పోచంపాడుకు నీరొస్తే రాష్ట్ర చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైనట్లే, ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం కావడానికిదే నాంధి అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎత్తు పెంపుపై చర్చలకు రండి

(మూడవపేజీ తరువాయి)

సందర్శనకు వీలుకాకపోతే, తానే బెంగుళూరుకు వచ్చి చర్చిస్తానని కోరారు. ఇంజినీర్ల స్థాయిలో పలు మార్లు సమావేశమైనా సమస్యలు పరిష్కారం కాలేదని, జోక్యం చేసుకోవాలని పాటిల్‌ను కోరారు. తుంగభద్ర నదిపై నిర్మించిన రాజోలిబండ ఆనకట్ట ఎత్తు పెంపుకు సమైక్య రాష్ట్రంలోనే అంగీకరించి, టెండర్లు కూడా పిలిచారు. కర్నూలు జిల్లా వైపు రైతులు, నాయకులు అడ్డుకోవడం మూలంగా ప్యాకేజీ–1 పనులు పట్టించుకోవడం లేదు. గతేడాది కూడా మంత్రి హరీశ్ ప్రత్యేక శ్రద్ధ చూపి నీరు రాకముందే పనులు చేయడానికి కర్ణాటకను ఒప్పించారు. కానీ ఎపి ప్రభుత్వం సహకరించకపోవడం, స్థానిక రైతులు, నేతలు అడ్డుకోవడంతో శాంతిభద్రతల సమస్య వస్తుందనే కారణం చూపి కర్ణాటక ప్రభుత్వం తప్పుకుంది. ఎపి ఒప్పుకుంటేనే పనులు ముందుకు కదులుతాయని గతంలోనే స్పష్టంగా చెప్పింది. కానీ పలుమార్లు ఎపి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో ఫోన్‌లో చర్చించినా, పరిష్కారం దొరకలేదు. ఈ లోపు ఆనకట్టలోకి నీరు రావడంతో పనులు చేయడానికి వీల్లేకుండా పోయింది. ఆనకట్ట ఎత్తు పెంచే పనిని 15 రోజుల్లో పూర్తిచేయడానికి కర్ణాటక ప్రభుత్వం, సదరు కాంట్రాక్టరు సిద్ధంగానే ఉన్నా, ఎపి తరపున హామీ వస్తేనే ముందుకు కదులుతామని చెబుతున్నారు. దీంతో మంత్రి హరీశ్‌రావు మరోమారు రెండు రాష్ట్రాల మంత్రులతో చర్చించడానికి సంకల్పించారు.

హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

(మూడవపేజీ తరువాయి)

ఐదు గంటలకు అరంభించాలని యాజమాన్యం ఒత్తిడి చేయడం వల్లనే శ్రావ్య ఉరేసుకుందని బాలల హక్కుల పరిరక్షణ సంఘం కార్యదర్శి అచ్యుత రావు ఆరోపించారు. విద్యార్థులను చదువుల పేరుతో చనిపోయే విధంగా కర్కశంగా ప్రవర్తిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.11,400 కోట్ల పి.ఎన్.బి రుణం

మన తెలంగాణ/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి గాను రూ.11,400 కోట్ల రుణం ఇవ్వడానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు అంగీకరించింది. ఇదివరకే కాళేశ్వరం లింక్–1 కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పోరేషన్ ద్వారా రూ.8 వేల కోట్ల పై చిలుకు రుణం ప్రభుత్వం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నిధులు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంప్‌హౌజ్‌ల కోసం వినియోగిస్తుండగా, తాజా రుణం ఎల్లంపల్లి నుంచి మొదలుకొని, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వరకు కాలువలు, బ్యారేజీలు, పంప్‌హౌజ్‌ల నిర్మాణం కోసం వినియోగించనున్నారు. గత నెల రోజుల నుంచి అధికారులు, ఇంజనీర్లు రుణం కోసం బ్యాంకు అధికారులు చర్చలు జరిపగా, బుధవారం నాడు తుది నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు సంబంధించిన టెక్నికల్ బిడ్లను బుధవారం తెరిచారు. ఇందులో ప్రధానంగా మెగా, నవయుగ, హెచ్‌ఇహెచ్, సత్య ఇన్‌ఫ్రా, కెఎన్‌ఆర్, ఆఫ్కాన్స్, రాఘవ తదితర కంపెనీలు అర్హత సాధించాయని తెలిసింది.

శ్రీరాంసాగర్ కాలువల ఆధునీకరణకు రూ.863.8 కోట్ల మంజూరు

శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి శ్రీకారం చుడుతున్న వేళ, నీరొచ్చాక సద్వినియోగం కోసం కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 284 కిలోమీటర్ల మేర కాకతీయ కాలువతో పాటు లక్ష్మి, సరస్వతి ప్రధాన కాలువలు, సదర్‌మట్ ఆనకట్ట డిస్ట్రిబ్యూటరీ కాలువలను కూడా మరమ్మత్తులు చేయనున్నారు. ఈ మేరకు రూ.863.8 కోట్లతో పనులు చేపట్టడానికి అనుమతులు మంజూరు చేస్తూ ఇరిగేషన్ శాఖ పరిపాలనా ఉత్తర్వులు జారీచేసింది.

దేశ హితమే ధ్యేయంగా పని చేస్తా

జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో వెంకయ్యనాయుడు



మన తెలంగాణ/హైదరాబాద్ : గతంలో ఎంతో మంది ఉప రాష్ట్రపతులుగా పని చేశారని, అయితే వారందరికీ లేని అనుభవం తనకుందని ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఇరవై సంవత్సరాల పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉండడమే ఇందుకు కారణమని ఆయన చెప్పారు. పనిలో ప్రతిభను కనబరచి ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెస్తానని అన్నారు. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో బుధవారం జర్నలిస్టులతో ఆత్మీయ సమ్మేళనంలో నిర్వహించారు. ప్రజా సమస్యలు, బిల్లుల రూపకల్పన కోసం రాజ్యసభలో అర్థవంతమైన చర్చ జరిగేలా సభను నడిపిస్తాననివెంకయ్యనాయుడు అన్నారు. ప్రస్తుతం తాను మరోసారి చదువులో మునిగిపోయానని, తన కంటే ముందు ఉప రాష్ట్రపతిగా వ్యవహరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్, హిదాయతుల్లా, జాకీర్ హుసేన్ తదితరులు సభను నిర్వహించిన తీరును అధ్యయనం చేస్తున్నానని తెలిపారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో తాను అర్థవంతమైన చర్చ దిశలో సభ్యులను ప్రోత్సహిస్తానని తెలిపారు. అధికారపక్షం, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా అందరికీ సమానంగా మాట్లాడే అవకాశం ఇస్తానని అన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక తారతమ్యాలు, వివిధ వర్గాలపై ఉన్న వివక్షతలు, వాతావరణ నిర్లక్ష్యం తదితర అంశాలను పరిశీలిస్తున్నాని, ఈ అంశాల పరిష్కారమే ప్రధాన ఎజండాగా ఉండాలని ఆయన తెలిపారు. దేశంలోని 623 జిల్లాలలో పర్యటించానని, ఆయా ప్రాంతాలలోని సమస్యలు, ప్రజల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్ల గురించి తనకు తెలుసునని పేర్కొన్నారు. నాయకుడనేవారు ఎప్పుడూ పర్యటిస్తుండాలని, ప్రజలతో మమేకమై ఉండాలని, అలా చేస్తే అనుభవంతో పాటు పేరు కూడా వస్తుందన్నారు. ఉప రాష్ట్రపతి అంటే ప్రజలకు మేలు చేకూర్చే వారన్న అభిప్రాయాన్ని తీసుకు వస్తానని అన్నారు.

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత ప్రధానమని, అలాంటి పత్రికలు తనను అన్ని కాలాలలో అండగా నిలిచాయన్నారు. పత్రికల వల్లే తానీ స్థితికి చేరుకున్నానని చెప్పారు. పత్రికల వారితో మాట్లాడినపుడు కొన్ని సందర్భాలలో కరువుగా మాట్లాడానని, అయితే అక్కడ వచ్చిన సందర్భాన్ని బట్టి మాత్రమే మాట్లాడానని అన్నారు. పత్రికల వారితో తనకెప్పుడూ వైరం లేదని, వారితో కొన్ని సందర్భాలలో కఠినంగా ఉన్నప్పటికీ ఆ తర్వాత వారు అర్థం చేసుకునే వారన్నారు. పత్రికలలో పని చేసే వారికి, సంపాదకులకు, యాజమాన్యాలకు తానెప్పుడూ వ్యక్తిగత ప్రయోజనాలను చేకూర్చే విధంగా వ్యవహరించలేదన్నారు. ఈ సమావేశంలో పలు పత్రికల సంపాదకులు, విలేఖరులు పాల్గొన్నారు. వీరితో పాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బిజెఎల్‌సి నేత జి. కిషన్‌రెడ్డి, ఎంఎల్‌ఏ చింతల రామచంద్రారెడ్డి, ఎంఎల్‌సి ఎన్. రాంచందర్‌రావు, పార్టీ అధికార ప్రతినిధులు కొల్లి మాధవి, ఎన్‌వి సుభాష్, కృష్ణసాగర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, నేతలు చింతా సాంబమూర్తి, నల్లు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజెపికి అంత సీన్ లేదు

(మూడవపేజీ తరువాయి)

సచివాలయంలో జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠి సంభాషణలో మంత్రి కెటిఆర్ అన్నారు. టిఆర్‌ఎస్ అధికారంలోకి రాదనకుంటే తమ పార్టీ వారెవరైనా బిజెపితోనో, ఇతర పార్టీలతోనో టచ్‌లో ఉంటారేమోనని, కాని వచ్చేసారి టిఆర్‌ఎస్ అధికారంలోకి రాదంటే జానా, ఉత్తమ్‌లే ఒప్పుకోరని అన్నారు. ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసినే కెసిఆర్ ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో వేరే పార్టీ అధికారంలోకి రావడం కల్ల అని ఒప్పుకున్నారని చెప్పారు.2019లో సింగిల్‌గానే పోటీ చేస్తామని, ప్రతిపక్షాలు ఎన్ని ఎత్తులు జిత్తులు వేసినా సింగిల్‌గానే ఎదుర్కొంటామని కెటిఆర్ అన్నారు. నేరెళ్ల బాధితులను పరామర్శించడానికి వెళితే, పోలీసుల అత్యుత్సాహంపైనే ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై డిఐజి విచారణ జరుపుతున్నారని కెటిఆర్ అన్నారు. ఈ ఘటనలో పోలీసుల అత్యుత్సాహం ఉందని తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వ్యవహారంలో పోలీసుల కస్టడీ, అరెస్టు గురించి నాకు తెలీదని, రిమాండ్ రిజెక్ట్ అయ్యాకే తనకు సమస్య వెలుగులోకి వచ్చిందన్నారు. నేరెళ్లలో క్షణికావేశంలో జరిగిన సంఘటనను రాజకీయ పర్యాటకులు వచ్చి పెద్దదిగా చేస్తున్నారని విమర్శించారు. నేరెళ్లలో ఇసుక లారీల ప్రమాదం నిజమని, ఆవేశంతో లారీలు తగులబెట్టారని, కానీ ప్రతిపక్షాలు చెబుతున్నట్లు ఇసుక మాఫియా కోణం, దళితుల కోణం లేదన్నారు.ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లం, ప్రజాస్వామ్యం ఉండాలని కోరుకుంటామని, పోలీసులను ప్రయోగించే అవసరం లేదని కెటిఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మిడ్ మానేరులో నీటి నిల్వకు వీలుగా ఇసుకను తీస్తున్నామని, ఇందుకోసం అధికంగా లారీలు ఏర్పాటు చేసామన్నారు. లారీల సంఖ్య పెరిగినందునే యాక్సిడెంట్లు జరిగి ఉంటాయని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల నుంచే తాను పోటీ చేస్తానని కెటిఆర్ చెప్పారు. తనకు, మంత్రి హరీశ్ రావుకు ఎటువంటి అపోహలు లేవన్నారు.

హిమాన్షు మోటార్స్‌పై...

హిమాన్షు మోటార్స్‌లో 2009 నుంచి నష్టాల్లో ఉందని కెటిఆర్ తెలిపారు. ఇది ప్రధానంగా ట్రాక్టర్ స్పేర్‌పార్ట్స్ సరఫరాకు సంబంధించిన సంస్థ అని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం కార్లు, మోటారు బైకుల కొనుగోలుకు సంబంధమే లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు తప్పన్నారు. ఈ విషయంలో ఆఖరుకు నా కొడుకును కూడా తిడుతున్నారు. చిన్న పిల్లాన్ని కూడా తిట్టుడు ఎంత వరకు సబబని ప్రతిపక్ష పార్టీలను ప్రశ్నించారు.

రాష్ట్రానికి ప్రైవేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ..?

'రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై ఈ నెల చివరికల్లా ప్రకటన వచ్చే అవకాశం ఉందని కెటిఆర్ అన్నారు. రైల్వే శాఖతో సంబంధం లేకుండా ఈ కోచ్ ఫ్యాక్టరీ వచ్చే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో నీతి అయోగ్ నిర్వహించే గ్లోబల్ ఎంటర్‌ప్రీన్యూర్ సమ్మిట్ నవంబరులో హైదరాబాద్‌లో జరుగుతుందని, దీనికి ప్రధాని హాజరవుతారని తెలిపారు. ఇదే సమయంలో మెట్రో రైల్ ప్రారంభానికి ఆయన సమయం కోరామని చెప్పారు.

పైరుకు ఊపిరి

(మూడవపేజీ తరువాయి)

నుంచి కాత దశకు వెళ్తున్న పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు ఈ వానలు ఊపిరి పోశాయని చెబుతున్నారు. వ్యవసాయశాఖ విడుదల చేసిన తాజా వారాంతపు నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోటి ఎకరాల సాగు అంచనాకు గాను ఇప్పటి వరకు 84.13 లక్షల ఎకరాల్లో 78 శాతం పంటలు సాగయ్యాయి. ఇందులో 11.51 లక్షల ఎకరాల్లో (50 శాతం) వరినాట్లు వేశారు. అయితే 23.07 లక్షల ఎకరాలలో వరినాట్లు పడుతాయని వ్యవసాయ శాఖ అంచనా. అత్యధికంగా పత్తి పంట 43.91 లక్షల ఎకరాలలో సాగైంది. కందులు 5.85 లక్షల ఎకరాల్లో వేశారు. పప్పుదినుసుల సాగు 8.69 లక్షల ఎకరాలు ఉండగా, మొత్తంగా ఆహార పంటలు 48.13 లక్షల ఎకరాలకు గాను 32.24 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ నివేదికలో నమోదయ్యాయి.

తగ్గిన సోయాబీన్, మొక్కజొన్న సాగు : గత ఏడాదితో పోలిస్తే సోయాబీన్, మొక్కజొన్న సాగు తగ్గింది. సోయాబీన్ వానాకలం సాగు అంచనా 5.73 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 3.97 లక్షల ఎకరాల్లోనే సాగయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయానికి సోయా 7.33 లక్షల ఎకరాల్లో సాగు కావడం గమనార్హం. గతంలో అంతగా ధర రాకపోవడం, పంట చేతికి వచ్చేసరికి వానలు పడటంతో నష్టం వాటిల్లిందని, అదే ఈసారి సాగు తగ్గుదలకు కారణంగా అధికారులు చెబుతున్నారు. సోయా సాగు అంచనాల వరకు రావడం కష్టమేనని చెబుతున్నారు. అలాగే మొక్కజొన్న సాగు అంచనా 13.04 లక్షల ఎకరాలు కాగా 10.97 లక్షల ఎకరాల్లో సాగు చేశారు.వానలు గట్టిగా పడటం లేదు : శ్రావణ్, భువనగిరి యాదాద్రి, శారాజిపేట గ్రామ రైతు మొన్న, నిన్న ముసురు వానలే పడుతున్నాయి. భారీగా ఏమి పడటం లేదు. ఆరు ఎకరాల్లో పత్తి వేశాను. మొత్తం వాడిపోయిండే, ఇంకా నాలుగు రోజులైతే పంటను చూడకపోతుండే. అయితే ఈ ముసురు పంటను కొన్ని రోజులు బతికించేలా చేసింది. ఇంకా వానలు పడితినే పంటలు మంచిగుంటాయి.

కాంగ్రెస్ ఎంఎల్‌ఎలపై వేటు

(మూడవపేజీ తరువాయి)

అతిక్రమించినందుకు మరో ఆరుగురు ఎంఎల్‌ఎలకు కూడా ఉద్వాసన పలకబోతున్నాం' గుజరాత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అశోక్ గెహ్లాట్ చెప్పారు. రాజ్యసభ ఎన్నికలకు ముందుగా పార్టీని వీడిన సీనియర్ నేత శంకర్ సిన్హా వాఘేలా ఈ ఎనిమిది మంది ఎంఎల్‌ఎలు సన్నిహితంగా ఉన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి బల్వంత్‌సిన్హ రాజ్‌పుత్‌పై కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ విజయం సాధించారు. నిబంధనలను ఉల్లంఘించారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు అసమ్మతి ఎంఎల్‌ఎల ఓట్లను చెల్లనివిగా ఎన్నికల సంఘం (ఇసి) ప్రకటించడంతో పటేల్ గెలుపుకు మార్గం సుగమమయింది.

గులాబీ కూలీ పేరిట అవినీతి: ఇసికి రేవంత్ ఫిర్యాదు

మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్‌ఎస్ ఆవిర్భావ సభ కోసం గులాబీ కూలీ పేరిట ప్రభుత్వానికి చెందిన మంత్రులు చట్ట విరుద్ధంగా అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు వసూలు చేశారని, వారిని ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ టిడిఎల్Aపి నేత ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అలాగే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంశాఖ, సిబిఐ, రాష్ట ఎసిబి ఉన్నతాధికారులు, మంత్రులకు కూడా ఫిర్యాదు లేఖలను బుధవారం ఆన్‌లైన్‌లో పంపారు. టిఆర్‌ఎస్ ఆవిర్భావ కార్యక్రమం కోసం మంత్రులు తమ శాఖల పరిధిలోని సంస్థలలో కొన్ని నిమిషాలపాటు సేవ చేసినట్లు నటించి ఆయా సంస్థల నుంచి లక్షల రూపాయలు బహిరంగంగా వసూలు చేశారని వాస్తవానికి ఇది అవినీతి తప్ప శ్రమదానం చేయడం కాదని రేవంత్ తన ఫిర్యాదులో తెలిపారు. కొద్దిసేపు కూలీ పనులు చేస్తేనే మంత్రులకు వచ్చినట్లుగా లక్షల రూపాయలు ఆదాయంగా వస్తే ఇక ఎవరు కూడా ఇతర పనులు చేయబోరన్నారు. అలాగే ఎవరు కూడ ఉచితంగా లక్షల రూపాయలు ఇవ్వరని, తమకు ప్రయోజనం ఉన్నప్పుడు మాత్రమే అలా ఇవ్వడానికి సిద్దపడతారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముంచెత్తిన కోటా మరాఠా

(మూడవపేజీ తరువాయి)

రిజర్వేషన్ల కోసం ఉద్యమం జరుగుతోందని, రాజకీయ జోక్యం తగదని పేర్కొంటూ శివసేన వారు బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఆజాద్ మైదాన్‌లో ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన బిజెపి ముంబై శాఖ అధ్యక్షులు ఆశిష్ షేలార్‌ను ఉద్యమకారులు అక్కడి నుంచి పంపించివేశారు. మరాఠా వర్గీయుల ప్రతినిధిగా సామాన్య వ్యక్తిగానే తాను ఈ నిరసనలో పాల్గొంటున్నానని శివసేనకు చెందిన రాజ్యసభ సభ్యులు ఛత్రపతి శంభాజీ రాజే తెలిపారు. ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హామీ ఇచ్చినప్పటికీ పలుచోట్ల ఈ ఉద్యమం తీవ్రం అవుతోంది. ఉద్యమానికి తమ మద్దతు ఇస్తున్నట్లు బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ ప్రకటించారు. ఏక్ మరాఠా లాఖ్ మరాఠా అంటూ ఆయన మరాఠీలో ట్వీటు చేశారు. ముంబైలో ఉద్యమం మరాఠా క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో చేపట్టారు. రిజర్వేషన్ల కోసం చేపట్టిన ర్యాలీలో ముంబైలోజరిగిందే భారీ స్థాయి ర్యాలీ అని వెల్లడైంది. ఎక్కడా ఎలాంటి గొడవ లేకుండా మౌనంగా ఈ యాత్ర సాగింది. మహారాష్ట్ర అసెంబ్లీ సెషన్ జరుగుతూ ఉండటంతో మోర్చా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది. వారితో భేటీ తరువాత సిఎం ఫడ్నవిస్ మాట్లాడుతూ మరాఠాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ అంశంపై సమగ్ర నివేదికను అందించాలని తాము మహారాష్ట్ర బిసి కమిషన్‌ను కోరినట్లు వెల్లడించారు. క్రాంతిమోర్చా ఆధ్వర్యంలో గత ఏడాది ఇదే తరహాలో 57 మౌన ప్రదర్శనలు జరిగాయి. ఇప్పుడు జరిగేదే చివరి ప్రదర్శన అని, తమ డిమాండ్లను వచ్చే రెండు వారాలలోగా పరిష్కరించాలని లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం నాటి ముంబై ప్రదర్శనలో దాదాపు ఆరు లక్షలకు పైగా జనం పాల్గొన్నట్లు వెల్లడైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కొపర్డి ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ విచారణ
మరాఠాలకు ప్రత్యేక హాస్టళ్లు

ఏడాది క్రితం కొపర్డి గ్రామంలో 15 ఏళ్ల మరాఠా బాలికపై అత్యాచారం, హత్య ఘటనలో అరెస్టు అయిన వారికి మరణశిక్ష విధించాలని కోరుతూ మరాఠాలు ఉద్యమం చేపట్టారు. మరాఠాలకు అన్నింటా అన్యాయం జరుగుతోందని, అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని, వ్యవసాయ రుణాల బకాయిలు మాఫీ చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులపై కనీస మద్దతు ధర ప్రకటించాలని వారు అనుబంధ అంశాలను కూడా ప్రస్తావించారు. బాలిక కుటుంబానికి న్యాయం కోసం చేపట్టిన ఆందోళన ఇప్పుడు రిజర్వేషన్ల కల్పన దిశగా వెళ్లింది. బుధవారం నాటి ప్రదర్శనలో కొపర్డి గ్రామస్తులు , బాలిక కుటుంబానికి చెందిన వారూ కూడా పాల్గొన్నారు. తమకు ఇప్పటివరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక గ్యాంగ్‌రేప్, హత్య అంశంపై బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ఓ ప్రకటన వెలువరించారు. ఈ ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరుగుతోందని, నేరస్థులకు కఠిన శిక్ష పడుతుందని తెలిపారు. ప్రతి జిల్లాలో మరాఠా వారికోసం రూ ఐదు కోట్లతో వసతి గృహాల ఏర్పాటుకు భూమి కేటాయించినట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో భారీ వర్షం



మన తెలంగాణ/హైదరాబాద్: ఖమ్మంలో 9, మెదక్‌లో 7 సెంటీమీటర్ల వర్షపాతం గత 24 గంటల్లో నమోదైంది. అల్పపీడన ద్రోణి తెలంగాణపై చురుకుగా ఉంది. మంగళవారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఈశాన్య మధ్యప్రదేశ్‌పైన సముద్రమట్టానికి 1.5 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో పయనిస్తోంది. చత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా ఆవర్తన ద్రోణి ఆవరించింది. ఫలితంగా రాష్ట్రంలోని చాలా చోట్ల వచ్చే రెండు, మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఖమ్మం, మెదక్ జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో ఖమ్మంలో గరిష్టంగా 9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మెదక్‌లో 7, హైదరాబాద్ గోల్కొండలో 6, వెంకటాపూర్, సరూర్‌నగర్, నాగార్జునసాగర్‌లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూలపల్లి, సుల్తానాబాద్, పాలకుర్తి, మహబూబాబాద్, పేరూరు, సంగారెడ్డి, పరకాల, మాగనూరు, మక్తల్, పిట్లం, జగిత్యాలలో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నాగారెడ్డిపేట, గోవిందరావుపేట, భువనగిరి, మంథని, వికారాబాద్, ధర్మాసాగర్, భువనగిరి, భూపాలపల్లి, చెన్నూరు, హయత్‌నగర్, హకీంపేట, శామీర్‌పేట, హైదరాబాద్, దేవరకొండ, నిజాంసాగర్, ఎంకూరు, రామన్నపేటలో 2 సెంటీమీటర్లు, చిన్నచింతకుంట, వేల్పూరు, బయ్యారం, చెన్నారావుపేట, గార్ల, ఏటూరునాగారం, హన్మకొండ, పెగడపల్లి, గాంధారి, మెట్‌పల్లి, గట్టు, ఖానాపూర్, సిరిసిల్ల, మర్పల్లి, హసన్‌పర్తి, జఫర్‌గఢ్, మేడ్చల్, జనగాం, జుకల్, ఎల్లారెడ్డి, నర్సంపేట తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది.



ఇచ్చిన హామీని నెరవేర్చని సిఎం : జైపాల్‌రెడ్డి

మన తెలంగాణ/కరీంనగర్ ప్రతినిధి : సిఎం కెసిఆర్ కరీంనగర్ పర్యటనలో భాగంగా గత మూడేళ్ల క్రితం కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు హామీలు ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చకపోవడంతోనే మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ ఆసుపత్రిలో ఉన్న పొన్నం ప్రభాకర్‌ను పరామర్శించి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ కు ప్రభుత్వ మెడికల్ కళాశాల తప్పనిసరిగా అవసరం ఉందన్నారు. గత నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన పొన్నం ప్రభాకర్ ఆరోగ్యం క్షీణించిందని వైద్యులు తెలపడంతోనే దీక్షను తాను విరమింపచేశానని అన్నారు. మూడు నెలలలోపు కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ రూపొందించి తిరిగి ఆందోళన బాటపడుతుందన్నారు. సిఎల్‌పి ఉపనేత జీవన్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు కటకం మృత్యుం జయం, మాజీ ఎమ్మెల్యేలు ప్రవీణ్ రెడ్డి, కొడూరి సత్యనారాయణగౌడ్, బొమ్మ వెంకన్న, మాజీ ఎంపి రాజయ్య, ప్రజా సంఘాల రాష్ట్ర చైర్మన్ గజ్జల కాంతం, డిసిసి అధికార ప్రతినిధి ఒంటెల రత్నాకర్, నగర అధ్యక్షులు కర్ర రాజశేఖర్, ఉప్పరి రవి పాల్గొన్నారు.

బాసర ఘటనపై మరో ముగ్గురి సస్పెన్షన్

మనతెలంగాణ/బాసర : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో జరుగుతున్న అక్రమాలతో భక్తులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నల్గొండ జిల్లాలోని దేవరకొండలో ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన కార్యక్రమం కోసం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుండి తరలించిన విషయం విధితమే. దీనికి బాధ్యులైన ఆలయ అర్చకులు సంజీవ్ పూజారీ, ప్రణవ్‌శర్మను విచారణ జరిపి సస్పెండ్ చేయగా తాజాగా ఆలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ శివరాజ్, స్వీపర్ సుశీల, తాత్కాలిక ఉద్యోగి రమేష్‌లు అక్రమాలకు బాధ్యులని రుజువు కావడంతో వీరిని సస్పెండ్ చేసినట్టు ఆలయ ఇఓ అన్నాడీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆలయ ఇఓ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైల్లో గంజాయి పట్టివేత



మనతెలంగాణ/మంచిర్యాలక్రైం/కాజీపేట : విజయవాడ నుండి మహా రాష్ట్రకు రైల్లో అక్రమంగా 12 కిలోల గంజాయిని తరలిస్తున్న షకీల్‌ఖాన్ పటాన్, సునీల్ ఇంగిడేలను మంగళవారం రాత్రి మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా పట్టుకున్నారు. నిందితులు మహారాష్ట్రానికి చెందిన వారు గుర్తించారు. పట్టుబడిన వారిని కాజిపేట లోని రైల్వే కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో రైల్వే సిఐ వెంకటేష్, ఎస్ఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ జగన్, శ్రీహరి, అశోక్ కార్తీక్ ఉన్నారు.


గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తి అరెస్టు

ఆబ్కారీ దాడులతో వెలుగులోకి వచ్చిన ఘటన



మనతెలంగాణ/మెదక్ ప్రతినిధి: జిల్లాలో గంజాయి మొక్కల పెంప కానికి అడ్డు ఆగడాలు లేకుండా పోతున్నాయి. కొందరు వ్యక్తులు తమ పంట పొలంలోని బీరకాయ తోట మధ్యలో గంజాయి మొక్కలను పెంచు తున్నారు. బుధవారం మెదక్ ఎక్సైజ్ అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు హవేళిఘనపూర్ మండలంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మండల పరిధిలో గల గంగాపూర్ తండాలోని లంబాడి ముడావత్ పెంట్యాను అదుపులోకి తీసుకుని విచారించగా తన పొలంలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో నిందితుని అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్లు ఎక్సైజ్ సిఐ ఎక్సైజ్ సిఐ గోపాల్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు యాదగిరి, విశ్వనాథ్, షఫిమియాలతో పాటు కానిస్టేబుల్లు మహేష్, ప్రభాకర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత



మన తెలంగాణ/తొర్రూరు : తొర్రూరు మండల కేంద్రంలో ఉన్న సివిల్ సప్లై గోదాము నుండి గత మూడు నెలల్లో 16 లారీల బియ్యాన్ని గోదాం ఇంచార్జ్ గిరిధర్ సహకారంతో ఇతర రాష్ట్రాలకు యధేచ్ఛగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మహ బూబాద్ జిల్లా, తొర్రూరు మండలానికి చెందిన చిదిరాల నవీన్ బినామీగా వ్యవహరిస్తున్న సిహెచ్.క్రిష్ణ పేరుతో ట్రేడింగ్ లైసెన్స్ తీసుకొని ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో అనేకసార్లు గోదాం నుండే నేరుగా ఇతరు రాష్ట్రాలకు బియ్యాన్ని తరలిస్తున్న లారీలను పట్టికున్నప్పటికీ అధికారుల అండదండలతో నిందితులు తప్పించుకుంటూనే ఉన్నారు. అయినా వారిని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జూడాల ఆందోళనబాట

● **ఉస్మానియా ఆసుపత్రి ఎదుట వైద్యుల ధర్నా**



మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: ప్రభుత్వ వైద్యశాలల్లో సెక్యూరిటీ సిబ్బందిని పెంచి వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు (జూడా)లు మళ్లీ ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు జూనియర్ డాక్టర్లు ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఓపి భవనం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు వైద్యులకు రక్షణ కల్పించాలి...సెక్యూరిటి సిబ్బందిని పెంచాలి...అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని...ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో అత్యవసర మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్బంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.విజయేందర్, కార్యదర్శి నిదావుల్లా, అభిషేక్, రాష్ట్ర సలహాదారు జి.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఉస్మానియా ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై మృతి చెందిన రోగి సహాయకుల దాడి ఘటనలో ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసు లు అత నితో పాటు దాడికి పాల్పడిన మహిళా సహాయకురాలిని అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. దాడికి నిరసనగా జూనియర్ డాక్టర్లుచే పట్టిన ఆందోళనతో దిగివచ్చిన డిఎంఈ జూడాల డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించామన్నారు. డిఎంఈ హామీ ఇచ్చి వారం రోజులు గడిచినా నేటికీ సెక్యూరి టీ సిబ్బ ందిని పెంచే విధంగా చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని అన్నారు. ఉస్మానియా ఆసుపత్రి లో వెంటనే సెక్యూరిటి సిబ్బంది పెంచాలని వారు డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా గల అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విధులను బహిష్కరించి ఆందోళన చేపడతామని వారు స్పష్టం చేశారు. జూడాల ఆందోళనతో స్పందించిన వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి వారిని చర్చలకు ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం జూడాల ప్రతినిధుల బృందం మంత్రితో చర్చలో పాల్గొన్నారు.

వైద్యమందక రోగుల అవస్థలు...

ఆకస్మికంగా జూనియర్ వైద్యులు ఓపీ వైద్యసేవలను బహిష్కరించి ఆందోళన బాట పట్టడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఓపీ వైద్యసేవలు అందక విలవిల్లాడారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని వెంటనే సమస్యలను పరిష్కరించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.



సామాజిక న్యాయంతోనే తెలంగాణాభివృద్ధి

మన తెలంగాణ/ఇబ్రహీంపట్నంటౌన్: తెలంగాణలో సామాజిక న్యాయం లేకుండా అభివృద్ధి జరగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్‌లో బహిరంగసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వీరభద్రంతో పాటు ప్రజాగాయకుడు, స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, సామాజికశాస్త్రవేత్త ప్రొ॥కంచె అయిలయ్య, డా: జెబి రాజు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, టప్ రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, ప్రొ:విశ్వేశ్వరరావు, బిసి ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ గొరిగె మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు కొండిగారి రాములు, మస్కు నర్సింహులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పట్నంలోని అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలువేసి అనంతరం శాస్త్రాగార్డెన్ వరకు ర్యాలీగా వెళ్ళారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సామెల్ అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని వీరభద్రం, ప్రజాగాయకుడు గద్దర్ మాట్లాడుతూ ఉద్యమాల శక్తిని రాజకీయ శక్తిగా మార్చడానికె టీ మాస్ ఏర్పడిందన్నారు. టీ మాస్ అంటే కెసిఆర్‌కు భయమెందుకని ప్రశ్నించారు. టీ మాస్ ఫోరం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యాన 173 సంఘాలు పాల్గొనగా జిల్లా నూతన స్టీరింగ్ కమిటీని ఒక్కో సంఘం నుండి ఇద్దరిని ఎంపిక చేయగా 48 మందితో కార్యవర్గం, 16మందితో జిల్లా స్టీరింగ కమిటీని ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. ఈ కమిటీ 2019నాటికి అన్ని జిల్లాలో అన్ని కులసంఘాలతో కలుపుకొని టీ మాస్ ఏర్పడాలని పిలుపునిచ్చారు. స్టీరింగ్ కమిటీ నాయకులు జాన్‌వెస్లీ, మేడిపాపయ్య, ఐ.మైసయ్య, వి.నారాయణ, దాస్‌రాంనాయక్, భూపా, ఆవుల మల్లేష్, భీంభరత్, జోగు రాములు పాల్గొనగా ప్రజానాట్యమండలి, గద్దర్ పాటలు ప్రజలను ఆకర్షించాయి.

త్వరలో ప్రతి ఇంటికి నల్లా!

● **మిషన్ భగీరథ పనులు పూర్తయితే ఏర్పాటు చేస్తాం : నాయిని**



మనతెలంగాణ/కొత్తూరు: ప్రతి ఇంటికి నల్లాను అందించే విధంగా ప్రభుత్వం మిషన్ భగీరథ పనులను పూర్తి చేసిన వెంటనే ప్రతి గ్రామంలో ఇంటికొక నల్లాను అందిస్తామని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కొత్తూరు మండల కేంద్రానికి ముఖ్యఅతిథిగా హాజరై మండల కేంద్రంలో టిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండలంలోని ఇన్ముల్‌నర్వా గ్రామంలో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ని ప్రారంభించారు. అదేవిధంగా గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జహంగీర్‌పీర్ దర్గాలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రూ.3కోట్లతో వ్యవసాయ గోదాంను నిర్మించనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాల భవనం కోసం నాలుగు కోట్ల 20లక్షలతో నిర్మించనునట్లు ఆయన వివరించారు. ఇన్ముల్‌నర్వా గ్రామంలో ప్రతి ఇంటికీ నల్లాను అందించేందుకు 2లక్ష, 50వేలతో హెడ్ఒవర్ ట్యాంక్ నిర్మాణం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కేజి టూ పిజి విద్యను అందించేందుకు ప్రభుత్వం 500గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 250 గురుకుల పాఠశాలలు ఎస్‌సి,ఎస్టీలకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. 119 గురుకుల పాఠశాలలు మైనార్టీలకు కేటాయించనున్నట్లు తెలిపారు. కేజి టూ పిజి విద్యను అందించేందుకు ఒక విద్యార్థికి రూ.85లక్షలు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. విద్యార్థులకు భోజనవసతితోపాటు యునిఫాంలను ఉచితంగా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. షాద్‌నగర్ ఎంఎల్‌ఎ అంజయ్య యాదవ్, మార్కెట్ కమిటి చైర్మెన్ యాదమ్మ, రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ జిల్లెల వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు ఏనుగు జనార్ధన్‌రెడ్డి, జనిగె జగన్, కొమ్ము క్రిష్ణా, కమలమ్మ, టిఆర్ఎస్ సీనియర నాయకులు వీర్లపల్లి శంకర్, పెంటనొళ్ళ యాదగిరి, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్స్‌కు నో చెప్పాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : పాఠశాల, కళాశాలల విద్యార్థులు డ్రగ్స్ నుండి దూరంగా ఉండాలని రిలయెన్స్ మార్కెటింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ హెడ్ వివేక్ మెహతా సూచించారు. సికింద్రాబాద్‌లో విజెకె ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఓన్లీ విమల్ షోరూంను బుధ వారం ఆయన ప్రారంభించారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం

మన తెలంగాణ/కాగజ్‌నగర్ : ఆదివాసీల హక్కుల సాధనకై పోరాటం చేయాలని జెఎసి చైర్మన్ కోదండరాం పిలుపు నిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రపంచ ఆదివాసి దినోత్సవ సభను బుధవారం స్థానిక పద్మశాలీ సేవా సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి 1994లో ఆదివాసుల హక్కుల కోసం తీర్మానించి ఆగస్టు 9, 1994ను ప్రపంచ ఆదివారి దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. ఆదివాసులు గత కొన్నేళ్లుగా భూమి భుక్తి కోసం పోరాడుతున్నారని ఆదివాసులు సాగు చేసుకుంటున్న అటవీ భూములన్నింటికీ 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని కోనేరు రంగారావు కమిటీ సూచనలకు అనుగుణంగా 1/70 చట్టాన్ని అమలు చేయాలన్నారు. టివివి రాష్ట్ర అధ్యక్షుడు గురిజాల రవీందర్, కాకతీయ ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాస్, గంట పెంటన్న, దుర్గం విస్తారు, సోయం చిన్నయ్య, పాల్గొన్నారు.


ఎసిబికి చిక్కిన పంచాయతీరాజ్ ఎఇ



మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పంచాయతీ రాజ్‌శాఖలో ఎఇగా పని చేస్తున్న కుర్షీద్ అన్వర్ 50 వేల రూపాయలను లంచంగా తీసుకుంటుండగా మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో గల ఒక బేకరిలో ఎసిబి అధికారులు వల వేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... కోటపల్లి మండలం బబ్బెరచిలుక గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి, విశ్వజిత్‌రెడ్డిలు దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ భవన నిర్మాణానికి కాంట్రాక్టు పొందారు. భవన నిర్మాణం కోసం రూ.12 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ మొదటి విడత బిల్లును 3.54 లక్షల రూపాయలు పొందారు. మిగిలిన 8.46 లక్షల రూపాయలు ల్లించాలని ఎఇకి దరఖాస్తు చేసుకున్నారు. అయితే సదరు ఏఇ బిల్లు మొత్తంలో 6శాతం అనగా 50 వేల రూపాయలను లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులు లంచం ఇవ్వకపోవడంతో గత నాలుగు నెలలుగా బిల్లు చెల్లించలేదని, దాంతో గత్యంతరం లేక 50 వేలు లంచం ఇస్తామని నమ్మబలికి సమాచారాన్ని ఎసిబి అధికారులకు అందించారు. రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు పథకం ప్రకారం.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కాంట్రాక్టరు వద్ద నుండి లంచం తీసుకుంటున్న కుర్షిద్ అన్వర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టున్నారు. డిఎస్‌పి వెంట సిఐలు సిహెచ్ వేణుగోపాల్, కాశయ్య, హెడ్‌కానిస్టేబుల్ మసూద్, పోశెట్టి ఉన్నారు.

పిసిబి నూతన చైర్మన్‌గా నజమ్ సేథి

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్‌గా నజమ్ సేథిని నియమించారు. పది మందితో కూడిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పాలక మండలి కమిటీ నజమ్‌ను కొత్త చైర్మన్‌గా ఎంచుకుంది. ఇప్పటివరకు బోర్డు చైర్మన్‌గా పని చేసిన షహర్యార్ ఖాన్ అనారోగ్య కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కొత్త చైర్మన్‌గా నజమ్‌ను ఎన్నుకున్నారు. కాగా, నజమ్ పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు సన్నిహితుడు కావడం విశేషం. గతంలో పిసిబి చైర్మన్‌గా పనిచేసిన షహర్యార్ ఖాన్‌కు కూడా నవాజ్ షరీఫ్ అండదండలు ఉండేవి. కాగా, నజమ్ ఎన్నేళ్లు ఈ పదవిలో కొనసాగుతాడనే విషయంపై ఇంకా తేల్చలేదు. ప్రస్తుతం మాత్రం అతను చైర్మన్‌గా పదవిలో కొనసాగుతారు. నజమ్‌ను పాలక మండలి ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఇతరులు ఎవరు నామినేషన్లు దాఖలు చేయక పోవడంతో నజమ్ ఎన్నిక ఏకగ్రీవ సులువు అయ్యింది. ఈ సందర్భంగా నజమ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని నజమ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం తన దృష్టంతా పాక్ క్రికెట్‌లో నెలకొన్న అనిశ్చితిని తొలగించడంపైనే కేంద్రీకరిస్తున్నట్టు నజమ్ వివరించాడు.



అక్షర్ పటేల్‌కు జట్టులో చోటు

ముంబయి : శ్రీలంకతో జరిగే మూడో టెస్టు కోసం యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు భారత జట్టులో చోటు కల్పించారు. ఐసిసి కోడ్ ఉల్లంఘన కారణంగా రవీంద్ర జడేజా మూడో టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే. అతని స్థానంలో గుజరాత్‌కు చెందిన అక్షర్ పటేల్‌కు చోటిచ్చారు. శనివారం నుంచి కాండీలో ఈ మ్యాచ్ జరుగనుంది. అక్షర్ పటేల్ గతంలో వన్డేల్లో, టీ–20ల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ప్రస్తుతం అతను భారత్–ఎ జట్టు సభ్యుడిగా దక్షిణాఫ్రికాలో పర్యటిస్తున్నాడు. అయితే మూడో టెస్టు నేపథ్యంలో అతనికి జట్టులో స్థానం లభించింది. దీంతో అతను శ్రీలంకకు ప్రయాణం కానున్నాడు. 23 ఏళ్ల అక్షర్ పటేల్ 30 వన్డేలు, మరో ఏడు టీ–20 మ్యాచుల్లో భారత్ తరపున ఆడాడు. టెస్టుల్లో అతనికి స్థానం దక్కడం ఇదే ప్రథమం. జట్టులో స్థానం కోసం జయంత్ యాదవ్ పేరును కూడా పరిశీలించిన సెలెక్టర్లు చివరికి అక్షర్‌కు చోటు కల్పించారు. కాగా, ఇప్పటికే చైనామెన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ చివరి టెస్టులో బరిలోకి దిగడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో జట్టుకు ఎంపికైన పదకొండు మందిలో అక్షర్‌కు స్థానం లభించడం కష్టమనే చెప్పాలి.






క్లీన్‌స్వీప్‌పై టీమిండియా దృష్టి

● చివరి టెస్టుకు సిద్ధమవుతున్న కోహ్లిసేన

పల్లెకెలె : శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌లో టీమిండియా క్లీన్‌స్వీప్‌పై దృష్టి సారించింది. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను దక్కించుకున్న భారత్ ఇక దృష్టంతా క్లీన్ స్వీప్ చేయడంపై పెట్టింది. శనివారం నుంచి ప్రారంభమయ్యే చివరి టెస్ట్‌లోనూ గెలిచి లంక గడ్డపై క్లీన్‌స్వీప్ ఫీట్‌ను సాధించాలనే పట్టుదలతో ఉంది. ఆఖరి టెస్ట్‌కు స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సేవలు జట్టుకు అందుబాటులో లేకుండా పోయాయి. అయితే అతను లేకున్నా భారత్ చాలా బలంగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కోహ్లి సేన దుర్భేద్యంగా మారింది. టాప్ ఆర్డర్‌తో పాటు టైలెండర్లు సైతం బ్యాట్‌ను ఝులిపిస్తుండడం భారత్‌కు కలిసి వచ్చే అంశం. ఇప్పటికే సిరీస్ గెలుచుకోవడంతో భారత్ ఒత్తిడి లేకుండా మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. నాలుగో రోజే రెండో టెస్ట్‌ను కైవసం చేసుకున్న టీమిండియా ప్రస్తుతం విందు, వినోదాలతో సందడి చేస్తోంది. కెప్టెన్ కోహ్లితో సహా చాలా మంది క్రికెటర్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి లంక అందాలను ఆస్వాదిస్తున్నారు. అయితే షికార్లతో బీజీగా ఉన్నా తీరిక దొరికితే కొద్ది సేపు సాధన చేస్తున్నారు. జయసూర్య, మహేల జయవర్ధనే, సంగక్కర, అరవింద డిసిల్వా, దిల్షాన్, మురళీధరన్ తదితరులు ఉన్నప్పుడూ టీమిండియా లంక గడ్డపై ఘోర పరాజయాలు చవిచూసిన విషయం తెలిసిందే. సచిన్, గంగూలీ, కుంబ్లే, లక్ష్మణ్, ద్రవిడ్, ధోనీ వంటి దిగ్గజాలు ఉన్నా భారత్‌కు లంక గడ్డపై అవమానకర పరిస్థితులు తప్పలేదు. అయితే ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. సంగక్కర, జయవర్ధనే, దిల్షాన్ వంటి స్టార్లు రిటైర్మెంట్ ప్రకటించడంతో లంక బలహీనంగా మారింది. వీరి స్థానాలను భర్తీ చేయడం ప్రస్తుతం లంకకు శక్తికి మించిన పనిగా మారింది. ఈ పరిస్థితుల్లో సొంతగడ్డపై సైతం చేదు అనుభవాలను చవిచూస్తోంది. ఇటీవలే జింబాబ్వే వంటి బలహీన జట్టు చేతిలో సైతం వన్డేల్లో పరాజయం పాలైంది. అంతేగాక, బంగ్లాదేశ్ చేతిలోనూ చావుదెబ్బతింది. ఈ పరిస్థితుల్లో భారత్ వంటి పటిష్టమైన జట్టును ఎదుర్కొవడం లంకకు కష్టంగా మారింది. దీని ప్రభావం మొదటి రెండు టెస్టుల్లో స్పష్టంగా కనిపించింది. కాగా, కోహ్లి సారథ్యంలోని భారత్ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలో టీమిండియా చాలా బలంగా ఉంది. ఓపెనర్లతో మొదలుకుని చివరి బ్యాట్స్‌మన్‌గా వచ్చే ఉమేశ్ యాదవ్ సైతం కుదురైన బ్యాటింగ్ చేయగలిగే సత్తా కలిగి ఉన్నాడు. ఇటీవల ముగిసిన రెండు టెస్టుల్లో ఈ విషయం స్పష్టమైంది. మరోవైపు చివరి మ్యాచ్‌లోనూ గెలిచి వన్డే సిరీస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భారత్ భావిస్తోంది.

బంగ్లాతో సిరీస్ పరీక్షలాంటిదే: స్మిత్



మెల్‌బోర్న్: బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్ తమకు పరీక్షలాంటిదేనని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టివ్ స్మిత్ అన్నాడు. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌ను ఎదుర్కొవడం ఏ జట్టుకైన అంత తేలిక కాదని స్మిత్ పేర్కొన్నాడు. కాగా, తమ క్రికెట్‌లో నెలకొన్న వివాదానికి తెరపడడం ఆనందంగా ఉన్నాడు. ఇక తామంతా క్రికెట్‌పైనే దృష్టి పెడుతామని స్మిత్ అన్నాడు. బంగ్లాదేశ్ సిరీస్‌లో గెలిచి ఆత్మవిశ్వాసాన్ని సంపాదిస్తామన్నాడు. అయితే ఈ సిరీస్‌ను తాము తేలిగ్గా తీసుకోవడం లేదన్నాడు. ఇటీవల కాలంలో సొంత గడ్డపై బంగ్లా వరుస విజయాలు సాధిస్తున్న విషయాన్ని స్మిత్ గుర్తు చేశాడు. కాగా, ఈ సిరీస్‌లో అష్టన్ అగర్ తమకు చాలా కీలకమన్నాడు. అతని ఆల్‌రౌండ్ ప్రతిభ జట్టుకు కలిసివస్తుందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో తమ జట్టు సమతూకంగా ఉందన్నాడు. కాగా, చాలా రోజుల తర్వాత టెస్టు క్రికెట్ బరిలోకి దిగుతుండడం ఒక్కటే తమకు ప్రతికూలమైన అంశమన్నాడు.

సత్తా చాటుతా: కుల్దీప్

పల్లెకెలె: చివరి టెస్టులో సత్తా చాటేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భారత యువ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ధీమా అన్నాడు. తుది జట్టులో తనకు చోటు లభిస్తుందనే పూర్తి నమ్మకం ఉందన్నాడు. రవీంద్ర జడేజా ఆఖరి మ్యాచ్ దూరం కావడంతో కుల్దీప్ యాదవ్‌కు పల్లెకెలె టెస్టులో ఆడే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. అక్షర్ పటేల్‌ను చివరి టెస్టుకు ఎంపిక చేసినప్పటికీ అతనికి తుది జట్టులో స్థానం కష్టమేనని చెప్పవచ్చు. కాగా, కుల్దీప్‌కు మాత్రం అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. గతంలో ఆస్ట్రేలియాతో ఆడిన తొలి టెస్టులోనే కుల్దీప్ అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో జడేజా స్థానంలో అతనికే ఛాన్స్ లభించడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని కుల్దీప్ అన్నాడు. చైమామెన్ బౌలర్‌గా ప్రసిద్ధి పొందిన కుల్దీప్ దేశవాళి క్రికెట్‌లో మెరుగైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో గతంలో అతనికి ధర్మశాల టెస్టులో తుది జట్టులో చోటు లభించింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కుల్దీప్ అప్ప ట్లో నాలుగు వికెట్లు పడగొట్టి పెను సంచలనమే సృష్టించాడు. లంకపై కూడా చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు. కెప్టెన్ కోహ్లి కూడా కుల్దీప్‌ను చివరి టెస్టులో ఆడించాలనే ఉద్దేశంతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతని ఎంపిక లాంఛనమే.



కాగా, తుది జట్టులో చోటు లభిస్తే మాత్రం సత్తా చాటేందుకు ఈ యువ బౌలర్ ఉవ్విళూరుతున్నాడు.

ధోనీ, కోహ్లి వల్లే ఈ స్థాయికి : రవీంద్ర జడేజా

న్యూఢిల్లీ: మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లిల వల్లే తాను అగ్రశ్రేణి ఆల్‌రౌండర్‌గా ఎదిగానని భారత స్టార్ రవీంద్ర జడేజా అభిప్రాయ పడ్డాడు. ఇద్దరు కూడా తనకు కావాల్సినంత ప్రోత్సాహం అందించారని తెలిపాడు. ప్రారంభంలో కెప్టెన్ ధోనీ ప్రతి సిరీస్‌లో తనకు అండగా నిలిచే వాడన్నాడు. క్లిష్ట సమయంలో కూడా ధోనీ వెన్నంటి ఉన్నాడని వివరించాడు. అతనిచ్చిన మనోధైర్యం వల్లే తన ఆట గాడిలో పడిందన్నాడు. వరుస వైఫల్యాలు చవిచూసినప్పటికీ ధోనీ తనపై నమ్మకం ఉంచాడన్నాడు. ఇది తనలో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నాడు. అతనిచ్చిన ప్రోత్సాహం, సహకారం ఎప్పటికీ మరచిపోనని జడేజా స్పష్టం చేశాడు. ఇక, ప్రస్తుత కెప్టెన్ కోహ్లి కూడా తనకు పూర్తి సహకారం అందిస్తున్నాడని తెలిపాడు. టెస్టుల్లో తాను నంబర్‌వన్ బౌలర్‌గా, ఆల్‌రౌండర్‌గా ఎదగడంలో కోహ్లి పాత్ర చాలా కీలకమన్నాడు. బౌలర్‌గా అతను నాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడన్నాడు. వైఫల్యాలు చవిచూసిన వెన్నుతట్టి ప్రోత్సాహించడన్నాడు. అందువల్లే తాను అగ్రశ్రేణి టెస్టు బౌలర్లలో ఒకడిగా ఎదగగలిగానని జడేజా పేర్కొన్నాడు. భవిష్యత్తులో కూడా కోహ్లి అండ తనకు ఉంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. తన కెరీర్‌లో ధోనీ, కోహ్లిలకు ప్రత్యేక స్థానం ఉందన్నాడు. ఈ రోజు తాను ఈ స్థాయిలో నిలిచానంటే దానికి వారిద్దరే కారణం అని చెప్పడంలో తనకు ఎలాంటి సంకోచం లేదన్నాడు. కష్టాల్లో కూడా వీరిద్దరూ అండగా నిలిచి తనలో ధైర్యాన్ని నింపారని తెలిపాడు. ఇక, సహచర బౌలర్ అశ్విన్ సహకారం కూడా వేల కట్టలేనిదన్నాడు. అతను కూడా తనకు ఎన్నో చిట్కాలు చెబుతుంటాడని, మాజీ కోచ్ అనిల్ కుంబ్లే కూడా తనకు అండగా నిలిచాడని జడేజా పేర్కొన్నాడు. కాగా, మూడో టెస్టుకు దూరం కావడం చాలా బాధగా ఉందన్నాడు.



ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూశా

● రోజర్ ఫెదరర్

లండన్: సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూశానని స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్ అన్నాడు. 36 ఏళ్లు పూర్తి చేసుకున్న ఫెదరర్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పాడు. రికార్డు స్థాయిలో ఎనిమిదో వింబుల్డన్ టైటిల్ సాధించడం మరచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నాడు. సుదీర్ఘ కాలంపాటు అంతర్జాతీయ టెన్నిస్‌లో కొనసాగడం ఎంతో ఆనందం కలిగించిందన్నాడు. మరి కొన్నేళ్లపాటు టెన్నిస్ ఆడే సత్తా తనలో ఉందన్నాడు. ఫిట్‌నెస్ సహకరించినంత కాలంలో తనకు ఎంతో ఇష్టమైన టెన్నిస్ కొనసాగిస్తానని తెలిపాడు. ఇప్పటికే టెన్నిస్‌లో తాను ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించానన్నాడు. అంకితభావంతో ఆడడం వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని వివరించాడు. వయసు పెరగడం వల్ల మునుపటిలా అన్ని టోర్నమెంట్‌లలో ఆడలేక పోతున్నానని తెలిపాడు. టెన్నిస్‌లో ఇంత సుదీర్ఘ కాలంపాటు కొనసాగడం గర్వంగా భావిస్తున్నట్టు చెప్పాడు. తన కెరీర్‌లో అత్యంత కఠిన ప్రత్యర్థి ఎవరైన ఉన్నారంటే అతను స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ మాత్రమే అన్నాడు. తామిద్దరం పోటీ పడితే వచ్చే మజా వేరేగా ఉంటుందన్నాడు. సెర్బియా స్టార్ జొకోవిచ్ కూడా తనకు చిరకాల ప్రత్యర్థినే అని స్పష్టం చేశాడు. కాగా, భవిష్యత్తులో నాదల్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోవడం ఖాయమని ఫెదరర్ జోస్యం చెప్పాడు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లలో నాదల్ ఒకడన్నాడు. అతన్ని ఓడించాలంటే ప్రత్యర్థులు సర్వం ఒడ్డి పోరాడక తప్పదన్నాడు. జొకోవిచ్ కూడా ఇలాంటి కోవకే చెందుతాడని ఈ స్విస్ దిగ్గజం అభిప్రాయపడ్డాడు. మరోవైపు పురుషుల ర్యాంకింగ్స్‌లో మూడో ర్యాంక్‌కు చేరుకోవడం ఆనందంగా ఉందన్నాడు.




పతనం అంచున శ్రీలంక క్రికెట్

● లంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ

కొలంబో: శ్రీలంక క్రికెట్ బోర్డుపై ఆ దేశ మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. బోర్డు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల శ్రీలంక క్రికెట్ పతనఅవస్థకు చేరుకుందని రణతుంగ ఆరోపించాడు. దీనికి బాధ్యుడైన బోర్డు అధ్యక్షుడు తిలంగ సుమతిపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని లంక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శ్రీలంక క్రికెట్ జట్టు పరిస్థితి రోజురోజుకు మరింత దిగజారుతుందన్నాడు. భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో జట్టు ప్రదర్శన చాలా చెత్తగా ఉందన్నాడు. జట్టు బలహీనంగా మారి చాలా రోజులైనా దాన్ని బలోపేతం చేయడంలో బోర్డు ఘోరంగా విఫలమైందన్నాడు. జట్టుపై శ్రీలంక బోర్డుకు ఏమాత్రం శ్రద్ధ లేదన్నాడు. బోర్డు వైఖరి వల్ల శ్రీలంక క్రికెట్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఇటువంటి పరిస్థితే ఉంటే రానున్న రోజుల్లో శ్రీలంక జింబాబ్వే కంటే కూడా బలహీనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. ఇటీవల కాలంలో శ్రీలంక జట్టు ఆట తీరు చాలా దారుణంగా ఉందన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశలోనే జట్టు వైదొలిగిందన్నాడు. అంతేగాక, సొంతగడ్డపై జింబాబ్వే చేతిలో అవమానకర రీతిలో పరాజయం పాలైందన్నాడు. కాగా, శ్రీలంక బోర్డులో అవినీతి. అక్రమాలు రాజ్యమేలుతున్నాయని, దీనిపై విచారణ చేపట్టాలని రణతుంగ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి)కి విజ్ఞప్తి చేశాడు. కాగా, శ్రీలంక క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బోర్డులో ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశాడు.





బెంగళూరు బుల్స్ జయభేరి

నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 31–21 తేడాతో బెంగాల్ వారియర్స్ జట్టును చిత్తు చేసింది. తనకంటే ఎంతో బలమైన జట్టుగా బరిలోకి దిగిన బెంగాల్‌ను బుల్స్ హడలెత్తించింది. ప్రారంభంలో రెండు జట్లు కూడా హోరాహోరీగా పోరాడాయి. అయితే మ్యాచ్ సాగుతున్న కొద్ది బుల్స్ పట్టు సాధించింది. చూడచక్కని ఆటతో బెంగాల్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. అజయ్ కుమార్, రోహిత్ కుమార్, ఆశీష్ కుమార్‌లు బెంగళూరు విజయంలో ముఖ్య భూమిక పోషించారు. అజయ్ కుమార్ దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థి ఆటగాళ్లను హడలెత్తించాడు. ఈ క్రమంలో అతను 8 పాయింట్లను సొంతం చేసుకున్నాడు. రోహిత్ కూడా మెరుగైన ఆటను ప్రదర్శించాడు. ఆరు పాయింట్లు సాధించి జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. ఆశీష్ కుమార్ కూడా తన మార్క్ ఆటతో ఆకట్టుకున్నాడు. అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆశీష్ ఐదు పాయింట్లు సాధించాడు. బెంగాల్ జట్టులో జంగ్ కున్‌లీ అద్భుతంగా ఆడాడు. బుల్స్‌పై ఎదురు దాడికి దిగిన జంగ్ ఏకంగా 8 పాయింట్లు సాధించాడు. రాన్ సింగ్, సుర్జీత్ సింగ్‌లు తలా నాలుగేసి పాయింట్లను నమోదు చేశారు. కానీ మిగతావారు విఫలం కావడంతో బెంగాల్‌కు ఓటమి తప్ప లేదు. తెలుగు టైటాన్స్‌తో జరిగిన కిందటి మ్యాచ్‌ను బెంగళూరు బుల్స్ టైగా ముగించిన విషయం తెలిసిందే.



బ్యాంక్ లావాదేవీలు ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే..

న్యూఢిల్లీ: దేశంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ పట్ల ఆసక్తి పెరిగిందని, ఎక్కువ మంది మొబైల్ బ్యాంకింగ్ యాప్ లేదా ఆన్‌లైన్ బ్యాంకింగ్ నిర్వహిస్తున్నారని ఓ అధ్యయనంలో తేలింది. ఏవైనా సమస్యలుంటే బ్యాంకు సహాయకులతో మాట్లాడి లావాదేవీలను పూర్తి చేసుకుంటున్నారని వెల్లడించింది. గ్లోబల్ టెక్ సంస్థ 'అవయ' నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. బ్యాంకింగ్‌లో వినియోగదారుడి అనుభవం పేరుతో భారత్, బ్రిటన్, ఆస్ట్రేలియా, యుఎఇ దేశాల్లో 5 వేల మందితో ఈ సర్వే చేపట్టారు. మిగతా మూడు దేశాల కంటే భారత్‌లోనే ఎక్కువ మంది ఆన్‌లైన్ లావాదేవీల వైపు మొగ్గు చూపినట్లు గణాంకాల్లో వెల్లడైంది. బ్యాంకులకు చెందిన వెబ్‌సైట్‌ల నుంచే సేవలను పొందేందుకు 26శాతం మంది వినియోగదారులు ఆసక్తి చూపుతున్నట్లు సర్వే పేర్కొంది. మోసపూరిత లావాదేవీలు, సమస్యల పట్ల 58శాతం మంది, క్రెడిట్ కార్డు రెన్యూవల్ సందర్భంగా అప్రమత్తంగా ఉంటామని 49శాతం మంది వినియోగదారులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత కాలంలో వినియోగదారులు అత్యున్నత సేవలను ఆశిస్తున్నారని, అవి దొరకకపోతే మరోదానిని ఆశ్రయిస్తున్నారని అవయ మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. సులువుగా బ్యాంక్ లావాదేవీలు నిర్వహించేందుకు కస్టమర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని నివేదికలో తేలింది.

మూడో రోజూ నష్టాలు

• మార్కెట్‌పై బ్యాంక్, ఫార్మా స్టాక్స్ పతనం ప్రభావం



న్యూఢిల్లీ: బ్యాంక్, ఫార్మా స్టాక్స్ పతనంతో కీలక బెంచ్ మార్క్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 216 పాయింట్లు పడిపోయింది. ఆఖరికి ఈ సూచీ 31,798 పాయింట్ల వద్ద ముగిసింది. అమెరికా, ఉత్తరకొరియా మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ స్టాక్స్ బలహీనపడ్డాయి. దీంతో ఈ ప్రభావం దేశీయ మార్కెట్ సూచీలపైనా పడింది. నిఫ్టీ కూడా 10 వేల పాయింట్ల దిగువకు చేరి మరింత కిందకు చేరుకుంది.

ఆఖరికి నిఫ్టీ 70.50 పాయింట్లు (0.71 శాతం) పడిపోయి 9,908 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం కూడా సూచీలు నష్టాల దిశగా పయనించడానికి కారణమయ్యాయి. ఫార్మా రంగాల షేర్లు భారీగా కుదేలయ్యాయి. అరబిందో ఫార్మా, సన్‌ఫార్మా షేర్లు భారీగా నష్టపోయాయి. అరబిందో ఫార్మా షేరు విలువ 6 శాతానికి పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇలో హిందాల్కో, ఎన్‌టిపిసి, ఏసియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి షేర్లు స్వల్పంగా లాభపడ్డాయి. మరోవైపు సన్‌ఫార్మా, అదానీ పోర్టన్, సిప్లా, టాటామోటార్స్ షేర్లు నష్టాలను నమోదు చేశాయి.

బలహీనపడిన రూపాయి

కొద్ది రోజులుగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడుతూ వస్తోంది. అయితే బుధవారం ట్రేడింగ్ ప్రారంభ సమయంలో రూపాయి 16 పైసలు బలహీనపడింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్(ఫారిన్ ఎక్స్ఛేంజ్) మార్కెట్‌లో 63.79 దగ్గర ప్రారంభమయ్యింది. ఇతర కరెన్సీలతో అమెరికా డాలరు బలపడిన నేపథ్యంలో దిగుమతిదారులు, బ్యాంకర్ల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో రూపాయి విలువ స్వల్పంగా దిగిపోయింది. దేశీయ స్టాక్ సూచీలు నష్టాల దిశగా పయనించడం ఉండడం కూడా రూపా యి విలువ పతనమవడానికి కారణమైంది. మంగళవారం నాటి ఫారెక్స్ మార్కెట్ ముగింపు సమయానికి డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 63.63 వద్ద ముగిసింది.

నేడు మార్కెట్లోకి ఎస్ఐఎస్

ఐపిఒకు వచ్చిన సెక్యూరిటీ సర్వీసుల్ని అందించే సెక్యూరిటీ, ఇంటిలిజెన్స్ సర్వీసెస్ (ఎస్ఐఎస్) గురువారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయి ట్రేడింగ్‌కు రానుంది. ఎస్ఐఎస్ కంపెనీ ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) 7 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయిన విషయం తెలిసిందే. ఐపిఒలో రూ. 780 కోట్ల సమీకరణకు 53.16 లక్షల షేర్లను కంపెనీ జారీచేస్తోంది. రూ. 805-815 ధర వద్ద ఈ ఇష్యూ జారీ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్స్టూషనల్ బయర్స్ 5.64 రెట్లు , నాన్ ఇన్స్టూషనల్ ఇన్వెస్టర్స్ 1.66 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు 19.51 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

నాలుగేళ్ల కనిష్ఠానికి సన్‌ఫార్మా



దిగ్గజ ఔషధ కంపెనీ సన్‌ఫార్మా షేరు భారీగా పడిపోయింది. అనుబంధ కంపెనీ టారో ఫార్మాస్యూటికల్స్ తొలి త్రైమాసిక ఫలితాల్లో బలహీన ఫలితాలు సన్‌ఫార్మాను దెబ్బతీశాయి. బుధవారం సన్‌ఫార్మా షేరు 4 శాతం 5 శాతానికి పైగా పడిపోయి రూ.474.75 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ షేరు నాలుగేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. టారో ఫార్మాస్యూటికల్స్ ఇండస్ట్రీస్ క్యూ1 ఫలితాల్లో లాభం 5.45 కోట్ల డాలర్లు ఆర్జించగా.. గతేడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం 10. 9 కోట్ల డాలర్లకు చేరింది. నికర అమ్మకాలు 31 శాతం తగ్గి 16.13 కోట్ల డాలర్లకు సాధించింది. అమెరికాలోని జనరిక్ ధరలపై ఒత్తిడి ఎలా ఉందో ఈ ఫలితానే నిదర్శమని టారో తాత్కాలిక సిఇఒ అబే గాంధీ తెలిపారు. తయారీ సంస్థల మధ్య పోటీ, ఎఫ్‌డిఎ అనుమతులు, భవిష్యత్తులో ఔషదాల ధరలపై ఒత్తిడి కొనసాగుతుందని అన్నారు. థామ్సన్ రైటర్స్ గణాంకాల ప్రకారం, టారో సన్ ఫార్మా 73 శాతం వాటాను కల్గి ఉంది. ఫార్మా కౌంటర్లలో అరబిందో, కాడిలా హెల్త్, దివీస్ లేబ్స్, సన్ ఫార్మా, గ్లెన్‌మార్క్, గ్లాక్సో, డాక్టర్ రెడ్డీస్, పిరమల్, లుపిన్, సిప్లా 31 శాతం మధ్య పతనమయ్యాయి. స్టాక్ మార్కెట్ నష్టాల్లో ట్రేడవటంతో ఫార్మారంగం కుదేలవగా, అత్యధికంగా ఫార్మా రంగం 2 శాతం పతనమైంది.



ఆంబీ వ్యాలీ వేలాన్ని ఆపండి

• సుప్రీం కోర్టులో సహారా గ్రూప్ పిటిషన్

న్యూఢిల్లీ: పుణె సమీపంలోని విలాసవంతమైన ఆంబీ వ్యాలీని వేలం వేయకుండా ఆపాలని కోరుతూ సహారా గ్రూప్ బుధవారంనాడు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి రీఫండ్ చేసేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గ్రూప్ తెలియజేసింది. అత్యున్నత న్యాయస్థానం సహారా పిటిషన్‌ను త్వరలో విచారించనుంది. గడువు లోగా చెల్లింపులు చేయకపోవడంతో సహారా ఆంబీ వ్యాలీ ఆస్తులను విక్రయించే ప్రక్రియను ప్రారంభించాలంటూ గత నెలలో సుప్రీంకోర్టు బాంబే హైకోర్టును ఆదేశించింది. సెప్టెంబర్ 7 నాటికి సెబీ వద్ద రూ.1500 కోట్లు డిపాజిట్ చే సహారాను ఆదేశించింది. నగదును రీఫండ్ చేయడంలో సహారా గ్రూప్ ఆలస్యం చేయడం వల్ల సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆంబీ వ్యాలీని వేలం వేసే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించింది. లేకపోతే తదుపరి చర్యలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. 8900 ఎకరాల్లో ఆంబీ వ్యాలీ విస్తరించి ఉంది. ఈ ఆస్తి విలువ రూ.39వేల కోట్లు ఉంటుందని అంచనా. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలుత ఆంబీ వ్యాలీ ప్రాజెక్టును అమ్మాలని కోర్టు ఆదేశించింది. గతనెల జూలై 25న జరిగిన విచారణలో వేలం ప్రక్రియను సహారా తరఫు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. బ్యాలెన్స్ రూ.9000 కోట్లను చెల్లించడానికి 18 నెలల సమయం కోరారు. ఇన్వెస్టర్లకు రూ.24వేల కోట్లు చెల్లించడంలో సహారా గ్రూప్‌కు చెందిన సంస్థలు విఫలమైన కేసులో 2014 మార్చిలో సహారా గ్రూప్ అధినేత సుబ్రతారాయ్ అరెస్టు అయ్యారు.

టాటా మోటార్స్ లాభం 42 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ క్యూ1(ఏప్రిల్-జూన్) ఫలితాల్లో నికర లాభం 41.54 శాతం పెరిగి రూ.3,199.93 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం ఇదే సమయంలో లాభం రూ.2,260.4 కోట్లుగా ఉంది. ఈమేరకు బిఎస్‌ఇ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. అయితే నికర లాభం రూ.1,572 కోట్లుగా ఉంటుందని అంచనా వేయగా, అంతకుమించి కంపెనీ ఫలితాల్లో రాణించింది. కన్సాలిడేటెడ్ మొత్తం ఆదాయం మాత్రం 9.59 శాతం తగ్గుముఖం పట్టింది. ఈ ఆదాయం గతేడాదిలో రూ.663 39.48 కోట్ల నుంచి రూ.59972.33 కోట్లకు పడిపోయింది. సంవత్సరం-సంవత్సరం ఆధారంగా చూస్తే జాగ్వార్, ల్యాండ్ రోవర్ నుంచి మొత్తం 10 శాతం క్షీణించింది. గత సంవత్సరం ఇదే సమయంలో జెఎల్‌ఆర్ మొత్తం ఆదాయం రూ.52, 395.15 కోట్లు ఉంది. కమర్షియల్, ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు(ఎగుమతులతో కలిపి) 1,11,860 యూనిట్లతో 11.8 శాతం డిగ్రోత్ ఉంది. టాటా మోటార్స్ సిఎండి గుంటెర్ బుచెక్ మాట్లాడుతూ, తొలి త్రైమాసిక ఫలితాలు తమ అంచనాలను చేరుకోలేదని, మరింత వృద్ధి దిశగా పనిచేస్తామని అన్నారు. వాణిజ్య, ప్యాసింజర్ వాహనాల వ్యాపారం మెరుగయ్యేందుకు కృషిచేస్తామని అన్నారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై టాటా మోటార్స్ షేరు విలువ 3.24 శాతం పడిపోయి రూ.416.05 వద్ద ముగిసింది.

గోల్డ్ ఆప్షన్‌ను ప్రారంభించేందుకు ఎంసిఎక్స్‌కు సెబీ అనుమతి



ముంబయి : గోల్డ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించేందుకు గాను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఎంసిఎక్స్(ద మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్) అనుమతి పొందిందని సమాచారం. ఒక కిలో స్టాండర్డ్ కాంట్రాక్ట్‌గా గోల్ ఆప్షన్స్ నిర్వహించడానికి ఎంసిఎక్స్‌కు సెబీ అనుమతినిచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ లేదా అక్టోబర్ నుంచి ఎంసిఎక్స్ గోల్డ్ ఆప్షన్స్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఎంసిఎక్స్ ప్రతినిధి సెబీ ఆమోదం తెలిపిన విషయాన్ని ధ్రువీకరించారు. కమోడిటీ ఆప్షన్స్‌కు సంబంధించిన మార్గదర్శకాలను సెబీ ఈ ఏడాది జూన్ 14న జారీ చేసింది. ప్రయోగాత్మకంగా ఒక్కో ఎక్స్ఛేంజ్‌కు ఒక కమోడిటీని పరిమితం చేసింది. దీంతో ఎంసీఎక్స్ బంగారాన్ని ఎంచుకుంది. ఇక గతంలోని సెబీ నిబంధనల ప్రకారం, ఆప్షన్స్ కాంట్రాక్టులు గడువు ముగిసిన తర్వాత డెలివరీ ద్వారా గానీ, నగదు ద్వారా గానీ సెటిల్ చేసుకోవలసి ఉండేది. తాజాగా నిబంధనలను సెబీ సవరించింది. రవాణా సమస్యలు, అంతర్జాతీయ నియమ నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో గడువు తేదీన ఆప్షన్స్ కాంట్రాక్టులు ఫ్యూచర్స్ కాంట్రాక్టులుగా మార్చివేశారు.

జిఎస్‌టిపై మార్గదర్శకాలు విడుదల చేయాలి

• వాణిజ్య పన్నుల శాఖను ఆదేశించిన సిఎస్



మన తెలంగాణ/ హైదరాబాద్ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) మార్గదర్శకాలను అన్ని ప్రభుత్వ శాఖలకు పంపించాలని వాణిజ్య పన్నుల శాఖను ప్రధాన కార్యదర్శి ఎస్‌పి.సింగ్ ఆదేశించారు. శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి జిఎస్‌టిపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాలలో జిఎస్‌టి అమలుపై అధ్యయనం చేయాలని ఎస్‌పి.సింగ్ సూచించారు. సచివాలయంలో బుధవారం జిఎస్‌టిపై అవగాహన, అభివృద్ధి పనులపై పడే ప్రభావంపై పలు శాఖల అధికారులతో ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై 12 శాతం చొప్పున జిఎస్‌టి విధిస్తున్నారని, అంతకు ముందు 5 శాతం మాత్రమే వ్యాట్ విధించేవారని ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టర్లు నష్టపోకుండా ఉండేందుకు 5 శాతం అదనంగా చెల్లించేందుకు వీలుగా అంతర్గత ఉత్తర్వులు ఇప్పటికే జారీ అయ్యాయని తెలిపారు. మిగతా రెండు శాతం ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐసిటి) ద్వారా కాంట్రాక్టర్లకు సమకూరనున్నదని వివరించారు. ఇప్పటి నుంచి టెండర్లు పిలిచే పనులకు 12 శాతం చొప్పున జిఎస్‌టి ఉంటుందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని టెండర్ నిబంధనలు సడలించాలన్నారు. జిఎస్‌టి, వ్యాట్‌కు మధ్యనున్న వ్యత్యాసం తెలుసుకునేందుకు అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పనులు జరుగుతున్నాయని, జిఎస్‌టి ప్రభావాన్ని అంచనా వేయడమే కాకుండా నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ శాఖలు కొనసాగుతున్న పనులపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్ జిఎస్‌టిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కొత్త విధానం మూలంగా ద్రవ్యోల్బణం తగ్గుతుందని, పన్నుల విధానం సరళంగా ఉంటుందన్నారు. ఏ శాఖపై ఎంత మేర ప్రభావం ఉంటుందనేది ఆయన వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె.జోషి, సురేష్ చందా, చిత్రా రామచంద్రన్, బిపి.ఆచార్య, బిఆర్.మీనా, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న వారు జిఎస్‌టిపై అవగాహన పెంచుకోవాలని పర్యాటక శాఖ కమిషనర్ సునీత ఎం.భగవత్ కోరారు. కేంద్ర పర్యాటక శాఖ సహకారంతో పర్యాటక శాఖ ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న వారి కోసం జిఎస్‌టిపై నగరంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ పవన్ కుమార్ రెడ్డి, నర్సింహమూర్తి, శివ శివానీ ఇన్‌స్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్ ప్రసాద్‌లు జిఎస్‌టి గురించి వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సహ సంచాలకులు శంకర్‌రెడ్డితో పాటు పర్యాటక రంగానికి చెందిన 85 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

అసంఘటితరంగ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే వివిఫి రుణాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : అసంఘటిత రంగంలోని ఉద్యోగులకు ఆన్‌లైన్లోనే రుణాలను మంజూరు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ వివిఫి ఇండియా ముందుకు వచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం అనిల్ కుమార్ పినపాల, శ్రీధర్ కొంపెల్లతో కలిసి ఎస్‌బిఐ, ఐడిఆర్‌బిటి మాజీ ఛైర్మన్ పాట్రిక్ కిశోర్ వివిఫి ఇండియా యాప్ ఫ్లెక్స్‌శాలరీని ఆవిష్కరించారు. స్వల్పకాలిక నగదు అవసరాలకు ఇబ్బంది పడే వారిని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టేక్కించేందుకు ఈ రుణాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ స్వీయ నిధులతో కార్యకలాపాలను నిర్వహిస్తున్నప్పటికీ రూ.100 కోట్ల నిధులను లెండింగ్ క్యాపిటల్‌గా ఫండ్ రైజ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. రుణాలు పొందగోరే వారు వివరాలకు flexsalary.comలో సంప్రదించవచ్చన్నారు.

మేము డొల్ల కంపెనీలమా..?

• శాట్‌ను ఆశ్రయించిన పలు కంపెనీలు

న్యూఢిల్లీ : డొల్ల కంపెనీలు(షెల్)గా తమ సంస్థలపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ముద్ర వేయడాన్ని జె కుమార్ ఇన్‌ఫ్రా, పర్శ్వనాథ్, ఇతర కంపెనీలు ఖండించాయి. సెబీకి వ్యతిరేకంగా ఈ కంపెనీలు శాట్(సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యునల్)ను ఆశ్రయించాయి. అయితే ఈ కంపెనీలను డొల్ల కంపెనీలుగా పేర్కొనడాన్ని సెబీ సమర్థించుకుంది. డొల్ల కంపెనీలుగా అనుమానిస్తూ 331 కంపెనీలపై ట్రేడింగ్ పరంగా పరిమితులు విధించాలని స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం నాడు సెబీ ఆదేశించింది. డొల్ల కంపెనీల జాబితాలో పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్‌క్యూఎస్ ఇండియా, జే కుమార్ ఇన్‌ఫ్రా, ప్రకాశ్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద కంపెనీలు చోటు చేసుకోవడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సంస్థలూ అప్పీలేట్‌లో తమకు వ్యతిరేకంగా సవాల్ చేయడంతో సెబీ వారి చర్యలను ఖండించింది. డొల్ల ముద్ర పడిన ఈ కంపెనీలకు నెలలో ఒక రోజు మాత్రమే షేర్ల ట్రేడింగ్‌కు అనుమతిస్తారు. అనుమానిత డొల్ల కంపెనీల జాబితాలో తమ సంస్థ పేరుండటం దిగ్భ్రాంతికి గురిచేసిందని పలు కంపెనీలు పేర్కొన్నాయి. సెబీ చర్యతో ఈ కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జిఎస్ఎం6 విభాగంలోకి మారతాయి. అయితే ఎక్స్ఛేంజ్‌లలో కంపెనీల నమోదులో తమ కంపెనీ ట్రాక్ రికార్డు బాగుందని జే కుమార్ సంస్థ వ్యాఖ్యానించింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కాగా మంగళవారం దాదాపు 331 షెల్ కంపెనీల్లో ట్రేడింగ్‌ను నిలుపుదల చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను ఆదేశించిన సెబీ.. ట్రేడింగ్‌లో జిఎస్ఎం (గ్రేడెడ్ సర్వైలెన్స్ మీసర్) స్టేజ్ 6 తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఆరో స్టేట్ కింద షెల్ కంపెనీల్లో ట్రేడింగ్‌ను నెలలో ఒక్కసారి మాత్రమే పరిమితం చేస్తారు. అనుమానాస్పద కంపెనీలుగా భావించిన ఈ కంపెనీలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిశీలించిన అనంతరం సెబీ ఈ చర్యలు చేపట్టింది. వీటిపై ఆడిట్ నిర్వహించాలని, అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించాలని సూచించింది.

జిఎస్‌టితో వచ్చే 6 నెలల్లో జిడిపి వృద్ధి

న్యూఢిల్లీ: జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమల్లోకి రావడంతో వచ్చే ఆరు నెలల్లో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో గణనీయమైన పెరుగుదల నమోదవనుందని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆది గోద్రేజ్ వ్యాఖ్యానించారు. కొత్త పన్ను వ్యవస్థలో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. అయితే దేశీయ వృద్ధి రేటును పెంచడంలో జిఎస్‌టి మంచి బూస్ట్‌ను అందిస్తుందని అన్నారు. జిఎస్‌టిని ప్రవేశపెట్టేందుకు సరికొత్త పంథాను ప్రభుత్వ అనుసరించిందని, ఇది గొప్ప విజయానికి దారితీస్తుందని అన్నారు. వచ్చే ఆరు నెలల కాలంలో ఈ చట్టం ఫలితాలు కనిపిస్తాయని, వృద్ధి దిశగా పనులు కనిపిస్తాయని గోద్రేజ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31797.84	-216.35	0.68%
నిఫ్టీ	9908.05	-70.50	0.71%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27180	29069.52	0.04%
ముంబై	27180	29069.52	0.04%
ఢిల్లీ	27180	29069.52	0.04%
కోల్‌కతా	27180	29069.52	0.04%
కేరళ	27180	29069.52	0.04%
బెంగళూరు	27180	29069.52	0.04%
హైదరాబాద్	27180	29069.52	0.04%
గల్ఫ్	27180	29069.52	0.04%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	40600.00	40000.00	1.50
ముంబై	40600.00	40000.00	1.50
ఢిల్లీ	40600.00	40000.00	1.50
కోల్‌కత్తా	40600.00	40000.00	1.50
హైదరాబాద్	40600.00	40000.00	1.50



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	321	విశాఖపట్నం	330
వరంగల్	320	చిత్తూరు	365
విజయవాడ	323	చెన్నై	372
గోదావరి	323	బెంగళూరు	360

గిరిజనుల ఆత్మహత్యలపై విచారణ : పినరయి విజయన్



తిరువనంతపురం: 2012 నుంచి పాలోడ్ ప్రాంతానికి సమీపంలో చోటుచేసుకున్న 45 మంది గిరిజనుల ఆత్మహత్యల ఘటనలపై సీరియస్‌గా దృష్టిసారించినట్టు కేరళ ప్రభుత్వం పేర్కొంది. గిరిజనుల ఆత్మహత్యలకు వెనక గల కారణాలపై ప్రభుత్వం విచారించనున్నట్టు తెలిపింది. బుధవారం కేరళ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తిన ప్రశ్నకు బదులుగా రాష్ట్ర సిఎం పినరయి పైవిధంగా సమాధానమిచ్చారు. 2012నుంచి 2017 మధ్య గిరిజనల ఆత్మహత్యల సమస్యపై మాజీ మంత్రి ఎపి అనిల్ కుమార్ (కాంగ్రెస్) శాసనసభలో లేవనెత్తారు. ఈ సంధర్భంగా అనిల్ మాట్లాడుతూ.. 43 మంది గిరిజనులు ఊరేసుకోగా, ఒకరు విషం తాగి చనిపోయారని, మరోకరు కాలిన గాయాలతో మృతిచెందారని చెప్పారు. గతవారం ఓ మహిళ ఆత్మహత్యపై విచారణ చేపట్టడంతో గిరిజనుల ఆత్మహత్యలకు సంబంధించి ఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు. దేశంలో ఆన్‌లైన్ 'బ్లూవేల్' గేమ్‌పై నిషేధం విధించాలని కేంద్రాన్ని కోరతామని తెలిపారు. ఈ గేమ్ ప్రపంచ వ్యాప్తంగా అధిక సంఖ్యలో చిన్న పిల్లల ఆత్మహత్యలను ప్రోత్సహిస్తోందన్నారు. ఇందుకు సంబంధించి తల్లిదండ్రులకు అప్రమత్తం చేయాలని రాష్ట్ర పోలీసులకు తగిన సూచనలు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆటకు అధిక సంఖ్యలో పిల్లలు, యువకులు వ్యసన పరులవుతున్నారని పేర్కొన్నారు.





బుధవారంనాడు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోడీ

ఘన సంకల్పాలు.. భయ సందేహాలు

● ఐదేళ్లలో దేశాన్ని మారుద్దాం : ప్రధాని మోడీ ● ప్రజాస్వామ్య మూలాల ధ్వంసానికి చీకటి శక్తుల యత్నాలు : సోనియా

న్యూఢిల్లీ : అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత అనేవి దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లని లోక్‌సభలో ప్రధాని మోడీ అన్నారు. ఈ సమస్యలను రూపుమాపేందుకు రానున్న ఐదేళ్లలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా దేశంలో మార్పుకు 'కరేంగే ఔర్ కర్ కే రహేంగే (మేం కృషి చేస్తాం, తప్పక కృషి చేస్తూనే ఉంటాం)' అంటూ ప్రతినబూనాలని ఆయన కోరారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా పార్లమెంటు ఉభయసభల బుధవారంనాడు ప్రత్యేక చర్చ చోటు చేసుకుంది. 1942–1947 మధ్యకాలంలో దేశ ప్రజల్లో ఎలాంటి స్ఫూర్తి నిండి ఉన్నదో 2017–2022 మధ్యకాలంలోనూ అలాం టి స్ఫూర్తిని కలిగి ఉండాల్సిన అవసరముందని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు. అవినీతి దేశ అభివృద్ధి ప్రయాణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆయన అవేదన చెందారు. రానున్న ఐదేళ్ల కాలంలో భారతదేశంలో సానుకూల మార్పును తీసుకురావాల్సిన అవసరముందని ఆయన అన్నారు. అలాంటి మార్పు సాకారమైతే మన దేశం ప్రపంచంలోని పలు ఇతర దేశాలకు ఆదర్శమవుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న భారతదేశాన్ని నిర్మించేందుకు విభేదాలను పక్కనపెట్టి సమిష్టిగా కృషి చేయాలని ఆయన ఎంపిలందరికీ విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ ఇచ్చిన 'డు ఆర్ డై' పిలుపుకు ప్రేరణ పొంది క్విట్ ఇండియా ఉద్యమంలో లక్షలాది మంది పాల్గొన్నారన్న విషయాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మోడీ తన 30 నిమిషాల ప్రసంగంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్, లాల్ బహదూర్ శాస్త్రి, జై ప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, చంద్రశేఖర్ ఆజాద్, రాజ్ గురు లాంటి మహానుభావుల సేవలను స్మరించుకున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్‌పై సోనియా విమర్శలు

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా మాట్లాడుతూ... కొన్ని సంస్థలు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాయని, స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్రను పోషించలేదని పరోక్షంగా ఆర్‌ఎస్‌ఎస్‌ని విమర్శించారు. ప్రజాస్వామ్య మూలాలను ధ్వంసం చేయడానికి అంధకార శక్తులు ప్రయత్నిస్తున్నాయా? అంటూ ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక, ప్రజాస్వామ్య, స్వతంత్ర విలువలు ప్రమాదంలో పడినట్లు తెలుస్తోందని ఆమె అన్నారు. తమ పార్టీతో పాటు ఆర్‌ఎస్‌ఎస్‌పై సోనియా చేస్తున్న పరోక్ష విమర్శలను ప్రధాని మోడీ మౌనంగా ఆలకించడం గమనార్హం. అయితే బిజెపి ఎంపి కిరణ్ ఖేర్ మాత్రం ఆమె వ్యాఖ్యలపై కలగజేసుకుని అబద్ధం, అబద్ధం అంటూ గట్టిగా అన్నారు. పాలకపక్ష సభ్యుల సూచనల మేరకు ఆయన శాంతించారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో లాగా భారతదేశ ప్రజలను ఐక్యం చేయడానికి ప్రస్తుతం ఒక ప్రయత్నం చేయాల్సిన అవసరముందని స్పీకర్ సుమిత్రా మహాజన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన స్వాతంత్ర్య సమర యోధులు అప్పట్లో భారత్ చోడో (క్విట్ ఇండియా) అంటూ నినదించారు. ప్రస్తుతం మనకి భారత్ జోడో (భారత్‌ని కలుపు) ఉద్యమం అవసరమని ఆమె అన్నారు.

పటిష్ట భారత్ నిర్మాణానికి తీర్మానం

రాజ్యసభలోనూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని సభ్యులు ప్రదర్శించారు. పటిష్టమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన, లౌకికవాద, ప్రజాస్వామిక భారతదేశ నిర్మాణానికి సభ్యులు ప్రతినబూనారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ సభాధ్యక్షుడు హమీద్ అన్సారీ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. స్వాతంత్ర్యోద్యమ విలువలు, విశిష్టతలను కాపాడుతామని, నవ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామంటూ సభ్యులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ...దేశ భద్రత పరంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం భారత సైన్యానికి ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సిక్కిం వద్ద చైనాతో సైనిక ప్రతిష్టంభన నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఆయన ఇలా చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 1962లో చైనాతో జరిగిన యుద్ధం నుండి గుణపాఠం నేర్చుకున్నామని ఆయన అన్నారు. అంతేకాక 1948 నుండి పాకిస్తాన్ ఆక్రమించుకున్న జమ్ము–కశ్మీర్‌లోని ప్రాంతాలను భారత్ తిరిగి దక్కించుకోవాలన్న ఆకాంక్ష దేశ ప్రజల్లో బలంగా ఉందని కూడా ఆయన చెప్పారు

కూర్చుంటే కాదు.. కదిలితేనే కలెక్టర్లు : మోడీ

ఫైళ్లకే అతుక్కుపోకుండా కలెక్టర్లు గ్రామాలకు తరలివెళ్లాలని, వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు నిచ్చారు. బుధవారం ప్రధాని మోడీ దేశ వ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పరిస్థితులను, సామాన్య సాధకబాధకాలను తెలుసుకోవడానికి కలెక్టర్లు కృషి చేయాలని కోరారు. కార్యాలయాలకే పరిమితం అయితే నిజాలు పూర్తి స్థాయిలో వెల్లడి కావని మోడీ తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలు ఏ విధంగా ఉన్నాయి? సగటు ప్రజలకు అవి అందుతున్నాయా? అనేది తెలుసుకోవల్సి ఉందన్నారు. నవ భారతం ఓ ఆలోచన పేరిట కలెక్టర్లతో ప్రధాని ఈ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. క్షేత్రస్థాయిలో వెళ్లిన వారే సరైన రీతిలో విధులు నిర్వర్తించగలరని , ప్రభుత్వం చేపట్టే పలు పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో తరువాత అవి సరిగ్గా అమలు కావడంలో జిల్లా అధికారులుగా కలెక్టర్లపైనే గురుతర బాధ్యత ఉంటుందని స్పష్టం చేశారు.


వేర్వేరు ప్రమాదాల్లో 14మంది మృతి

జమ్ము : జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. రియాసి జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ వాహనం అదుపుతప్పి 200 ఫీట్ల లోతులో ఉన్న లోయలో పడింది. ఈ ఘటనలో 9 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం జిల్లాలోని మహోర్ బెల్ట్‌లో ఉన్న చేచి నల్లా ప్రాంతంలో టెంపో అదుపు తప్పి లోయలో పడిపోయిందని రియాసి సీనియర్ ఎస్‌పి తహీ సజద్ భట్ మీడియాకు వెల్లడించారు. ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని, లోయలో నుంచి మృతదేహాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోనూ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అతివేగంగా వచ్చిన ఓ ట్రక్కు కారును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో చిన్నారి, మహిళ సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డట్లు పోలీసులు పేర్కొన్నారు. మరో ఇద్దరు కూడా గాయపడ్డారన్నారు.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు హతం

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతోంది. బుధవారం దక్షిణ కశ్మీర్ పుల్వామా జిల్లాలో భద్రతా దళాలు, తీవ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు తీవ్రవాదులు హతమైనట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలి నుంచి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఓ పోలీసు అధికారి చెప్పారు. మృతి చెందిన తీవ్రవాదులు ఎవరు, ఏ తీవ్రవాద సంస్థకు చెందిన వారనేది గుర్తించాల్సి ఉందన్నారు. తీవ్రవాదులు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు పుల్వామా ట్రాల్ ప్రాంతంలో ఉన్న గులాబ్ బాగ్‌ను భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకొని కూంబింగ్ నిర్వహించాయి. ఈ నేపథ్యంలో దళాలకు తారసపడిన మిలిటెంట్లు వారిపై కాల్పులకు దిగారు. అప్రమత్తమైన దళాలు వారి కాల్పులను సమర్థవంతంగా తిప్పికొట్టి ముగ్గురిని మట్టుబెట్టారు.

వేధింపు కేసులో వికాస్ బరాల అరెస్ట్




చండీగఢ్: మహిళా వేధింపు ఆరోపణ కేసులో హర్యానా బిజెపి అధినేత సుభాష్ బరాల కుమారుడు వికాస్ బరాలను, మరో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి మీద ఐఎఎస్ అధికారి కూతురును వేధించడమే కాకుండా, అపహరించేందుకు యత్నించారన్న అభియోగాలు మోపాలని నిర్ణయించుకున్నట్లు చండీగఢ్ డిజిపి తేజిందర్ సింగ్ లూథ్రా విలేకరులకు చెప్పారు. 29 ఏళ్ల మహిళను వేధించారన్న ఆరోపణ కేసులో వికాస్ బరాల(23), మరో నిందితుడు ఆశిష్ కుమార్ మంగళవారం పోలీసుల ముందు హాజరయ్యారు. వారిని పోలీసుల ప్రశ్నించారు. మహిళను వెంటాడుతూ వేధించిన ఆ రూట్‌లోని సిసిటివి ఫుటేజీ సంపాదించామని వెల్లడించారు.

ఎస్‌పికి మరోసారి ఎంఎల్‌సి గుడ్‌బై

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీకి మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన మరో ఎంఎల్‌సి అశోక్ బాజ్‌పాయ్ బుధవారం యుపి శాసనమండలికి రాజీనామా చేశారు. దీంతో మండలికి రాజీనామా చేసిన ఎస్‌పి సభ్యుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇంతకుముందే ముగ్గురు రాజీనామా చేసి బిజెపిలో చేరిన విషయం తెలిసిందే. అదే బాటలో అశోక్ కూడా వెళ్లే అవకాశ ముందని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. అశోక్ తన రాజీనామాను మండలి చైర్మన్‌కు అందజేశారు.ములాయం పట్ల సీనియర్‌లు అవలంభిస్తున్న వైఖరి, ఆయనకు పార్టీలో జరుగుతున్న అవమానంపై కలతచెందానన్నారు.

డోక్లామ్ వివాదం తీవ్రమైంది కాదు



న్యూఢిల్లీ: భారత్, చైనాల మధ్య నెలకొన్న డోక్లామ్ వివాదం అంత తీవ్రమైందేమీ కాదని బౌద్ధ మత గురువు దలైలామా అన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. 1950లో ఇండో చైనా ఒప్పందం సందర్భంగా ఇచ్చిన 'హిందీ చీనీ భాయీ భాయీ' నినాదం స్ఫూర్తితో ఒకరి పక్కన మరొకరు శాంతియుతంగా జీవించాలని అభిలషించారు. చర్చలు 21వ శతాబ్దం నినాదంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాజేంద్ర మథూర్ మెమోరియల్ లెక్చర్‌లో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గం అన్నారు. ఒక వైపు గెలుపు, మరో వైపు ఓటమి అనేది పాతకాలపు ఆలోచనా విధానమన్నారు. ఆధునిక కాలంలో ప్రతి దేశం మరో దేశంపై పరస్పరం ఆధారపడి ఉన్నాయన్నారు. తనను తాను భారతదేశ శిష్యుడుగా దలైలామా పేర్కొన్నారు.

పాక్, చైనా ఆయుధాలు స్వాధీనం

శ్రీనగర్: ఆగస్టు 7న జరిగిన మాచిల్ ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదుల నుంచి పాకిస్థాన్, చైనా గుర్తులున్న ఆయుధాలు, ఆహార సామాగ్రి, ఔషధాలు లభ్యమైనట్లు భారత్ సైన్యం తెలిపింది. ఎన్‌కౌంటర్ వివరాలను బ్రిగేడ్ కమాండర్ ఆర్.కె. సురేశ్ బుధవారం విలేకరులకు వివరించారు. 'దట్టమైన అడవులను ఆసరా చేసుకుని ఐదుగురు చొరబాటుదారులు భారత్ భూభాగంలోకి ప్రవేశించారు. దాంతో వారిని ఏరివేసే చర్యలను భద్రతా బలగాలు చేపట్టాయి' అని ఆయన చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి చైనా, పాకిస్థాన్‌లో తయారైన హ్యాండ్ గ్రెనేడ్లు సహా పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి, పాకిస్థాన్ గుర్తులున్న పాల ప్యాకెట్లు సహా ఆహార పదార్థాలు లభ్యమయ్యాయి.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు నిర్ధారణ యంత్రాలు : ఇసి

న్యూఢిల్లీ : ఓటు నిర్ధారణకు సంబంధించిన వివిపిఎటి యంత్రాల అనుసంధాన ఇవిఎంలనే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో వినియోగించేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది. సుప్రీంకోర్టులో దాఖలు అయిన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా ఇసి బుధవారం ఈ అంశాన్ని నివేదించింది. గుజరాత్ ఎన్నికలకు ఇవిఎంలను ఈ యంత్రాల అనుసంధానంతోనే వాడాలని ఈ మేరకు తగు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ దాఖలు అయింది. దీనిపై ఇసి నుంచి అందిన సంసిద్ధతను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సిజెఐ ఖేహర్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది.

ఐదుగురు మావోయిస్టులు అరెస్ట్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో ఐదుగురు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం బస్తర్ పరిధిలోని బీజాపూర్ జిల్లాలో నలుగురు మావోయిస్టులు, నారాయణపూర్ జిల్లాలో మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారిని మంగ్లూ హెమ్లా(35), రాజు టాటి (28), రాము హెమ్లా (30), హెమ్లా బుధు (35) కిందిస్థాయి కేడర్‌కు చెందిన మావోయిస్టులుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నారాయణపూర్‌లోని కల్మానార్‌లో జరిపిన మరో ఆపరేషన్‌లో మావోయిస్టు బుధ్రు మాండవి(23)ని అరెస్ట్ చేశామన్నారు.

ఉత్కంఠ పోరులో అహ్మద్ పటేల్ విజయం



అహ్మదాబాద్ /న్యూఢిల్లీ : ఉత్కంఠభరితంగా సాగిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ఎట్టకేలకు విజయం సాధించారు. ఆయన గెలుపుతో కాంగ్రెస్ వర్గాలు సంబరాలు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది ఆఖర్లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన విజయం పార్టీలో కొత్త ఉత్సాహాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపినట్లయింది. నిబంధనలను ఉల్లంఘించారంటూ ఇద్దరు కాంగ్రెస్ అసమ్మతి ఎంఎల్ఎల ఓట్లను చెల్లనివిగా ఎన్నికల సంఘం (ఇసి) ప్రకటించడంతో ఆయన గెలుపుకు అవసరమైన ఓట్ల సంఖ్య 45 నుండి 44కి తగ్గింది. దీంతో 44 ఓట్లు దక్కించుకోవడం ద్వారా కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీకి రాజకీయ కార్యదర్శి అయిన పటేల్ తన ప్రత్యర్థి బల్వంత్‌సిన్హ రాజ్‌పుత్‌పై విజయం సాధించారు. రాజ్‌పుత్‌కు 38 ఓట్లు వచ్చాయి. గెలుపు అనంతరం అహ్మద్ మాట్లాడుతూ.. 'ఇది నా విజయం మాత్రమే కాదు. ఇది విపరీతమైన అంగబలం, అర్థబలం, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ దుర్వినియోగం మూటగట్టుకున్న పరాజయం కూడా' అని ఆయన వ్యాఖ్యానించారు. తాజా గెలుపుతో ఆయన ఐదోసారి పెద్దల సభలో అడుగుపెడుతున్నారు. ఇలాంటి క్లిష్టమైన ఎన్నికల్లో తనకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. బిజెపి తరపున పోటీ చేసిన ఆ పార్టీ చీఫ్ అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తేలికగానే తమ తమ ప్రత్యర్థులపై గెలుపొందారు. వారికి ఒక్కొక్కరికి 46 ఓట్ల చొప్పున వచ్చాయని ఇసి అధికారి ఒకరు తెలిపారు. వారిద్దరికీ ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. తమ పార్టీకి మద్దతిచ్చిన ఇద్దరు కాంగ్రెస్ అసమ్మతి ఎంఎల్ఎల ఓట్లు చెల్లవంటూ ఇసి తీసుకున్న నిర్ణయాన్ని తాము న్యాయబద్ధంగా సవాలు చేస్తామని గుజరాత్ సిఎం విజయ్ రుపానీ ఈ సందర్భంగా వెల్లడించారు.

అహ్మద్ పటేల్‌కు శరద్ యాదవ్ అభినందన

రాజ్యసభ ఎన్నికలలో గుజరాత్ నుంచి విజయం సాధించినందుకు అహ్మద్ పటేల్‌కు జెడియూ సీనియర్ నేత శరద్ యాదవ్ అభినందనలు తెలిపారు. పలు కటుతర అడ్డంకులను ఎదుర్కొని విజయం సాధించినందుకు సంతోషంగా ఉందని, రాజకీయ జీవితంలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నట్లు యాదవ్ స్పందించారు. ఉత్కంఠ కల్గించిన ఎన్నికలలో పటేల్ గెలుపును అభినందిస్తూ శరద్ యాదవ్ వ్యాఖ్యానించడం కీలకంగా మారింది. అహ్మద్ పటేల్‌తో తాను కలిసి దిగి ఉన్న ఫోటోను కూడా శరద్ యాదవ్ తమ బ్లాగ్‌లో ఉంచారు. తనకు అభినందనలు తెలిపిన శరద్‌యాదవ్‌కు పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.గుజరాత్‌లో ఏకైక జెడియూ ఎమ్మెల్యే నుంచి కూడా తనకు మద్దతు దక్కినందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

నేరెళ్ల బాధితుల వద్దకు వైద్యులను పంపండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇసుక రవాణాను నిలదీసిన పాపానికి పోలీసులచేతులలో తీవ్రంగా చావు దెబ్బలు తిని ఆస్పత్రిపాలైన నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామస్తులు ఆరుగురి బాధితుల దగ్గరకు వైద్యులను పంపాలని హైకోర్టు తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది. బాధితులు ఆరుగురు వేములవాడ మనోరమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి చెందిన ఇద్దరు సీనియర్ డాక్టర్లను పంపాలని బుధవారం హైకోర్టు ఆదేశాలిచ్చింది. బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారి శరీరాలపై ఉన్న గాయాల తీవ్రత తెలపాలని, వైద్యులు లిఖితపూర్వక నివేదిక ఇవ్వాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన దళితులపై పోలీసుల దాడిపై సీబీఐ దర్యాప్తు చేయాలని, నిమ్స్‌లో బాధితులకు వైద్యం చేసేలా ఆదేశాలివ్వాలంటూ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. గాయాల తీవ్రతను బట్టి చికిత్స అవసరమని భావిస్తే, వారిని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. విచారణ 16కి వాయిదా పడింది. బాధితుల సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని కేసును అత్యవసరంగా విచారించాలని న్యాయవాది వి.రఘునాథ్ కోరారు. 'తంగళ్లపల్లి వాగు నుంచి ఇసుకను రోజూ రాత్రీపగలని లేకుండా 200 లారీల్లో నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాల మీదుగా తరలించడాన్ని దళితులు ప్రశ్నిస్తే పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆయన చెప్పారు. లారీల అతి వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గత నెల 2న రోడ్డు ప్రమాదంలో నేరెళ్ల గ్రామస్తుడొకరు మరణిస్తే మూడు గ్రామాల ప్రజలు ఆందోళన చేశారని తెలిపారు. మృతదేహానికి అంత్యక్రియలు జరిగాక మఫ్టీలో 50మందికిపైగా పోలీసులు గ్రామాల్లోకి చొరబడి 8 మందిని బలవంతంగా లాక్కెళ్లి విచక్షణారహితంగా కొట్టారని చెప్పారు. మర్మాంగాలకు కరెంట్ షాక్ ఇచ్చారని, రబ్బరు స్టిక్స్‌తో చితకబాదారని, సాక్షాత్తు జిల్లా ఎస్పీ విశ్వజీత్ స్వయంగా బాధితులను కొట్టించారని న్యాయవాది చెప్పారు. బాధితుల ఆచూకీ కోసం మూడు గ్రామాల వాళ్లు ఆందోళన చేస్తే చివరికి పోలీసులు వారిని కోర్టులో హాజరుపరిచారని, కోర్టు కూడా టెక్నికల్‌గానే వారిని రిమాండ్‌కు ఆదేశించారని, కానీ జైలు సూపరింటెండెంట్ బాధితుల గాయాల తాలుకు సర్టిఫికేట్ చూపితేనే వారిని జైల్లోకి అనుమతిస్తానని చెప్పారన్నారు. సర్టిఫికెట్ ఇచ్చాకే జైలులోకి అనుమతి ఇచ్చారని వివరించారు. ఆ తర్వాత కోర్టు షరతులతో బెయిల్ ఇచ్చిందని న్యాయవాది రఘునాథ్ తెలిపారు. కింది కోర్టు వారికి బెయిల్ ఇచ్చిందని, పిటిషనర్ తీవ్ర ఆరోపణల నేపథ్యంలో వారికి వరంగల్‌లో వైద్యం చేయిస్తామని తెలంగాణ ఏజీ డి.ప్రకాష్‌రెడ్డి ప్రతివాదన చేశారు. నిమ్స్‌లో వైద్యం చేస్తే బాగుంటుందని బెంచ్ సూచన చేసింది. వైద్య సేవలు అందించడం బాగుంటుందని స్పష్టం చేసింది. ఫోరెన్సిక్ నిపుణులను పంపాలని పిటిషనర్ న్యాయవాది కోరగా ప్రధానంగా వైద్యం అందాలని, ఆ తర్వాత ఇతర విషయాల్లోకి వెళ్ల వచ్చునని బెంచ్ అభిప్రాయపడింది.



హౌసింగ్ సొసైటీ కేసు 17కు వాయిదా

మన తెలంగాణ/ న్యూఢిల్లీ : ఆలిండియా సర్వీసు అధికారులు, ఎంపిలు ఎమ్మెల్యేలు, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ కేసు బుధవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. కేంద్ర అటార్నీ జనరల్ అందుబాటులో లేకపోవడంతో ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 17కు కోర్టు వాయిదా వేసింది. భూకేటాయింపులు జరిగి పది సంవత్సరాలు అయ్యిందని, కోట్ల రూపాయలతో దాన్ని అభివృద్ధి చేశామని సొసైటీ తరుపు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నాడు మార్కెట్ ధర ప్రకారమే కేటాయింపులు జరిగా యని న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ విషయాలపై ఈ కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలోని జస్టిస్ చలమే శ్వర్ జోక్యం చేసుకొని తాము వ్యక్తిగత అంశాల్లోకి వెళ్లడం లేదని, ఏ విధానం ప్రకారం కేటాయింపులన్న దానిపై దృష్టిపెట్టామన్నారు.

బిజెపి ఎంపి సన్వర్ లాల్ కన్నుమూత



న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి, బిజెపి ఎంపి సన్వర్ లాల్ జాట్ (62)గుండెపోటుతో బుధవారం ఉదయం ఇక్కడి ఎయిమ్స్‌లో కన్ను మూశారు. ఉదయం 6.15 గంటల ప్రాంతంలో ఆయన కన్ను మూశారని ఆస్పత్రి సీనియర్ అధికారి ఒకరు పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంలో సన్వర్ లాల్ జలవనరుల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. గతనెల జైపూర్‌లో బిజెపి చీఫ్ అమిత్ షా అధ్యక్షతన సమావేశం జరుగుతున్న సమయంలో సన్వర్ లాల్ ఉన్నట్లుండి కుప్పకూలిపోయారు. దాంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆయన్ను అక్కడి సవాయ్ మాన్ సింగ్ హాస్పిటల్‌కు తరలించారు. మరోవైపు సన్వర్ లాల్ మరణం పట్ల ప్రధాని మోడి సంతాపం ప్రకటించారు.'ఎంపి, కేంద్ర మాజీ మంత్రి శ్రీ సన్వర్ లాల్ జాట్ మర ణం నన్నెంతగానో బాధించింది. ఆయన మరణం బిజెపికి, దేశానికి తీరని లోటు. ఆయనకు నా ప్రగాఢ సంతాపం' అని మోడీ ట్వీట్ చేశారు.

ధర్నాచౌక్‌పై వివరణ ఇవ్వండి

రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

మన తెలంగాణ/ హైదరాబాద్ : ధర్నాచౌక్‌లో ధర్నాలు, బహిరంగ సభలకు అనుమతి నిరాకరణపై వివరణ ఇచ్చుకోవాలని హైకోర్టు బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ధర్నాలను అనుమతించకపో వడం చట్ట విరుద్ధమైన చర్యగా ప్రకటించాలని సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి ప్రజా వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, జస్టిస్ జె ఉమాదేవీతో కూడిన ధర్మాసనం స్పందించింది. ఇందిరా పార్క్ వద్ద ధర్నాచౌక్‌లో ప్రజా సమస్యలపై నిరసనలను అడ్డుకోవడం అనుచితం అని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది బి ప్రభాకర్ తమ వాదనలో రాజ్యాంగం మేరకు ప్రజలు తమ నిరసనను ప్రజాస్వామికంగా తెలియచేసుకునే హక్కు ఉందని , దీనిని ప్రభుత్వం అణచి వేస్తోందని తెలిపారు. ధర్మాసనం ప్రశ్నలకు ప్రభుత్వం తరపున ప్రత్యేక న్యా యవాది శరత్‌కుమార్ వాదన విన్పించారు. ఇందిరా పార్క్ నగరం నడిబొ డ్డున ధర్నా చౌక్ ఉండటంతో ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతోందని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం కలుగచేసుకుని అధికార పార్టీ గతంలో నిరసనలకు ఈ ప్రాంతా న్ని వినియోగించుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది.

'బిజెపి క్విట్ ఇండియా' ఉద్యమం

మెదినిపూర్ (ప.బెంగాల్) : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 'బిజెపి క్విట్ ఇండియా' నినాదంతో ఇతర విపక్ష పార్టీలతో కలిసి పనిచేయనున్నట్లు పశ్చిమ్‌బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం వెల్లడించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. దేశ ప్రజల హక్కులను బిజెపి సర్కార్ హరించివేసిందని ఆమె మండిపడ్డారు. లౌకికవాదానికి ముప్పు పొంచి ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాన్ని విడదీయాలనుకుటోంది. అందుకు మేము అవకాశమివ్వం. 2019 ఎన్నికల్లో, బిజెపి క్విట్ ఇండియా అనేది మా నినాదం. ఇతర పార్టీలతో కలిసి పనిచేస్తాం అన్నారు.



మహిళా విద్యాసంస్థల్లో మహిళలతోనే పోస్టుల భర్తీ

హైదరాబాద్ : బాలికలు, మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన విద్యా సంస్థల్లో పనిచేసే బోధనేతర, బోధనా సిబ్బంది పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీ చేయడానికి హైకోర్టు సూత్రప్రాయంగా అంగీకరించింది. రాజ్యాంగంలోని అధికరణం 15(3) కింద ప్రభుత్వాలకు అధికారం ఉందని, ఇలా చేయడం రాజ్యాంగంలోని అధికరణ 15(4), 16(4)లకు విరుద్ధం కాబోదని న్యాయమూర్తులు నాగార్జునరెడ్డి, శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. విజయకుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఏపీ, విజయలక్ష్మీ వర్సెస్ పంజాబ్ యూనివర్సిటీ వంటి కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులు కూడా అందుకు అనుకూలంగా ఉన్నాయని బెంచ్ గుర్తు చేసింది. మైనారిటీ,సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ గురుకుల బాలికలు, మహిళ విద్యా సంస్థల్లో ఖాళీ పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీకి వీలుగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో 1274పై సింగిల్ జడ్జి స్టే ఆదేశాల్ని బెంచ్ రద్దు చేసింది. జీవో 1274 ప్రకారం పోస్టుల భర్తీ ప్రక్రియ చేయవచ్చునని, అయితే భర్తీ మాత్రం తాము వెలువరించే తీర్పుకు లోబడి ఉండాలని బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మహిళల విద్యా సంస్థల్లో పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీ చేయవచ్చునని తెలంగాణ అడ్వకేట్‌జనరల్ ప్రకాశ్‌రెడ్డి వాదించారు.

జవాన్లపై దూసుకెళ్లిన కారు

ఆరుగురికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం

పారిస్: ఫ్రాన్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. అధిక వేగంతో జవాన్లపై దూసుకెళ్లడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం వాయువ్య పారిస్‌లోని లెవల్లాయిస్ పెరెట్ శివారు ప్రాంతంలో ఉన్న సైనిక శిబిరాలకు సమీపంలో చోటుచేసుకుంది. శిబిరాల నుంచి సైనికులంతా బయటకు వస్తున్న సమయంలో కారు అతివేగంతో జవాన్ల పైకి దూసుకొచ్చింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కారును ఆపకుండా వెళ్లిపోవడం తాను చూశానని పెరెట్ మేయర్ పాట్రిక్ బాల్కెనీ చెప్పారు. సైనికులను లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రమాదమేనని ఆయన అన్నారు. ఈ ఘటనలో గాయపడిన జవాన్లలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు ఫ్రాన్స్ పోలీసులు పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు ప్రమాదానికి కారణమైన ఆ కారును గుర్తించేందుకు తీవ్రంగా గాలిస్తున్నారు. 2015 నవంబర్ నుంచి ఫ్రాన్స్‌లో ప్రత్యేకించి పర్యాటక కేంద్రాలనే లక్ష్యంగా భద్రతా దళాలపై దాడులు జరుగుతుండటంతో రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి నెలకొంది.

ఇరాన్ ఉపాధ్యక్షులుగా ఇద్దరు మహిళలు

నియామకంపై అధ్యక్షుడు హసన్ రౌహానీ ప్రకటన

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ బుధవారం ఇద్దరు మహిళా ఉపాధ్యక్షులను నియమించారు. అధ్యక్ష కార్యాలయంలో మహిళలను స్థానం కల్పించడం లేదంటూ ఇటీవల సంస్కరణవాదుల కూటమి నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ఆ మరుసటి రోజే రౌహానీ తన కార్యాలయంలో ఇద్దరు మహిళల పేర్లను ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ప్రకటన చేశారు. వారిలో ఒకరైన మాసోమ్ ఎబ్టేకర్ మహిళల వ్యవహారాలకు సంబంధించి ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. 1980 యుఎస్ రాయబార కార్యాలయ నిర్బంధం సంక్షోభ సమయంలో దేశాధికా ప్రతినిధిగా ఎబ్టేకర్ అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించారు. రెండో మహిళ లయ జనైదీ లీగల్ వ్యవహారాల శాఖకు ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. మరో మహిళ షాహినో దోక్త్ మౌల్వెర్ది కూడా పౌరుల హక్కుల కోసం ప్రత్యేక సలహాదారులుగా నియమితులయ్యారు. రౌహానీ మునపటి పదవీకాలంలో ముగ్గురు మహిళలు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. ఇప్పటివరకూ చాలా ఉప పదవుల స్థానాలను భర్తీ చేయాల్సి ఉండగా, వాటిలో కూడా మహిళలకే చోటు దక్కుతుందా లేదా అనేదానిపై స్పష్టత లేదు.

పోలీసు కస్టడీలో విక్రమ్‌గౌడ్

మన తెలంగాణ/సిటీబ్యూరో: సుపారీ ఇచ్చి మరీ తనపై కాల్పులు జరిపించుకున్న విక్రమ్‌గౌడ్ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కేసును పూర్తిగా ఛేదించామని ప్రకటించినా ఇందులో మరికొన్ని తెలియని విషయాలు ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో విచారణ కోసం బంజారాహిల్స్ పోలీసులు నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న విక్రమ్‌గౌడ్‌ను బుధవారం ఒకరోజు కస్టడీకి తీసుకున్నారు. ఆయనతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురిని మూడు రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. వారిని కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు న్యాయవాది సమక్షంలో నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. ప్రజల్లో సానుభూతి పెంపొందించుకుని రాబోయే ఎన్నికల్లో గెలవాలన్న ఉద్దేశంతో సుపారీ కుట్రకు పాల్పడి తనపై కాల్పులు జరిపించుకున్న విక్రమ్‌గౌడ్ ఉదంతం తెలిసిందే. అయితే ఈ కేసులో నిందితులు, విక్రమ్ గౌడ్ చెబుతున్న వాదనలు పరస్పరం విరుద్ధంగా ఉండడంతో నిందితులందరినీ తిరిగి పోలీసు కస్టడీకి తీసుకుని విచారించాలని నిర్ణయించారు. ఈ మేరకు నిందితులను తిరిగి విచారిస్తున్నారు. ఈ కేసులో మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి.

ఆదివాసుల దినోత్సవాన్ని విస్మరిస్తున్న కేంద్రం : సీతారాం నాయక్



మన తెలంగాణ/న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని విస్మరిస్తోందని టిఆర్‌ఎస్ ఎంపి సీతారాం నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివా సీల దినోత్సవాన్ని పురస్కరించు కొని ఢిల్లీలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... 1994 లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించిందని అన్నారు.పది సంవత్సరాలు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుతూ, పది సంవత్సరాల తర్వాత ఆదివాసుల అంశంపై సమీక్ష చేయాలన్న ప్రతిపాదనలపై భారతదేశం సైతం సంతకం చేసిందని ఆయన గుర్తుచేశారు. బంజార గోర్ బోలి భాషను కేంద్రం అధికార భాషగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 10 కోట్ల జనాభా ఉన్న ఆదివాసులను కేంద్రం గౌరవించాలని, ఆదివాసుల భాషా అభివృద్ధి కి ఇనిస్టిట్యూట్స్, ఫోక్ కల్చర్ అకాడమీ, విలు విద్య అభివృద్ధి కి ఆర్చ్ అకాడమీ, గిరిజన విద్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కుల సంఘాలు మాత్రమే ఆదివాసుల పండుగను నిర్వహించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకు వచ్చిందని తెలిపారు. విద్య, వికాసం అని గుర్తించి కేవలం ఎస్టీల కోసమే ప్రత్యేకంగా 22 డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేసిన సిఎం కేసీఆర్ కు మా జాతి పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



మన తెలంగాణ/హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఎఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ.యూ ఆర్ట్స్ కళాశాల నుంచి ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా థింసా, గుస్సాడి, కొమ్ము, కోయ, చెంచు నృత్యాలతో ఠాగూరు ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఠాగూరు ఆడిటోరియంలో ఓ.యూ రీసర్చ్‌స్కాలర్ నీలిమ అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సభకు సామాజిక న్యాయ జేఏసి చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్ హాజరై ప్రసంగిస్తూ ఒకే సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన ఆదివాసీలు అభివృద్ధికి దూరంగా నెట్టబడ్డారని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, ఆరోగ్య రంగాలలో వెనుకబడి కనీస హక్కులను పొందలేకపోతున్నారని వివరించారు. సరైన ఆహారం, సరైన గూడు లేక జాతి అంతరించిపోయే ప్రమాదం వచ్చిందన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరమ్ వై.సందీప్ వెంకటరమణ, హెచ్ కె నాగు, మెట్ల పాపయ్య, డా.అనురాధ, డా. రేగ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని దాడి చేస్తాం

● ఉ.కొరియాకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్ ● గువామ్‌పై పొంగ్యాంగ్ దాడి ప్రకటనకు అమెరికా స్పందన



వాషింగ్టన్ : తమపై దాడి చేస్తానంటూ పదే పదే హెచ్చరిస్తున్న ఉత్తరకొరియాకి దీటైన సమాధానమిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం స్పష్టం చేశారు. గువామ్ దీవిలోని అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరాలకు సమీపంలో తమ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేయాలనుకుంటున్నట్లు ఉత్తరకొరియా చేసిన ప్రకటన నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'అమెరికాకు మరిన్ని హెచ్చరికలు చేయకుండా ఉంటే ఉత్తరకొరియాకి మంచిది. లేకుంటే, ప్రపంచం ఇప్పటివరకు కనీవినీ ఎరుగని రీతిలో ఆ దేశం మా కోపావేశాన్ని చవిచూస్తుంది. సాధారణ ప్రకటనతో పాటు అతని(కిమ్ జోంగ్ ఉన్)కి హెచ్చరిక చేస్తున్నాం' అని ట్రంప్ న్యూజెర్సీలోని తన విడిది గృహంలో మంగళవారం విలేకరులతో అన్నారు. ఉత్తరకొరియా అణు సామర్థ్యాలపై పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మరోవైపు ఉత్తరకొరియా తన అణ్వాయుధాల్లో ప్రవేశపెట్టేలా ఒక వార్‌హెడ్‌ను విజయవంతంగా తయారు చేసిందని మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. ఉత్తరకొరియా తన వద్ద ఉన్న మధ్యస్తం నుండి దీర్ఘశ్రేణి సామర్థ్య వ్యూహాత్మక బాలిస్టిక్ రాకెట్ హ్వాసంగ్1తో గువామ్ చుట్టుపక్కల ప్రాంతాలపై దాడికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను క్షుణ్ణంగా పరిశీలిస్తోందని కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కెసిఎన్ఎ) వెల్లడించిన నేపథ్యంలో తాము కూడా దీటైనా సమాధానమిస్తామంటూ ట్రంప్ ప్రకటించడం గమనార్హం. అయితే ఆయన ప్రకటనను విపక్ష డెమొక్రాట్లు విమర్శిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్తరకొరియాను మరింత రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, ఆ దేశం దీర్ఘశ్రేణి క్షిపణి ప్రయోగాలను కొనసాగించేలా చేయడం సరికాదు. దానికి బదులుగా, బిల్ పెర్రీ, శామ్ నన్, జార్జ్ షూల్ట్జ లాంటి సీనియర్ రాజనీతిజ్ఞుల సూచనలను అమెరికా తీసుకుని ఉత్తరకొరియాతో ద్వైపాక్షిక చర్చలు జరపడం ఉత్తమమని సిలికాన్ వ్యాలీకి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత సంతతి అమెరికా పార్లమెంటు సభ్యుడు రో ఖన్నా అభిప్రాయపడ్డారు. సెనేటర్ డయానీ ఫిన్‌స్టెయిన్ కూడా ట్రంప్ ప్రకటనను తప్పుబట్టారు. ఆంక్షలను కఠినతరం చేసి ఉత్తరకొరియాని ఏకాకిని చేయడం ద్వారా అణ్వాయుధాలను ప్రోదిచేసుకోవాలన్న ఆ దేశ ప్రయత్నం నీరుగారిపోదు. ట్రంప్ ప్రస్తుతం చేస్తున్న దుందుడుకు ప్రకటనలు కూడా పరిస్థితిని శాంతింపజేసేలా లేవని ఆమె అన్నారు. మరోవైపు ఉత్తరకొరియాతో చర్చలకు తాము సుముఖంగానే ఉన్నామని అమెరికా హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

సంయమనానికి చైనా వినతి

ఉత్తరకొరియాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలపై చైనా స్పం దించింది. కొరియా ద్వీపకల్పంలో పరిస్థితి జటిలంగానూ, సున్నితంగానూ ఉందని పేర్కొంది. అందువల్ల ఇరు దేశాలు సంయమనం పాటించాలంటూ చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనను విడుదల చేసింది. మాటలు, చేతలతో ద్వీపకల్పంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఉత్తరకొరియాపై ట్రం ప్ చేసిన ప్రకటనపై స్పందించాలని కోరడంతో చైనా విదేశాంగ శాఖ ఈ మేరకు పేర్కొనడం గమనార్హం.

వచ్చే ఎన్నికల వరకు అబ్బాసీనే పిఎం!

పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్



ఇస్లామాబాద్: వచ్చే ఎన్నికల వరకు పాకిస్థాన్ ప్రధానమంత్రిగా షాహిద్ ఖాకన్ అబ్బాసీ కొనసాగుతారని ఆ దేశ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ చెప్పారు. పంజాబ్‌లో బుధవారం అధికార పార్టీ పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పిఎమ్ఎల్ఎన్) సీనియర్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. పిఎం పదవీకాలం ముగిసేవరకు అబ్బాసీనే పాక్ ప్రధానమంత్రిగా కొనసాగుతారని అన్నారు. అబ్బాసీ పిఎమ్ఎల్ఎన్ పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న ప్రముఖుడిగా పేర్కొన్నారు. మంత్రులందరూ నూతన ప్రధాని షాహిద్‌కు అన్నివిధాలుగా సహకరించాలని షరీఫ్ కోరినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పనామా పత్రాల లీకేజీ కేసుతో సంబంధం ఉందనే ఆరోపణల నేపథ్యంలో గతనెల సుప్రీం కోర్టు 67ఏళ్ల షరీఫ్‌పై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో అబ్బాసీ అపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత పిఎమ్ఎల్ఎన్ ప్రభుత్వం పదవీ కాలం వచ్చే ఏడాది జూన్‌తో ముగియనుంది. మరోవైపు పార్టీ అధ్యక్ష పదవిని సోదరుడు షెహబాజ్‌కు కట్టబెట్టాలని షరీఫ్ నిర్ణయించారు.

పాముకాటు అత్యవసర చికిత్సకు నిమ్స్‌లో శిక్షణ

మనతెలంగాణ/హైదరాబాద్: పాము కాటుకు గురైన బాధితులకు అత్యవసర సమయాల్లో చికిత్స అందించేందుకు వైద్యసిబ్బందికి నిమ్స్‌లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. హెల్పింగ్‌హాండ్ ఫౌండేషన్‌కు చెందిన స్వచ్ఛంధ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసన్ ఆఫ్ నిమ్స్ సహకారంతో ఈ నెల 30 నుంచి ప్రతి బుధవారం 20 మంది అత్యవసర సిబ్బందితో పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా యాంటీ వీనమ్ కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా సరికొత్త యాంటీ సిరమ్ వియల్స్ వ్యాక్సిన్‌ను జిల్లా ప్రాంతాల ఆస్పత్రులకు సరఫరా చేస్తుందని ముజ్తబా హసన్ అక్సారీ చెప్పారు.

వైకుంఠ మహాప్రస్థానంకు ఇనిషియేటివ్ అవార్డు



మనతెలంగాణ/హైదరాబాద్: ఫోనిక్స్ గ్రూప్ రూపొందించిన వైకుంఠ మహాప్రస్థానం కార్యక్రమానికి గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మకమైన సిఎంఒ ఆసియా అవార్డులు 2017లో 'స్మార్ట్ సిఎస్ఆర్ ఇనీషియేటివ్' అవార్డును అందుకుంది. లీ మెరిడియన్, సెంటోసా ఐలాండ్, సింగపూర్‌లో ఈ అవార్డుల వేడుక జరిగింది. డైరెక్టర్ నీలేష్ జైన్ ఈ అవార్డును నెడ్ మోడీ, ఎండి, బెర్క్‌షైర్ హాథ్‌వేస్ బెర్కాడియా గ్రూపు నుంచి అందుకున్నారు. స్మార్ట్ సిటీ ఇనీషియేటివ్ అనేది ఆసియాలో అత్యున్నత పురస్కారం కాగా, దీన్ని ఆసియాలోని 40 దేశాలకు చెందిన సిఎస్ఆర్ కార్యక్రమాల్లో ఉన్న కార్పొరేట్ సంస్థలను గుర్తించేందుకు ఈ అవార్డును అందజేస్తారు. అలాగే వైకుంఠ మహాప్రస్థానం అనేది సిఎస్ ఆర్ కార్యక్రమం. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ అభియాన్ స్ఫూర్తితో శ్మశాన వాటికను ఆధునీకరించారు. ఫోనిక్స్ ఫౌండేషన్ ఇలాంటి మరెన్నో కార్యక్రమాలన్నింటిని విజయవంతంగా పూర్తి చేసింది.

నేటితో ముగియనున్న ధ్రువపత్రాల పరిశీలన

మనతెలంగాణ/హైదరాబాద్ : పిజిఇసెట్ ధృవపత్రాల పరిశీలన గురువారంతో ముగియనుంది. ఈ నెల 12వ తేదీ వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ఈ విద్యాసంవత్సరం పిజిఇసెట్‌లో 29,742 మంది అర్హత సాధించగా, గేట్, జిప్యాట్‌లో 2,157 మంది అర్హత పొందారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో మొత్తం 5,978 ఎం.ఇ/ఎం.టెక్ సీట్లు అందుబాటులో ఉండగా, ప్రభుత్వ కళాశాలల్లో 1,116, ప్రైవేట్ కళాశాలల్లో 4,862 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో బిసిలు ప్రత్యేక రాజకీయ పార్టీ పెట్టాలి



మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో బిసిలు రాజకీయ శక్తిగా ఎదగాలని, అందుకోసం ప్రత్యేక రాజకీయ పార్టీ పెట్టాలని జనతాదళ్ జాతీయ అధ్యక్షులు శరద్ యాదవ్ అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన బిసి నాయకులు బుధవారం ఢిల్లీలో శరద్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలని, చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కేంద్రంతో చర్చలు జరపాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బిసి నేతలు శరద్ యాదవ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శరద్ యాదవ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలల్లో బిసిల చైతన్యం బాగా ఉందని, దీనిని రాజకీయ శక్తిగా మార్చాలని శరద్ యాదవ్ కోరారు. బిసి ప్రజలలో కృష్ణయ్యకు మంచి చరిస్మా ఉందని, ఆయన నాయకత్వం పై ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో జరిగిన సామాజిక సమీకరణాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జరగాలన్నారు. బిసిలు రాజకీయ శక్తిగా ఎదగకపోతే బిసిలను ఏ రాజకీయ పార్టీలు గుర్తించవని, భయపడవని, ఉద్యమాలకు లొంగవన్నారు. కేవలం ఓట్లకు మాత్రమే భయపడుతారన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా మీరు ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రయోజనం లేదని కృష్ణయ్యను ఉద్దేశించి అన్నారు. శరద్ యాదవ్‌ను కలిసిన వారిలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, వై.సత్యనారాయణ, మల్లేష్ యాదవ్, వెంకట్, బిక్షపతి, అభిలాష్ యాదవ్, ఆర్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక రాక ఖాయం

అక్టోబర్‌లో ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు ● ఎఐసిసి అధ్యక్షునిగా రాహుల్

మన తెలంగాణ/ హైదరాబాద్ : సోనియాగాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించనున్నారు. అక్టోబర్ నెలలో ఆమె కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి బాధ్యతలను చేపట్టనున్నారు. అదే నెలలో సోనియాగాంధీ నుండి రాహుల్ గాంధీ ఎఐసిసి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. తల్లికి, సోదరునికి తెరవెనుక నుండి చేదోడువాదోడుగా ఉంటూ వస్తున్న ప్రియాంక దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత ఒకరు వెల్లడించారు. వాస్తవానికి ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల సమయంలోనే ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారని భావించారు. నాడు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమ రూపకర్త ప్రశాంత్ కిషోర్ వ్యూహం ప్రకారం ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తే ప్రియాంకను పిసిసి అధ్యక్షురాలు లేదా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని కూడా సూచించారు. ఆమెకు ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాలపై అవగాహన ఉండడం, సోనియా, రాహుల్‌గాంధీ నియోజకవర్గాలైన రాయ్‌బరేలీ, అమేథీలలో ప్రచార వ్యవహారాలు, అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షించడం వంటి అంశాలు కలిసి వస్తాయని కూడా చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ప్రియాంక రాజకీయ రంగ ప్రవేశంపై కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ కూడా సంకేతాలు ఇచ్చారు. ప్రియాంక మాత్రం తెరపైకి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. అయితే, ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఆమె ప్రధాన పాత్ర పోషించారు.

ఇప్పటి వరకు ఉపాధ్యక్షుని బాధ్యతలో ఉన్న తన సోదరుడు రాహుల్‌గాంధీ పూర్తిస్థాయి పార్టీ పగ్గాలను చేపట్టనుండడంతో ఆయనకు అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతో ప్రియాంక రాజకీయాల్లోకి ప్రవేశించబోతున్నారు. కాంగ్రెస్ శ్రేణుల్లో ఎప్పటి నుండో ఈ డిమాండ్ కూడా ఉంది. దేశంలో యువతను ఆకట్టుకున్న ప్రధాని మోడీని ఢీకొనాలంటే కాంగ్రెస్‌కు కూడా యంగ్ టీమ్ అవసరమని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి అటు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతో పాటు, దేశంలో అతి పెద్ద రాష్ట్రాన్ని పాలించిన యువ ముఖ్యమంత్రిగా పేరున్న ఎస్‌పి నేత అఖిలేశ్ యాదవ్ తోడైతే జాతీయ రాజకీయాల్లో కూడా కొత్త ఒరవడిని సృష్టించవచ్చని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఇది తమకు కలిసొచ్చే అంశమని చెబుతున్నారు.

మోత్కుపల్లికి గవర్నర్ పదవి?

వెంకయ్య మాటల్లో ధ్వనించిన ఆశ



మన తెలంగాణ/హైదరాబాద్ : ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికైన ఎం. వెంకయ్యనాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం టిడిపి నేతలు ఎల్. రమణ, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వర్‌రావు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎం. అమరనాథ్ బాబు, బుచ్చిలింగం, రాజునాయక్, కూనవెంకటేష్‌గౌడ్, బొట్లశ్రీనివాస్, తాజుద్దీన్, బిఎన్.రెడ్డి, కలిసారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. వేములవాడ, యాదగిరి గుట్ట ఆలయ ప్రసాదాలను ఆయనకిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య కృతజ్ఞతలు తెలుపుతూ మోత్కుపల్లితో త్వరలో శుభవార్త వింటారు బ్రదర్ అన్నారు. దీంతో అక్కడున్న టిడిపి నేతలు మోత్కుపల్లిని త్వరలోనే గవర్నర్‌గా చూడొచ్చు అని సంభాషించుకున్నారు.

మానవబాంబు దాడి కేసులో నేడు తీర్పు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బేగంపేటలోని పోలీసు కమిషనర్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై ఉగ్రవాదులు జరిపిన మానవబాంబు దాడి కేసులో నాంపల్లి కోర్టు గురువారం తీర్పు వెలు వరించనుంది. ఉగ్రవాదులు దేశంలోనే మొదటి సారిగా జరిపిన మానవబాంబు దాడి కేసులో తీర్పుపై ఉత్కంఠత నెలకింది. ఈ నేపథ్యంలో కోర్టు పరిసర ప్రాంతాలలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ముందు జాగ్రత్త చర్యగా పాతబస్తీతో పాటు సైదాబాద్, మలక్‌పేట్ ప్రాంతాలలో కూడా పోలీసు పికెట్లను వేశారు. అక్టోబర్ 12, 2005 దసరా పండుగ రోజు సాయంత్రం 6 గంటలకు బేగంపేట్‌లోని టాస్క్‌ఫోర్స్ పోలీసు కార్యాలయంపై హర్కతుల్ జిహాద్ అనే ఉగ్రవాద సంస్థ సభ్యుడు బంగ్లాదేశ్‌కు చెందిన దాలిన్ మానవబాంబు దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎ.సత్యనారాయణ (45) మృతి చెందగా, సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ వెంకట్‌రావు గాయపడ్డాడు.

పది రోజుల్లో సంగారెడ్డి, వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉద్యోగులు, పెన్షన్‌దారులు, పాత్రికేయుల కోసం ఉద్దేశించిన వెల్‌నెస్ సెంటర్లు సంగారెడ్డి, వరంగల్‌లో అందుబాటులోకి రానున్నాయి. నగదురహిత వైద్యాన్ని అందించేందుకు బయటి రోగుల కోసం వైద్యుల కన్సల్టేషన్, ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, ఔషధాలు పంపిణి, క్లిష్టమైన రోగాల సమయంలో ఇతర ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫారసు చేయడం కోసం వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పూర్వ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఆరు వెల్‌నెస్ సెంటర్‌లు, మిగిలిన పూర్వ 8 జిల్లాల్లో 8 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నగరంలోని ఖైరతాబాద్‌లో మొదట వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఆస్పత్రి నుండి తుమ్మల డిశ్చార్జ్

ఇంటికొచ్చి పరామర్శించిన గవర్నర్

మన తెలంగాణ / హైదరాబాద్ : నాల్గు రోజుల కిందట అల్సర్ కారణంగా రక్త వాంతులతో సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేరిన రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం నాడు డిశ్చార్జ్ అయ్యారు. త్వరిత గతిన కోలుకుంటున్న ఆయన ఫిలింనగర్‌లోని తన ఇంట్లోనే విశ్రాంతి తీసుకోనున్నారు. తుమ్మలను ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసిన తర్వాత గవర్నర్ ఇఎస్ఎల్ నర్సింహన్ ఫిలింనగర్‌లోని తుమ్మల నివాసానికి చేరుకుని తుమ్మల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. యశోదలో అత్యవసర చికిత్స విభాగంలోనే వైద్యులు వైద్య చికిత్సలను అందించారని ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా గవర్నర్‌కు తెలిపారు. తుమ్మల ఆస్పత్రిలో చేరిన తర్వాత సాగునీటి పారుదల శాఖ మంత్రి టి. హరీష్ రావు, ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ అరికెపూడి గాంధీ ప్రభృతులు ఆస్పత్రిలోనే ఆయన్ను పరామర్శించిన విషయం తెలిసిందే.

యాప్‌ను ప్రారంభిస్తున్న శ్రీదేవి

నేటి డిజిటల్ ప్రపంచంలో వార్తలు, విశేషాలు అందరికీ సులభంగా తెలిసిపోతున్నాయి. ముఖ్యంగా సెలబ్రిటీలకు సంబంధించిన వార్తలను అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు సినీ స్టార్లకు యాప్‌లున్నాయి. తమకు సంబంధించిన వార్తలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో పోస్ట్ చేస్తూ అభిమానులకు మరింత దగ్గరవుతున్నారు. ఈ తారలు. ప్రస్తుతం బాలీవుడ్ హీరోయిన్లలో పలువురికి యాప్‌లున్నాయి. సోనమ్‌కపూర్ ముందుగా తన యాప్‌ను ప్రారంభించిన తర్వాత దిశా పటాని, అమీ జాక్సన్, నర్గీస్ ఫక్రీలు తమ యాప్‌లను అభిమానుల ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడు ఆ లిస్ట్‌లోకి నిన్నటి తరం హీరోయిన్ శ్రీదేవి కూడా చేరింది. తన అభిమానుల కోసం ఒక యాప్‌ను డిజైన్ చేయిస్తోందట ఈ తార. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ "సోషల్ మీడియా అనేది అభిమానులకు దగ్గర కావడానికి మంచి మార్గం. అభిమానులతో నా జీవిత విశేషాలను పంచుకోవడానికి నేను ఇష్టపడతాను. అందుకే ఈ యాప్ ద్వారా నాకు సంబంధించిన పలు విశేషాలను తెలియజేస్తాను. అయితే ప్రతి దానిలోనే పాజిటివ్, నెగటివ్ ఉంటుంది. నాకైతే సోషల్ మీడియా ద్వారా ఎటువంటి ఇబ్బందని అనుకుంటున్నాను"అని చెప్పింది. అయితే బాలీవుడ్ స్టార్ హీరోలలో సల్మాన్‌ఖాన్‌కు 'బీయింగ్ హ్యూమన్' యాప్ ఉంది. కాగా పలువురు యంగ్ హీరో, హీరోయిన్లు కూడా తమ యాప్‌లు తీసుకురావాలని చూస్తున్నారు.





బోయపాటి శ్రీను

స్టార్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'జయ జానకి నాయక'. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్‌లు కథానాయికలు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఇంటర్వ్యూ...

ప్రేక్షకుల హృదయాన్ని తాకే జయ జానకి నాయక

'భద్ర'లాంటి లవ్ స్టోరీ...
దర్శకుడిగా నా తొలి చిత్రం 'భద్ర'ను మంచి లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్... ఇలా అన్ని ఎలిమెంట్స్ కలగలిపి బ్యూటిఫుల్ లవ్ స్టోరీగా ఎలా చేశానో అలాంటి లవ్ స్టోరీ 'జయ జానకి నాయక'. ఇందులో కూడా అద్భుతమైన ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి.

యాక్షన్‌తో కూడిన లవ్‌స్టోరీ...
సినిమా కొత్తగా ఉండాలనే ఆలోచనతోనే కొత్త టైటిల్ పెట్టడం జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన ఆరు సినిమాలు విభిన్నంగా ఉంటాయి. అయితే 'జయ జానకి నాయక'లో డిఫరెంట్ లవ్ స్టోరీతో పాటు నా స్టయిల్‌లో యాక్షన్ పార్ట్ కూడా ఉంటుంది. కథలో భాగంగానే పాటలు, ఫైట్స్ అన్నీ చక్కగా కుదిరాయి. ప్రేక్షకుల హృదయాన్ని తాకే చిత్రమిది.

ఇచ్చిన మాట కోసం...
మనకొక క్యారెక్టర్ ఉండాలి. మన మాటకు ఒక విలువుండాలి. ఆవిధంగా 'సరైనోడు' చిత్రం తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేస్తానని మాటిచ్చాను. ఇచ్చిన మాట కోసం ఈ సినిమా చేశాను. అలాగని ఏదో సినిమా చేయాలని కాకుండా నేను చేసిన ఆరు సినిమాలకంటే ఓ పాయింట్ ఎక్కువగానే ఈ సినిమాను తెరకెక్కించాను.

అతనిలాంటి యువకుడు ఉండాలనుకుంటారు...
యంగ్ హీరో శ్రీను రా మెటీరియల్. ఈ సినిమా కోసం 25–30 కిలోల బరువు పెరిగాడు. ఆ తర్వాత 17 కిలోల వరకు తగ్గి మేకోవరు అయ్యాడు. ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు బెల్లంకొండ శ్రీనివాస్ వంటి యువకుడు మన కుటుంబంలో ఉండాలని కోరుకుంటారు.

బాడీలాంగ్వేజ్‌కు అనుగుణంగా...
'లెజెండ్' తర్వాత అల్లు అర్జున్‌తో 'సరైనోడు' సినిమా చేసే సమయంలో ఆ చిత్రాన్ని ఎలా తీస్తానోనని అనుకున్నారు. అయితే సరైనోడు చిత్రాన్ని బన్నీ బాడీ లాంగ్వేజ్‌కు తగినట్లుగానే తెరకెక్కించాను. అలాగే 'జయ జానకి నాయక'ను బెల్లంకొండ శ్రీనివాస్ బాడీలాంగ్వేజ్‌కు అనుగుణంగా తెరకెక్కించాను. డైలాగ్స్ కూడా తన వయసుకు తగ్గట్టే ఉంటాయి. ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతులను మిగిల్చే చిత్రమిది.

అమ్మాయిలకు మంచి సందేశం...
నేను ఇప్పటివరకు చేసిన ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశాన్ని అందిస్తూనే వచ్చాను. అలాగే ఈ సినిమాలో అమ్మాయిలకు సంబంధించి మంచి సందేశం ఉంటుంది. నిజమైన ప్రేమ అంటే ఏమిటి? మనం అమ్మాయిలను ఎలా కాపాడుకోవాలని ఈ సినిమాలో చూపించాను.

బడ్జెట్‌కు మించి బిజినెస్...
సినిమా నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. అందుకే ముందుగా అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువైంది. అలాగే సినిమా బిజినెస్ బడ్జెట్‌ను మించి అయింది. ఎందుకంటే నేను సినిమా చేసేటప్పుడు ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్లు నా సినిమాపై కొన్ని అంచనాలతో ఉంటారు. ఆ అంచనాలకు తగ్గకుండా సినిమా చేస్తాను. అలాగే ప్రతి సినిమాను మొదటి సినిమాలా ఫీలై చేస్తాను.

సినిమాలంటే ప్యాషన్...
చిత్ర నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డికి సినిమాలంటే ప్యాషన్. నన్ను కలిసిన రోజు అతను ఒక మాట అన్నాడు. 'సార్... నేను జీవితంలో చెప్పుకునే సినిమా ఒకటి చేయాలి. తెలుగు ప్రేక్షకులకు దగ్గరవ్వాలి. డబ్బు విషయంలో రాజీపడను' అని చెప్పాడు. తన మాట ప్రకారం ఎక్కడ ఎంత అవసరమో అంతగా ఖర్చు పెట్టి చేసిన సినిమా ఇది.

నెక్స్ట్ మూవీస్...
ప్రస్తుతం చిరంజీవి 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' సినిమా చేయబోతున్నారు. ఆతర్వాత ఏ సినిమా చేస్తారో తెలియదు కానీ... ఆయనకు తగిన కథను సిద్ధం చేశాను. ఇంకా రెండు నెలల సమయం తీసుకొని కథ బాగా వచ్చేలా రాసుకుంటున్నాను.
అలాగే మహేష్‌బాబుకు తగ్గ కథ కూడా రెడీగా ఉంది. ఇప్పటివరకు ఆయన చేయని జోనర్ మూవీ ఇది. ఈ సినిమాకు ఆయన డేట్స్ ఎక్కువగా కావాల్సి ఉంటుంది. అలాగే వచ్చే ఏడాది జూన్, జూలైలోపు బాలకృష్ణతో సినిమా ప్రారంభిస్తాను.

సాయిధరమ్‌తేజ్ హీరోగా సినిమా ప్రారంభం



సికె ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త సినిమా ప్రారంభ కార్యక్రమంలో చిరంజీవి, వివి వినాయక్, సాయిధరమ్‌తేజ్, సి.కళ్యాణ్ తదితరులు

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా లావణ్య త్రిపాఠి కథానాయికగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మెగాస్టార్ చిరంజీవి ఈ చిత్రాన్ని ప్రారంభించి చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. హీరో సాయిధరమ్‌తేజ్‌పై తీసిన ముహూర్తపు సన్నివేశానికి పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్‌నివ్వగా... సత్యానంద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ చిత్రానికి కథ, మాటలు అందించిన ఆకుల శివ ఫస్ట్ షాట్‌ను డైరెక్ట్ చేశారు. సాయిధరమ్‌తేజ్ తల్లి అయిన విజయదుర్గ స్క్రిప్ట్‌ను అందించారు. ఈ పవర్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమవుతుందని ఫిల్మ్‌మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః విశ్వేశ్వర్,ఎడిటింగ్ః గౌతంరాజు, ఆర్ట్ః బ్రహ్మ కడలి, కో డైరెక్టర్స్ః సూర్యదేవర ప్రభాకర్ నాగ్, పుల్లారావు కొప్పినీడి, సహ నిర్మాతలుః సి.వి.రావు, పత్స నాగరాజా.

అబద్ధాలాడే పాతబస్తీ కుర్రాడు

'కృష్ణగాడి వీర ప్రేమగాథ' చిత్రంతో మంచి సక్సెస్ అందుకున్న దర్శకుడు హను రాఘవపూడి ప్రస్తుతం నితిన్ హీరోగా తెరకెక్కించిన చిత్రం 'లై'. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లి. పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మించిన చిత్రమిది. 'లై' శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు హను రాఘవపూడి చెప్పిన సినిమా విశేషాలు...



హను రాఘవపూడి

ఊహించని మలుపులు...
సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుంది 'లై'. ఎప్పుడూ అబద్ధలాడే ఒక కుర్రాడు చెప్పిన ఒక అబద్ధం అతన్ని ఓ పెద్ద సమస్యలోకి తీసుకెళ్లి పడేస్తుంది. అప్పుడు కథ పూర్తిగా యూ టర్న్ తీసుకుంటుంది. కథలో ప్రేక్షకులు ఊహించని మంచి మలుపులుంటాయి.

ఈజీ మనీ కోసం...
అబద్ధాలతో జీవితాన్ని కొనసాగించే పాత్రలో నితిన్ కొత్తగా కనిపిస్తాడు. ఈజీ మనీ కోసం అతను ప్రయత్నిస్తుంటాడు. పాత బస్తీలోని అతని కథ ఎక్కడికి వెళ్లింది? ఎలా వెళ్లింది? దాని వెనుక ఎవరున్నారు అనేదే సినిమా.

కథ చెప్పడానికి భయమేసింది...
సినిమాలో విలన్‌గా అర్జున్ పాత్ర చాలా బలంగా ఉంటుంది. ఆయన పాత్రతోనే ఈ కథ మొదలైంది. కొత్తగా ఉండాలని విలన్ క్యారెక్టర్ కోసం అర్జున్‌ను ఎంపిక చేశాను. అసలు ఆయనకు ఈ కథ చెప్పడానికి భయమేసింది. చెప్పగానే వెంటనే ఒప్పుకున్నారు.

అన్నీ ఆడాలని కోరుకుందాం...
మా సినిమా షూటింగ్ మొదలుపెట్టినప్పుడే ఆగస్టు 11న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశాం. కానీ అనుకోకుండా అదే రోజున మరో రెండు సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. అయితే ఏ సినిమా అయినా బాగుంటేనే ఆడుతుంది. అన్ని సినిమాలు ఆడాలని కోరుకుందాం.

ఆద్యంతం ఆసక్తికరంగా...
'లై'లో 90 శాతం సన్నివేశాలు చాలా బాగుంటాయి. మిగతా10 శాతం కనెక్టింగ్ సీన్స్ ఉంటాయి. అవే కథను కలుపుతుంటాయి. ఆద్యంతం ఆసక్తికరంగా సినిమా కొనసాగుతుంది. నితిన్, అర్జున్ పాత్రలు ఎక్కువ హైలైట్ అవుతాయి.

సహజంగా నటిస్తుంది...
మేఘా ఆకాష్ చాలా బాగా చేసింది. ఆమె సహజంగా నటిస్తుంది. రాని భావాన్ని ముఖంలోకి తీసుకురాదు. సీన్‌లో సహజంగా కనిపిస్తుంది. అదే ఆమెకు పెద్ద ప్లస్ పాయింట్. సినిమా చూస్తే ఆమెకిది మొదటి సినిమా అని అనుకోరు.

కథలోనే హాస్యం...
సినిమాలో విడిగా కామెడీ అంటూ ఏం ఉండదు. కథలోనే హాస్యం ఉంటుంది. నా మొదటి సినిమా 'కృష్ణగాడి వీర ప్రేమగాథ'లో కొన్ని కామెడీ సీన్లను జత చేశాను. ఇందులో మాత్రం అలా ఉండదు. ఈ సినిమాలో కామెడీ అందరినీ నవ్విస్తుంది.

పాటలన్నీ మ్యూజికల్ హిట్‌గా...
నా రెండు సినిమాలకు కొత్త సంగీత దర్శకులతోనే పనిచేయడం జరిగింది. కానీ ఈసారి కావాలనే మణిశర్మను ఎంచుకున్నాను. ఆయన చాలా కష్టపడి మంచి మ్యూజిక్ ఇచ్చారు. పాటలన్నీ మ్యూజికల్ హిట్‌గా నిలవడం ఆనందంగా ఉంది.

తదుపరి చిత్రాలు...
నాని, నితిన్‌తో నా నెక్స్ట్ సినిమాలుంటాయి. నాని సినిమాను ఇప్పుడే చేయలేం. ఎందుకంటే అది ఆర్మీ బేస్డ్ సినిమా. మే తర్వాత చేయగలం. ఆ సినిమాకు పర్మిషన్ ఇబ్బందులున్నాయి.

ప్రతి లవర్ ఒక ఇడియట్టే!



అజయ్ వోధిరాల, నవీన్‌చంద్ర, కొత్తపల్లి ఆర్.రఘుబాబు

నవీన్‌చంద్ర, నివేదా థామస్ జంటగా నటిస్తున్న చిత్రం 'జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్'. కొత్తపల్లి అనురాధ సమర్పణలో అనురాగ్ ప్రొడక్షన్స్ పతాకంపై కొత్తపల్లి ఆర్.రఘుబాబు, కె.బి.చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం అజయ్ వోధిరాల దర్శకత్వంలో రూపొందుతోంది. ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ప్రతి లవర్ ఒక ఇడియట్టే. టైటిల్‌లో ఉన్నట్లే నేనొక ఇడియట్‌లాంటి లవర్‌లా సినిమాలో కనపడతాను. దర్శకుడు అజయ్ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. డైలాగ్స్ చాలా బావున్నాయి. నివేదా థామస్ చాలా ప్రొఫెషనల్. ఈ సినిమాలో కొత్తగా కనపడుతుంది. షూటింగ్ పనులన్నీ పూర్తయ్యాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి"అని అన్నారు. కొత్తపల్లి ఆర్.రఘుబాబు మాట్లాడుతూ "ఈ కథకు నవీన్‌చంద్ర సరిపోతాడని భావించాం. కథ చెప్పగానే ఓకే చెప్పడం జరిగింది. నవీన్, నివేదా థామస్ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది"అని చెప్పారు. దర్శకుడు అజయ్ వోధిరాల మాట్లాడుతూ "ఓ ఇడియట్ లవ్ చేస్తే ఎలా ఉంటుందని ఆలోచించి ఈ కథ తయారుచేశాం. కా మెడీ, ఎమోషన్స్ అన్నీ చక్కగా ఉంటాయి. నవీన్‌కు హీరోగా మంచి పేరు తెచ్చే సినిమా ఇది"అని అన్నారు.

కామెడీ థ్రిల్లర్ రావోయి..మా ఇంటికి



'రావోయి... మా ఇంటికి' ఆడియో వేడుకలో రేలంగి నరసింహారావు, సాకేత్ సాయిరామ్, అవంతిక, కె.దిలీప్ రెడ్డి తదితరులు

శ్రీధర్, కావ్యాసింగ్, అవంతిక హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రావోయి... మా ఇంటికి'. బ్లాక్ పెప్పర్ స్క్రీన్స్ పతాకంపై డాలీభట్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాకేత్ సాయిరామ్ దర్శకుడు. సినిమాలో కీలక పాత్ర పోషిస్తూ సంగీతాన్ని కూడా అందిస్తున్నాడు సాకేత్ సాయిరామ్. ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తొలి సీడీని ఆవిష్కరించి సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావుకు అందజేశారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "సాకేత్ నా చిత్రంతోనే సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. అతను మంచి మ్యూజిక్ డైరెక్టర్. థ్రిల్లర్ కామెడీ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించాడు. పాటలు, సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. దర్శకుడు సాకేత్ సాయిరాం మాట్లాడుతూ "30 శాతం థ్రిల్లర్, 70 శాతం కామెడీ అంశాలతో తెరకెక్కుతున్న సినిమా ఇది. కాన్సెప్ట్‌ను నమ్ముకొని ఈ సినిమాను రూపొందిస్తున్నాం. కథే హీరో. ప్రతి పాత్రలోనూ వైవిధ్యం ఉంటుంది. ఇందులో మొత్తం ఐదు పాటలున్నాయి. అన్నీ వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి"అని తెలిపారు. హీరో శ్రీధర్ మాట్లాడుతూ "కామెడీ సినిమా అయినా ప్రతి పాత్రలోనూ వేరియేషన్స్ ఉంటాయి. నా పాత్రలో రెండు, మూడు వేరియేషన్స్ కనిపిస్తాయి"అని చెప్పారు. హీరోయిన్ అవంతిక మాట్లాడుతూ రొటీన్ కామెడీ సినిమాలకు భిన్నంగా మా సినిమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.దిలీప్‌కుమార్ రెడ్డి, అమృత్‌పులి, డి.కె.గోయల్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.